మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
కపిల్ చిట్స్
KAPIL GROUP
46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

ESTD: 1999
www.voodayam.com

# వుదయం

సంపుటి : 27 సంచిక : 118 | హైదరాబాద్ | 30-06-2026 మంగళవారం
SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY
రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal
Follow us on

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
కపిల్ చిట్స్
KAPIL GROUP
46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

## చిన్న వయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చాను

**చిన్న వయసులోనే రాజకీయాల్లోకి వచ్చాను**

**రాజకీయాల్లోకి వచ్చాక**

**నా భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డాను**

**ఓపిక, నిలకడతో చేసినప్పుడే ఫలితాలు వస్తాయి**

**జీవితం.. వంద మీటర్ల పరుగు పందెం కాదు**

**బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్**



**ఘట్‌కేసర్, జూన్ 29 (వుదయం ప్రతినిధి) :** జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదని.. మన ఓపికకు పరీక్ష అని బిజెపి జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ వీబీఐటీ క్యాంపస్‌లో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. రాజకీయాల్లో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ''చిన్న వయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చాను. రాజకీయాల్లోకి వచ్చాక నా భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డాను. ఏ పని చేసినా నాదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నాను. అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే నా బలం. వేగంగా లక్ష్యాలు చేరాలనే ఆరాటంలో నేటి యువత ఉంది. ఏ పనినైనా ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే ఫలితాలు వస్తాయి'' అని అన్నారు.

# ప్రపంచ మార్కెట్లపై తెలంగాణ దృష్టి

## బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణను ప్రపంచ బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- బియ్యం ఎగుమతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలపై ప్రభుత్వం సానుకూల పరిశీలన
- రైతులు, రైస్ మిల్లర్లకు రెట్టింపు లాభాలే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- దేశీయంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ బియ్యానికి భారీ అవకాశాలు
- నాణ్యమైన బియ్యం ఎగుమతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది
- ఫోర్టిఫైడ్, మల్టీ విటమిన్ రైస్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం
- బియ్యానికి విలువ జోడిస్తే రైతుల ఆదాయం, మిల్లర్ల లాభాలు పెరుగుతాయి
- తెలంగాణలో ఉత్పత్తయ్యే బియ్యం ప్రపంచ మార్కెట్లలో సత్తా చాటే సామర్థ్యం ఉంది
- యాసంగిలో 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన రాష్ట్రం తెలంగాణ
- రైతుల ఖాతాల్లోకి ఇప్పటికే రూ.19,303 కోట్లు నేరుగా జమ చేశాం
- పారదర్శకంగా, వేగంగా రైతులకు చెల్లింపులు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది
- రాష్ట్రంలో వార్షిక బియ్యం ఉత్పత్తి 300 లక్షల మెట్రిక్ టన్నులు దాటింది
- సాగునీటి విప్లవమే తెలంగాణ వ్యవసాయ విజయానికి బలమైన పునాది
- సాగునీటి విస్తరణతో తెలంగాణ దేశంలో అగ్రగామి ధాన్య ఉత్పత్తి రాష్ట్రంగా ఎదిగింది
- రైతుల ఆదాయం పెంపు.. రైస్ మిల్లింగ్ పరిశ్రమ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం
- బియ్యం ఎగుమతులతో తెలంగాణకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తాం



**హైదరాబాద్, జూన్ 29 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో బియ్యం ఎగుమతులను భారీ స్థాయిలో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రాన్ని దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయి బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోనీ ఓ ప్రైవేట్ హోటల్ లో కేసీపీ న్యూట్రీ సంస్థ రూపొందించిన మల్టీ విటమిన్ రైస్ ఉత్పత్తులను సోమవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న బియ్యానికి దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లలోనూ విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు."ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది గానీ ఎగుమతుల కోసం కాదని, అందుకే తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానంతో ముందుకు వెళ్లి బియ్యం ఎగుమతులను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపడుతోంది" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

మిగతా 2లో



## ఖమేనీ అంత్యక్రియలకు రెండు కోట్లకు మంది

**హాజరయ్యే అవకాశం : ఇరాన్ అధికార వర్గాలు**

**భారత్ తరపున కేంద్ర విదేశాంగశాఖ**

**సహాయ మంత్రి పవిత్ర మార్గరిటా, బిహార్**

**గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ హాజరు**

**టెహ్రాన్, జూన్ 29 :** అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జులై 5 నుంచి 9 వరకు అంత్యక్రియల కార్యక్రమం జరగనుంది. భారత్ తరపున కేంద్ర విదేశాంగశాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరిటా, బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ హాజరుకానున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఇరాన్ వర్గాలు పేర్కొనగా.. దీనిపై ఇంతవరకు భారత ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టిన తొలి రోజే 86 ఏళ్ల అలీ ఖమేనీ సహా 40 మంది అత్యున్నత సైనికాధికారులు మృతి చెందారు. ఖమేనీ కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు మృతి చెందగా.. కుమారుడు మొజ్తాబా కూడా గాయపడినట్లు వార్తలు వచ్చాయి. జులై 9న ఖమేనీ స్వస్థలం మషాద్‌లో ఆయనను ఖననం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రెండు కోట్లకు మంది వరకు హాజరయ్యే అవకాశం ఉందని ఇరాన్ అధికార వర్గాలు చెబుతున్నాయి. అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ ని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఆహ్వానించినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.

మిగతా 2లో

## నాణ్యమైన విత్తనాలను మాత్రమే అన్నదాతలు వినియోగించాలి

**ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతుల సంస్కృతికి ప్రతీక**

**పడి పాడి పంటలతో ఆయురారోగ్యాలతో రైతులు ఉండాలి**

**రైతన్నల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యం : మంత్రి పొన్నం ప్రభాకర్**



**సిద్దిపేట, జూన్ 29 :** ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతుల సంస్కృతికి ప్రతీక అని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. రైతులందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలంలోని కూరెళ్ల గ్రామంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రైతులతో కలిసి మంత్రి పొన్నం దుక్కి దున్ని విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు పడి పాడి పంటలతో ఆయురారోగ్యాలతో రైతులు ఉండాలని మంత్రి పొన్నం ఆకాంక్షించారు. అన్నదాతలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. అందుకే తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలను మాత్రమే అన్నదాతలు వినియోగించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతన్నలు ముందుకు సాగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## విబి జీ రామ్ జీ పై ఆలోచించి ప్రభుత్వం నిర్ణయం

**రాష్ట్రాలపై భారం తగ్గిస్తేనే 'వికసిత్ గ్రామాలు : మంత్రి సీతక్క**

**ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో పాత 100 శాతం వేతనాల విధానమే కొనసాగించాలి**

**కొత్త విధానం వల్ల రాష్ట్రాలపై భారీ ఆర్థిక భారం పెరుగుతుంది**

**అటవీ క్లియరెన్స్‌పై కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం**



**న్యూఢిల్లీ, జూన్ 29 (వుదయం బ్యూరో) :** విబి జీ రామ్ జీ పథకం అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీయ సదస్సులో కేంద్రానికి వివరించారు. జులై 2న విబి జీ రామ్ జీపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. విబి జీ రామ్ జీ పథకం కొనసాగించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని..100శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోందని వివరించారు. విబి జీ రామ్ జీ పై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. రాష్ట్రాలపై భారం తగ్గిస్తేనే 'వికసిత్ గ్రామాలు-2047' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు.

మిగతా 2లో

## రైతు ఆశీర్వాద సభకు అడ్డుపడ్డ వరుణుడు

**మధిర రైతు ఆశీర్వాద సభ రద్దు**

**హైదరాబాద్‌లో సభ**

**విడుదల చేయనున్న**

**రైతు భరోసా నిధులు**



**హైదరాబాద్, జూన్ 29 (ఎఎంఎస్) :** ఖమ్మం జిల్లా మంగళవారం జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ రద్దైంది. వర్షాల కారణంగా సభ నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో మధిరలో జరగాల్సిన సీఎం రేవంత్ రెడ్డి సభలో మార్పులు చేశారు. రేపు సాయంత్రం హైదరాబాద్ శిల్పకళా వేదికలో రైతుభరోసా పంపిణీ సదస్సు నిర్వహించనున్నారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి.. రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మంత్రులు, అధికారులను సీఎం ఆదేశించారు. మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో రేపు రైతు ఆశీర్వాద సభ జరగాల్సి ఉంది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై.. రైతుభరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

మిగతా 2లో

## ఫ్రాన్స్‌తో పర్యాటక, సాంస్కృతిక బంధానికి కృషి

**పర్యాటక రంగాన్ని ఫ్రెంచ్ పర్యాటకులకు చేరువ చేద్దాం**

**సాంస్కృతిక మార్పిడితోనే పర్యాటకం, పెట్టుబడులకు ఊతం**

**మంత్రి జూపల్లిని కలిసిన ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్**

**పర్యాటక, వారసత్వ రంగాల్లో సంయుక్త కార్యాచరణకు ప్రతిపాదన**



**హైదరాబాద్, జూన్ 29 (ఎఎంఎస్) :** తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ , డిప్యూటీ కాన్సుల్ పాస్కల్ లోరియో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ-ఫ్రాన్స్ మధ్య పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, పెట్టుబడులు, ప్రజల మధ్య పరస్పర సంబంధాల బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణకు గొప్ప

మిగతా 2లో

# గుప్పెడు గుండెకు భరోసా!

**ప్రాణాలను కాపాడే 'గోల్డెన్ అవర్' వైద్యం..** గుండెపోటు వచ్చిన తొలి గంట అత్యంత కీలకం. అదే సమయంలో యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ వంటి చికిత్సలు అందితే రోగి ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. ఈ అత్యవసర సేవల ప్రాధాన్యతను గుర్తించిన సింగరేణి యాజమాన్యం, అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా అత్యాధునిక సాంకేతికతతో ఈ క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. బొగ్గు బెల్ట్ ప్రజలకు సకాలంలో, తక్కువ వ్యవధిలోనే అత్యుత్తమ వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.



**క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు ఎందుకు..** గుండె సమస్య అన్నది నేడు వయో భేదం లేకుండా ప్రతీ ఒక్కరూ ఎదుర్కొంటున్న అతి ప్రాణాంతక జబ్బు. ఇది ఎప్పుడు వస్తుందో అంచనా వేయడం కష్టమే కానీ, ఈ సమస్య తలెత్తిన తొలి గంట అత్యంత కీలకమని వైద్యులు పేర్కొంటారు. దీన్ని గోల్డెన్ అవర్‌గా పేర్కొంటారు. ఈ సమయంలో సత్వరమే చికిత్స అందించగలిగితే విలువైన ప్రాణాలను కాపాడవచ్చు. అయితే సింగరేణి విస్తరించిన ప్రాంతాల్లో కంపెనీ ఆధ్వర్యంలో అనేక ఆధునిక వైద్య సౌకర్యాలు గల ఏరియా ఆసుపత్రులు ఉన్నప్పటికీ అందులో కార్డియాక్ సంబంధిత సేవలు పరిమిత స్థాయిలో ఉన్నాయి. ఇప్పటి వరకు గుండెపోటు వచ్చిన రోగులను హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి సుదూర నగరాలకు తరలించాల్సి వచ్చేది. ఆ సుదీర్ఘ ప్రయాణంలో అమూల్యమైన "గోల్డెన్ అవర్" (రక్షించదగిన తొలి గంట) వృథా అవుతుండేవి. ఈ నేపథ్యంలోనే గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ ను సింగరేణి ఏర్పాటు చేసింది.

- గోదావరిఖనిలో తొలి క్యాథ్ ల్యాబ్‌తో కోల్ బెల్ట్ ప్రజలకు అత్యాధునిక గుండె వైద్యం
- ప్రభుత్వ ఆదేశం మేరకు ఏడాదిలోనే ఏర్పాటైన క్యాథ్ ల్యాబ్.. ఏటా 6 కోట్ల వ్యయం
- గుండె జబ్బు అత్యవసర చికిత్స ఇక స్థానికంగానే వేలాది ప్రాణాలకు భరోసా
- కార్మిక కుటుంబాల సంక్షేమం దిశగా సింగరేణి మరో ముందడుగు

**సింగరేణి భవన్, జూన్ 29, (వుదయం ప్రతినిధి) :** దేశానికి వెలుగులు పంచే కార్మికుల ఆరోగ్య పరిరక్షణ దిశగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ మరో కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థకు గుండెకాయగా ఉన్న కార్మికుల హృదయాలకు గట్టి భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను రామగుండం-1 ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసింది. త్వరలో లాంఛనంగా ప్రారంభానికి సిద్ధంగా ఉంది. సింగరేణి కార్మికులకు అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల నేపథ్యంలో సింగరేణి ఉద్యోగులు ఎక్కువగా నివసించే (దాదాపు 33 వేల మంది) గోదావరిఖని ప్రాంతంలో సింగరేణి సంస్థ తొలి క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం విశేషం. దీంతో పెద్దపల్లి, మంచిర్యాల, కొమురమ్ భీమ్ ఆసిఫాబాద్, ప్రొఫెసర్ జయశంకర్ భూపాల పల్లి జిల్లా ల్లో నివసిస్తున్న వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత సింగరేణి ఉద్యోగులతోపాటు సమీప గ్రామాల ప్రజల హృదయాలకు సింగరేణి గట్టి భరోసాను ఇచ్చినట్లు అయింది.

మిగతా 2లో

## హరీశ్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

**ప్రజలు ఐదేళ్లకు తీర్పునిచ్చారు.. ఎందుకు అసెంబ్లీని రద్దు చేయాలి**

**ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష వేస్తూనే ఉన్నారు**

**బిజేపీది ఆశకాదు.. అత్యాశ : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**రైతు భరోసా నిధులు వారంరోజుల్లో జమచేస్తాం**



**హైదరాబాద్, జూన్ 29 (వుదయం ప్రతినిధి)** బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతున్న తీరు చూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రిగారు మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు వ్యాఖ్యలపై పై విధంగా స్పందించారు. తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికారమిచ్చారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్ రావుకు తెలుసు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బిఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయి. ఈ ప్రభుత్వం చేసే మంచి పనులను జీర్ణించుకోలేక భవిష్యత్తు లో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. నా నియోజకవర్గం

మిగతా 2లో



## ఫ్రాన్స్‌తో పర్యాటక, సాంస్కృతిక బంధానికి కృషి

మొదటి పేజీ తరువాయి

చారిత్రక, సాంస్కృతిక వారసత్వం ఉందని, హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదుగుతూనే తన సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షించుకుంటోందని అన్నారు. తెలంగాణ పర్యాటక విశేషాలను ఫ్రాన్స్‌లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం, ఫ్రెంచ్ ఎంబసీ, పర్యాటక సంస్థలు భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, పరస్పర పర్యటనలను మరింత విస్తరించాలని సూచించారు. తెలంగాణ–ఫ్రాన్స్ మధ్య ఉన్న సాంస్కృతిక సారూప్యతలు, వారసత్వ పరిరక్షణ, పర్యాటకాభివృద్ధి అవకాశాలను గుర్తించేందుకు సంయుక్త బృందాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి ప్రతిపాదించారు. దీనివల్ల ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక సహకారానికి బాటలు పడతాయని తెలిపారు. ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ మాట్లాడుతూ పర్యాటకం దేశ ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు, విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు కీలక రంగమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా సందర్శించే దేశాల్లో ఫ్రాన్స్ ఒకటని, ప్రతి సంవత్సరం 10 కోట్లకు పైగా అంతర్జాతీయ పర్యాటకులు ఫ్రాన్స్‌ను సందర్శిస్తున్నారని తెలిపారు. పర్యాటకం, సంస్కృతి రంగాల అభివృద్ధి ద్వారా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ప్రజల మధ్య సంబంధాలు మరింత బలోపేతమవుతాయని చెప్పారు. భారత్–ఫ్రాన్స్ మధ్య రక్షణ, ఔషధ తయారీ, సాంకేతిక రంగాల్లో బలమైన భాగస్వామ్యం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో సుమారు 200 మంది ఫ్రెంచ్ పౌరులు నివసిస్తున్నారని తెలిపారు. తెలంగాణతో పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ రంగాల్లో మరింత సహకారానికి ఫ్రాన్స్ సిద్ధంగా ఉందని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ పర్యాటక ప్రాంతాలను ఫ్రెంచ్ పర్యాటకులకు మరింత చేరువ చేసేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

## హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

మొదటి పేజీ తరువాయి

పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయి. బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించను. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతా. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదు. ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టే. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురాం. అధికారంలోకి వస్తామని బిజేపీ పగటికలలు కంటోంది. ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ అధికారం గురించి ఆశ పడుతోంది. బిజేపీ, బిఆర్ఎస్ ఒకే తాను ముక్కలు. కాళేశ్వరం అవినీతి, ధర్మల్ పవర్ ప్లాంట్ అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని అడిగితే బిజేపీ ఇప్పటివరకు స్పందించలేదు. ఈ సారి రైతు భరోసా నిధులను అనుకున్నదానికంటే రెండు మూడు రోజుల ముందే వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో జమచేస్తాం. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించడం జరిగింది. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదు. భూముల ధరల సవరణలు ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే సరిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. తాండూరులో ఇదే విధంగా జరిగితే సరిదిద్దడం జరిగింది. అని మంత్రి పొంగులేటి అన్నారు.

## రైతు ఆశీర్వాద సభకు అడ్డుపడ్డ వరుణుడు

మొదటి పేజీ తరువాయి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. దాదాపు లక్ష మందితో సభ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుని... అందుకు తగ్గట్టుగా జగన్నాథపురంలో ఏర్పాట్లు చేశారు. అయితే, రెండు రోజులుగా కురుస్తున్న భారీగా వర్షాలకు సభా ప్రాంగణంలో పెద్దఎత్తున వరద నీరు చేరుకుంది. దీంతో సభ నిర్వహించేందుకు అవకాశం లేదని మంత్రులు, సీఎంవో కార్యాలయానికి జిల్లా అధికారులు తెలియజేశారు. దీంతో ప్రభుత్వం మధిరలో సభను రద్దు చేసి.. సభా వేదికను హైదరాబాద్‌కు మార్చింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమ తమ రైతు వేదికల నుంచి ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

## బస్సు బోల్తా.. 30 మంది ప్రయాణికులకు గాయాలు

**వనపర్తి, జూన్ 29 (వుదయం ప్రతినిధి) :** వనపర్తి జిల్లా పెబ్బేరు సమీపంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై ప్రయాణికులతో వెళ్తున్న టీజీఎస్ఆర్టీసీ బస్సు సోమవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 30 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. రహదారిపై వెళ్తున్న వాహనదారులతో పాటు స్థానికులు వెంటనే స్పందించి.. వారిని పెబ్బేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రయాణికులకు స్వల్పంగా గాయాలయ్యాయని వైద్యులు వెల్లడించారు. వారికి ప్రాథమిక చికిత్స అందించినట్లు చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులతోపాటు ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారని తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు వెంటనే బోల్తా పడిన బస్సును రహదారిపై నుంచి తొలగించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## సర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, జూన్ 29 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సర్ ప్రక్రియపై సోమవారం బిఆర్ కె భవన్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ ప్రారంభమైన కేవలం నాలుగు రోజులలోనే దాదాపు 1.73 కోట్ల ఎన్యుమరేషన్ ఫారాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేయడంపై బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల అధికారుల పనితీరు పట్ల సిఇఒ అభినందించారు. నిర్ణీత గడువులోగా 100శాతం ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసేందుకు సంబంధిత జిల్లా స్థాయి అధికారులు బిఎల్‌ఓలను ప్రోత్సహించాలని సూచించారు. బిఎల్వో లు తమ విధులను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2026 కార్యక్రమంలో రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు చురుకుగా పాల్గొని తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఎఈఆర్వోలు, ఈఆర్వోలు విస్తృతంగా క్షేత్ర స్థాయిలో పర్యటనలు నిర్వహించి, బిఎల్వో లకు అవసరమైన సూచనలు అందించి ప్రజలతో అనుసంధానం పెంచాలని, ఓటరు హెల్ప్‌లైన్ 1950, హెల్ప్‌డెస్క్ నంబర్లపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.




# ప్రపంచ మార్కెట్లపై తెలంగాణ దృష్టి

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర రైతులు, రైస్ మిల్లర్ల ప్రయోజనాల కోసం దేశీయ మార్కెట్లతో పాటు విదేశీ మార్కెట్లను కూడా లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎగుమతులు చేపట్టే పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన అనుమతులను సైతం వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ..

తెలంగాణ వ్యవసాయ రంగం సాధించిన ప్రగతిని వివరిస్తూ మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది యాసంగి సీజన్‌లోనే రాష్ట్ర ప్రభుత్వం 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, అదే సమయంలో భౌగోళికంగా పెద్ద రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 25 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు మాత్రమే జరిగిందని పేర్కొన్నారు. "ఇది తెలంగాణ వ్యవసాయ సామర్థ్యానికి, రైతుల శ్రమకు, మా ప్రభుత్వ రైతు అనుకూల విధానాలకు నిదర్శనం" అని ఆయన అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు కోసం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ఇప్పటికే రూ.19,303 కోట్లను నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. పారదర్శకతతో, వేగవంతంగా రైతులకు చెల్లింపులు జరిపిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. వానాకాలం, యాసంగి సీజన్లను కలిపి చూస్తే రాష్ట్రంలో బియ్యం ఉత్పత్తి 300 లక్షల మెట్రిక్ టన్నులు (300 ఎల్ఎంటీలు) దాటిందని తెలిపారు. రాష్ట్ర ప్రజల వినియోగం సంవత్సరానికి కేవలం 36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉండటంతో తెలంగాణ ఇప్పుడు మిగులు బియ్యం ఉత్పత్తి రాష్ట్రంగా ఎదిగిందని పేర్కొన్నారు.

విలువ జోడింపే భవిష్యత్తు..

రైస్ పరిశ్రమ ఆధునిక సాంకేతికతను స్వీకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. మల్టీ విటమిన్ రైస్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలోనూ మంచి ఆదరణ పొందే అవకాశముందని చెప్పారు. "తెలంగాణలో మాత్రమే విక్రయాలపై ఆధారపడకుండా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను లక్ష్యంగా చేసుకోవాలి. రాష్ట్ర ఉత్పత్తులు ఇతర రాష్ట్రాలు, విదేశీ మార్కెట్లకు చేరేలా ప్రభుత్వం అవసరమైన ప్రతి సహాయాన్ని అందిస్తుంది" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.




**సాగునీటి విప్లవమే వ్యవసాయ విజయానికి పునాది..**

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ, సాగునీటి విస్తరణ, రైతులకు నిరంతర నీటి లభ్యత కల్పించడం వల్లే రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం చేపట్టిన భారీ పెట్టుబడుల ఫలితంగానే తెలంగాణ దేశంలో అగ్రగామి ధాన్య ఉత్పత్తి రాష్ట్రంగా అవతరించిందని ఆయన పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెరగడం, రైస్ మిల్లింగ్ పరిశ్రమ బలోపేతం కావడం, బియ్యం ఎగుమతుల ద్వారా తెలంగాణకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# గుప్పెడు గుండెకు భరోసా!

మొదటి పేజీ తరువాయి

**కార్మికుడి ఆరోగ్యమే సంస్థ సంపద**

కార్మికుల ఆరోగ్యం కోసం సింగరేణి సంస్థ ఏటా 300 కోట్ల రూపాయలకు పైగా వెచ్చిస్తోంది. ముఖ్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల రెఫరల్స్ కోసమే అధిక మొత్తం నిధులను కేటాయిస్తోంది. గత ఏడాది మాత్రమే హృద్రోగ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న సుమారు 3,000 మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులను భూపాలపల్లి, బెల్లంపల్లి, రామగుండం, రామకృష్ణాపూర్ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయడం జరిగింది. అయితే గుండె జబ్బుల విషయంలో ప్రతీ నిమిషయం విలువైనదే కావడంతో లక్షల రూపాయలు వెచ్చించడం కంటే సకాలంలో అత్యాధునిక చికిత్స అందించడం ద్వారానే ప్రాణాలను కాపాడవచ్చనే దృఢ సంకల్పంతో సింగరేణి యాజమాన్యం గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మరో మారు కార్మిక సంక్షేమంలో సింగరేణి దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఈ ముందడుగు ద్వారా మరోసారి నిరూపించింది.






**ఉత్తర తెలంగాణకు లభించిన వరం**

గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి ఆవరణలో మొత్తం 7890 చదరపు అడుగుల విస్తీర్ణం లో సింగరేణి కార్డియాలజీ విభాగం ఉంటుంది. ఇందులో 5 బెడ్ల సామర్థ్యం గల ఇంటెన్సివ్ కార్డియాక్ కేర్ యూనిట్, 10 బెడ్ల సామర్థ్యం తో ఇంటెన్సివ్ కేర్ యూనిట్, ప్రత్యేక గదులతో ఔట్ పేషెంట్ బ్లాక్ ఉంటాయి.. గోదావరిఖని, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, పెద్దపల్లి, భూపాలపల్లి, మంథని తదితర పరిసర ప్రాంతాలతో పాటు మొత్తం కోల్ బెల్ట్ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ప్రజలకు ఈ క్యాథ్ ల్యాబ్ ఎంతో ఉపయోగపడనుంది. పబ్లిక్- ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ఏర్పాటు చేసిన క్యాథ్ ల్యాబ్ కోసం ఏడేళ్లలో సింగరేణి సంస్థ దాదాపు 50 కోట్ల ఖర్చు ను భరించనుంది. అలాగే సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ టారిఫ్‌ల మేరకు అతి తక్కువ ఖర్చుతో స్థానికులకు కూడా అత్యాధునిక వైద్య సేవలను అందించే సౌకర్యాన్ని కల్పించింది. ప్రతీ నెల దాదాపు 3 వేల మందికి పైగా ఈ సేవలను వినియోగించుకుంటారని అంచనా. అయితే ఇక్కడ క్యాథ్ ల్యాబ్ ఉన్న బెడ్ల సామర్థ్యంలో 50 శాతం సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత సింగరేణీయులకు రిజర్వు చేయడం జరుగుతుంది.

**గోదావరిఖని క్యాథ్ ల్యాబ్ లో సేవలు**

ఈ క్యాథ్ ల్యాబ్‌లో గుండెకు సంబంధించిన అత్యాధునిక పరీక్షలు మరియు చికిత్సలు అందుబాటులో ఉంటాయి: రక్తనాళాల పరీక్షలు: గుండె నరాల్లో బ్లాక్‌లను గుర్తించే పరీక్షలు. యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ: గుండెపోటు తీవ్రతను అంచనా వేసి, తక్షణ ఉపశమనం కలిగించే చికిత్సలు. స్టెంట్ అమరిక: ప్రాణాపాయం నుండి రక్షించే స్టెంటింగ్ ప్రక్రియలు. అనుభవజ్ఞులైన కార్డియాలజిస్టులు, ప్రత్యేక శిక్షణ పొందిన వైద్య సిబ్బందితో నిరంతర సేవలు. స్థానికంగానే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడం ద్వారా విలువైన ప్రాణాలకు భరోసా కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి యాజమాన్యం ఈ క్యాథ్ ల్యాబ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ శ్రీ కిరణ్ రాజ్ కుమార్ పేర్కొన్నారు. ఇక సుదూర ప్రాంతాలకు తరలించకుండా, ఇకపై గోల్డెన్ అవర్‌లోనే అత్యవసర చికిత్స అందించడం ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడే కేంద్రంగా గోదావరిఖని క్యాథ్ ల్యాబ్ నిలవనుందని ఆయన పేర్కొన్నారు.

## డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని మా అనుమానం

**రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయి**

**రాష్ట్రాల మధ్య డేటాను పరిశీలించాలి**

**రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్, జూన్ 29 (వుదయం ప్రతినిధి) :** దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈరోజు (సోమవారం) హైదరాబాద్ వేదికగా కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత అన్నారు. కొడంగల్‌లో తాము వెరిఫై చేస్తే 33వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని వచ్చాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 32వేల మెజారిటీతో గెలిచారని అన్నారు. ఈ డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని తమకు అనుమానం ఉందని చెప్పారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం తమకు కలుగుతోందని కవిత పేర్కొన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. 'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉందని... ఎక్కడైనా ఒక చోటు మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. ఎన్నికల సంఘానికి ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని కవిత పేర్కొన్నారు.



## త్వరలో గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్ర

**తెలంగాణ పల్లె పల్లెకు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ**

**హైదరాబాద్, జూన్ 25 (ఎఎంఎస్) :** తెలంగాణ ప్రజల్లో గ్రామ స్వరాజ్య స్ఫూర్తిని నింపే లక్ష్యంతో గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్ర రాష్ట్రంలోని ప్రతి పల్లెకు కొనసాగుతుందని జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యం, రైతు స్వరాజ్యం, యువ స్వరాజ్యం, మహిళా స్వరాజ్యం, కార్మిక స్వరాజ్యం సాధించి, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ఈ మహా యాత్ర ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ యాత్రలో ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ, ప్రతి వ్యక్తిని ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలు, ఆశయాలు, ఆకాంక్షలను తెలుసుకుంటూ ప్రజల భాగస్వామ్యంతో ఒక కొత్త తెలంగాణ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. "తెలంగాణ అభివృద్ధి ఫలితాలు చివరి వ్యక్తికి చేరాలంటే గ్రామ స్వరాజ్యమే శాశ్వత పరిష్కారం. గ్రామం బలపడితే రాష్ట్రం బలపడుతుంది. ప్రజలే పాలనలో భాగస్వాములు కావాలి" అని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల ఆత్మగౌరవం, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి, మహిళల సాధికారత, కార్మికుల అభ్యున్నతి లక్ష్యంగా సాగుతున్న ఈ మహా ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ పిలుపునిచ్చారు.




## నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**ఎస్ఎఫ్ఐఆధ్వర్యంలో నిర్వహించిన " ఛలో లోక్ భవన్ " ముట్టడి ఉద్రిక్తం**

**అక్రమంగా అర్ధ రాత్రి నుండే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నాయకులు ముందస్తు అరెస్టులు**

**హైదరాబాద్, జూన్ 29 (వుదయం ప్రతినిధి) :** దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ వలన నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, ఆత్మహత్య చేసుకున్న 20 మంది విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని, నీట్ పేపర్ లీక్ కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో లోక్ భవన్ ముట్టడి కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది. తెలంగాణలో బీజేపీ అసమర్థ పాలనపై నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై, చనిపోయిన విద్యార్థుల ఆత్మహత్యలపై కనీసం మాట్లాడకుండా, బీజేపీ అసమర్థ పాలనపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అర్ధ రాత్రి అక్రమంగా అరెస్టు చేయించారని బీజేపీ నీ ప్రశ్నిస్తుంటే, బీజేపీ వైఫల్యం పై పోరాడుతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐరాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. రజినీకాంత్, టి. నాగరాజులు ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. అశోక్ రెడ్డి, కె. శంకర్, జి. శ్రీకాంత్, ప్రవీణ్ రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్ గువేరా లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఖమ్మం, కరీంనగర్, మహబాద్, హన్మకొండ, కొత్తగూడెం, నల్గొండ, సంగారెడ్డి, రంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, మంచిర్యాల, భువనగిరి, భూపాలపల్లి, ములుగు, సిరిసిల్ల జిల్లాలలో అర్ధరాత్రి అక్రమంగా అరెస్టులు చేశారు. పోలీసుల నిర్బంధాన్ని సైతం ఛేదించి ఛలో లోక్ భవన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా లోక్ భవన్ దగ్గర జరిగిన ముట్టడి కార్యక్రమంలో ఆలిండియా సహాయ కార్యదర్శి ఎం. డి అతిక్ అహ్మద్, రాష్ట్ర అధ్యక్షులు రజినీకాంత్ మాట్లాడుతూ దేశంలో నీట్ పేపర్ లీక్ అయ్యి విద్యార్థులు చదువులు లక్షలాది రూపాయలు డబ్బులు సమయం వృధా చేసుకున్నారని, 20 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుని చనిపోయారని, కానీ కనీసం బాధ్యత లేకుండా కేంద్ర విద్యాశాఖ మంత్రి వ్యవహరిస్తున్నారని తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిబిఎస్ సి వాల్యువేషన్ లో అవకతవకలు , ఇతర ప్రవేశ పరీక్షలు లీక్ అయిన కూడా బీజేపీ ప్రభుత్వం స్పందించటం లేదన్నారు. పరీక్ష పే, మన్ కీ బాత్ పేరుతో మాట్లాడే ప్రధాని మోదీ ఈ లీక్ లపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ కు బాధ్యత వహిస్తూ తక్షణమే విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కొనసాగింపు కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు. అక్రమ అరెస్టులకు నిరసనగా రేపు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో ప్రభుత్వ దిష్టి బొమ్మలను దగ్ధానికి పిలుపునిస్తున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన విద్యార్థి నాయకులను పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు.



# సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ల నుంచి డీఎస్పీలుగా

**పదోన్నతి పొందిన 36 మంది అధికారులకు పోస్టింగ్‌లు**

**నిజాయితీ, నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాలి : డీజీపీ సి.వి. ఆనంద్**


**హైదరాబాద్, జూన్ 29 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ పోలీసు శాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) హోదా నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా పదోన్నతి పొందిన 36 మంది అధికారులకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, యూనిట్లలో పోస్టింగ్‌లు కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్, డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నూతనంగా పదోన్నతి పొందిన అధికారులను అభినందించిన డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాదని, అంతకుమించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించే అవకాశం అని పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి అధికారి నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలను సత్వరమే గుర్తించి, చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా పనిచేయాలని, ప్రజలకు చేరువయ్యే అధికారులుగా మంచి పేరు తెచ్చుకోవాలని డీజీపీ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలతో సత్సంబంధాల పెంపు, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. డీఎస్పీ హోదాలో ప్రతి నిర్ణయం ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ఉండాలని, కాగా సి ఐ ల నుండి డిస్పీ లుగా పదోన్నతి పొందిన వీరికి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోస్టింగ్స్ కాకుండా ఇతర విభాగాల్లో తమ సేవలను నిర్వహించనున్నారు.



## బృందావన్ వెల్ఫర్ అసోసియేషన్ కాలనీ కమిటీ ఏర్పాటు

**మునగనూర్, జూన్ 29 (వుదయం ప్రతినిధి) :** మునగనూర్ లోని బృందావన్ వెల్ఫర్ అసోసియేషన్ కాలనీ కమిటీ సమావేశం ఆదివారం నాడు జరిగింది. కాలనీ కమిటీ సభ్యులు కమిటిని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. బృందావన్ వెల్ఫర్ అసోసియేషన్ కాలనీ కమిటీ ఎన్నికలలో అధ్యక్షుడిగా కే ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బిజ్జా రామారావు, కోశాధికారిగా తండా వెంకటేశ్వర్లు గౌడ్ ను ఏకగ్రీవ నియామకం జరిగింది. ఈ సందర్భం గా ఎన్నికైన సభ్యులు, కాలనీవాసులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్త కమిటీ సభ్యులు మాట్లాడుతూ కాలనీ సంక్షేమానికి నిరంతర కృషి చేస్తామని చెప్పారు. మౌలిక సదుపాయల కల్పనే ధ్యేయంగా కమిటీ ముందుకు వెళ్తుందన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్



## ప్రజావాణికి(108)ఫిర్యాదులు



రంగారెడ్డి జిల్లా

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (108) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-20, ఇతర శాఖలు -88, మొత్తం దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి దుస్థితి: టీఆర్ఎస్ ఆగ్రహం

- రహదారిపై నిత్యం ప్రమాదాలు – వెంటనే మరమ్మతులు చేపట్టాలని నీరుడు సర్వేష్ ముదిరాజ్ డిమాండ్
- ప్రజల ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు – నిర్లక్ష్య వైఖరిపై తెలంగాణ రక్షణ సేన పార్టీ తీవ్ర ఆగ్రహం
- రోడ్డు మరమ్మతులు చేపట్టకపోతే ప్రజలతో కలిసి భారీ ఆందోళనకు సిద్ధం – తెలంగాణ రక్షణ సేన పార్టీ హెచ్చరిక

గండిపేట్, జూన్ 29 (ఉదయం)





రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని కిస్మత్పూర్ విలేజ్ నుంచి బండ్లగూడ వరకు ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రజలకు ప్రాణాంతకంగా మారిందని తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకుడు నీరుడు సర్వేష్ ముదిరాజ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ కీలక రహదారిపై భారీ గుంతలు ఏర్పడి, దెబ్బతిన్న మ్యాన్‌హోల్ కవర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన తెలిపారు.ప్రజల భద్రతను పూర్తిగా విస్మరించిన GHMC అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. కిస్మత్పూర్, బండ్లగూడ, రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల నుంచి ఉద్యోగాలు, విద్య, వ్యాపార అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది ఈ రహదారిపైనే ప్రయాణిస్తున్నారని తెలిపారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై చిన్నారులను పాఠశాలలకు తీసుకెళ్లే తల్లిదండ్రులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలవడంతో వాటి లోతు కనిపించక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, పలువురు గాయపడుతున్నా అధికారులు స్పందించడం లేదని తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆవేదన వ్యక్తం చేసింది.ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నా కనీస బాధ్యత లేకుండా వ్యవహరించడం దురదృష్టకరమని, ప్రజల పన్నుల డబ్బుతో జీతాలు తీసుకుంటున్న అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆయన డిమాండ్ చేశారు.అధికారులు స్పందించకపోతే ప్రజల్లో ఆగ్రహం మరింత పెరిగే అవకాశముందని హెచ్చరించారు.తెలంగాణ రక్షణ సేన పార్టీ తరఫున కిస్మత్పూర్-బండ్లగూడ ప్రధాన రహదారిని అత్యవసరంగా పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలని, రోడ్డు మధ్యలో ఉన్న అన్ని గుంతలను వెంటనే పూడ్చాలని, దెబ్బతిన్న మ్యాన్‌హోల్ కవర్లను కొత్తవాటితో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.తాత్కాలిక మరమ్మతులతో కాకుండా శాశ్వత పరిష్కారం కోసం నాణ్యమైన రహదారి నిర్మాణం చేపట్టి ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల ప్రాణాలను కాపాడటం ప్రభుత్వంతో పాటు సంబంధిత అధికారుల బాధ్యత అని పేర్కొన్న తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకుడు నీరుడు సర్వేష్ ముదిరాజ్, అధికారులు తక్షణమే స్పందించి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.ఒకవేళ నిర్లక్ష్య ధోరణి కొనసాగి రహదారి మరమ్మతులు చేపట్టకపోతే తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి భారీ స్థాయిలో ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## గుమ్మడిదలలో రూ.70 లక్షల అభివృద్ధి



గుమ్మడిదల, జూన్ 29 (ఉదయం) :

మండలంలోని మంబాపూర్, నల్లవల్లి, కొత్తపల్లి, నాగిరెడ్డి గూడెం, అనంతారం, కానుకుంట గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.70 లక్షల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ ఛైర్మన్ కుమార్ గౌడ్, ఎంపీడీవో ఉమాదేవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, వెంకటేష్, సర్పంచులు శ్రీను, నర్సింగ్ రావు, గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మారుమ్రోగిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయం



శంకర్‌పల్లి: జూన్ 29: (ఉదయం): శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో వెలసిన 11వ శతాబ్దపు మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో సోమవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం కోరిన కోరికలు తీర్చే రాయి వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు శివసాయి ప్రసాద్, సౌందర్య, లలిత, ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన సుమిత్ర మల్లేశం దంపతులు అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## శంకర్‌పల్లి మోడల్ స్కూల్‌లో 'స్పాట్'



- జూలై 1న ఇంటర్ మొదటి సంవత్సరం ఖాళీ సీట్ల భర్తీ – ప్రిన్సిపాల్ శోభారాణి
- అసలు ధ్రువపత్రాలతో హాజరుకావాలని విద్యార్థులకు సూచన

శంకర్‌పల్లి, జూన్ 29 (ఉదయం):

శంకర్‌పల్లి పీఎం తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి సోమవారం వెల్లడించారు.ప్రభుత్వ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్యను అందిస్తున్న ఈ విద్యాసంస్థలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉత్తమ విద్యా వాతావరణం, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.జూలై 1వ తేదీన కళాశాల ప్రాంగణంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.ఇంటర్ మొదటి సంవత్సరంలోని ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ (లేదా ఏసీఈగా పేర్కొన్న గ్రూపు)లో మిగిలిన సీట్లను అర్హత కలిగిన విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.ప్రవేశాలు పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడతాయని తెలిపారు.సీట్లు పరిమితంగా ఉన్నందున విద్యార్థులు నిర్ణీత తేదీన ముందుగానే కళాశాలకు చేరుకోవాలని సూచించారు.అడ్మిషన్‌కు వచ్చే విద్యార్థులు తప్పనిసరిగా పదో తరగతి మార్కుల మెమో, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టీసీ), బోనాఫైడ్ సర్టిఫికేట్‌తో పాటు అవసరమైన ఇతర ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని ప్రిన్సిపాల్ శోభారాణి కోరారు.అన్ని పత్రాలను పరిశీలించిన అనంతరం అర్హత కలిగిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే అన్ని పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అభ్యసించాలని కోరుకునే విద్యార్థులకు శంకర్‌పల్లి పీఎం తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాల మంచి అవకాశంగా నిలుస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.ఈ స్పాట్ అడ్మిషన్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా మెరుగైన విద్యను అభ్యసించే అవకాశం పొందనున్నారని పేర్కొన్నారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కళాశాల కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని ప్రిన్సిపాల్ శోభారాణి విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి



- బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్

బాచుపల్లి, జూన్ 29, (ఉదయం ప్రతినిధి ),

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ సర్కిల్ డివిజన్లలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ బీఎల్ఓ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో అవసరమైన వివరాలను సేకరించి నమోదు ప్రక్రియను ఎంతో పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ప్రజలు బీఎల్ఓల ద్వారా అందించే ఎన్యుమరేషన్ ఫారమ్ ను సక్రమంగా నింపి సమర్పించాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా ఓటరు లిస్ట్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ అధ్యక్షులు మేకల మధుసూదన్, బి ఎల్ ఓ లక్ష్మి, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ కిరణ్‌కుమార్‌ను కలిసిన ముత్తయ్య

- గాంధీభవన్‌లో ఆత్మీయ భేటీ.. ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతంపై చర్చ

హైదరాబాద్ జూన్ 29 (ఉదయం):



సోమవారం గాంధీభవన్‌లో భువనగిరి లోక్‌సభ సభ్యులు (ఎంపీ) శ్యామల కిరణ్‌కుమార్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్ఎస్‌సీఎల్ వైస్ ఛైర్మన్ కడమంచి ముత్తయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు ఆత్మీయంగా పలకరించుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.అనంతరం రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజలకు మరింత చేరువయ్యే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.ఎక్కడున్నావ్ అని అడిగితే గుఫా నగర్లో ఉంటున్నానని కడమంచి ముత్తయ్య వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు.భువనగిరి ఎంపీగా ప్రజలకు సేవలందిస్తున్న శ్యామల కిరణ్‌కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా గుర్తింపు పొందారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా, మీడియా ఇన్‌చార్జిగా, అధికార ప్రతినిధిగా, యువ కాంగ్రెస్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వహించి పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు. గాంధీభవన్‌లో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపగా, రానున్న రోజుల్లో ప్రజా సంక్షేమం, పార్టీ అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలని నాయకులు సంకల్పం వ్యక్తం చేసినట్లు సమాచారం ఇచ్చారు కడమంచి ముత్తయ్య.

## సీఎం సహాయ నిధి ఆపదలో ఉన్నవారికీ అండ

- మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

దుండిగల్, జూన్ 29,(ఉదయం ప్రతినిధి ),





- 13 మందికి రూ. 4 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద చొరవతో నిధుల మంజూరు

దుండిగల్ సర్కిల్ లోని 13 మంది లబ్ధిదారులకు 4లక్షల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య ఆర్థిక ఇబ్బందుల సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ వివేకానంద చొరవతో మంజూరు అయిన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందచేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, డివిజన్ల అధ్యక్షుల, పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ లో ప్రసవం తల్లి బిడ్డ క్షేమం

నారాయణపేట జూన్ 29(ఉదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లా కోస్గి మండల కేంద్రంలోని ముష్రీఫా గ్రామానికి చెందిన షబానా కు సోమవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో ప్రథమిక ఆరోగ్య కేంద్రం గుండుమల్ కోస్గి108అంబులెన్స్ కి సమాచారం అందించింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది పల్లి గ్రామ సమీపంలో, అంబులెన్స్ లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అంబులెన్స్ లోని ప్రథమ చికిత్స అందించిన 108 సిబ్బంది ఈఎంటి మహమ్మద్ తాజుద్దీన్, పైలట్ ఫయాజ్ ఖాన్ సకాలంలో తగిన చర్యలు తీసుకున్నారు. జిల్లా అస్పత్రి వైద్యులు పరిశీలించిన తర్వాత తల్లి,బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వారు వెల్లడించారు.

## మొట్టమొదటిసారిగా ముడి ఇనుము కంటైనర్ రేక్‌ను విజయవంతంగా లోడ్ చేసిన వెల్దుర్తి గూడ్స్ షెడ్




భారతీయ రైల్వేలు దేశీయ కంటైనర్ రవాణాను మరింత ప్రోత్సహించే లక్ష్యంతో ప్రత్యేక కంటైనర్ రైల్ టెర్మినల్ (ఎక్స్‌క్లూజివ్ కంటైనర్ రైల్ టెర్మినల్) అనే వినూత్న విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ దిశగా, జోన్ యొక్క సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచడానికి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా దక్షిణ మధ్య రైల్వే కూడా వివిధ వినియోగదారుల కేంద్రీకృత కార్యక్రమాలను ప్రోత్సహిస్తోంది.భారతీయ రైల్వే చొరవకు అనుగుణంగా, పారిశ్రామిక సమూహాలు మరియు ఉత్పత్తి కేంద్రాలకు మరింత చేరువగా సమర్థవంతమైన లాజిస్టిక్స్ పరిష్కారాలను సృష్టించేందుకు దక్షిణ మధ్య రైల్వే , హైదరాబాద్ డివిజన్‌లోని వెల్దుర్తి గూడ్స్ షెడ్‌ను 10.6.2026న ప్రత్యేక కంటైనర్ రైల్ టెర్మినల్ (ఈ.సి.ఆర్.టి ) గా నోటిఫై చేసింది. ఈ చొరవ యొక్క లక్ష్యం, నూతన కంటైనర్ రవాణా మార్గాలను ఆకర్షించడం మరియు వినియోగదారులకు తక్కువ ఖర్చుతో కూడిన, సుస్థిరమైన సరుకు రవాణా పరిష్కారాలను అందించడం. హైదరాబాద్ డివిజన్‌లో ప్రత్యేక కంటైనర్ రైల్ టెర్మినల్‌గా నోటిఫై చేయబడిన మొదటి గూడ్స్ షెడ్ ఇదే. ఇది బహుళ రవాణా (మల్టీమోడల్ లాజిస్టిక్స్) వ్యవస్థ విస్తరణకు కీలక మైలురాయిగా నిలవడంతో పాటు, ప్రాంతీయ అభివృద్ధి మరియు ఆర్థిక పురోగతికి విశేషంగా దోహదపడనుంది. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన వెల్దుర్తి గూడ్స్ షెడ్ 2026 జూన్ 25న తొలి కంటైనర్ రేక్‌ను విజయవంతంగా లోడ్ చేసి మరో కీలక మైలురాయిని నమోదు చేసింది. ఈ కంటైనర్ రేక్‌ను ఉత్తర రైల్వేలోని ఫిరోజ్‌పూర్ డివిజన్ పరిధిలోని పంజాబ్ రాష్ట్రంలోని ఫిల్లౌర్ ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో(ఐ.సి.డి)కు రవాణా చేశారు. ఈ విజయంతో దేశవ్యాప్తంగా లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌లో భారతీయ రైల్వేల అనుసంధానం మరింత బలోపేతం కావడంతో పాటు, వివిధ ప్రాంతాల్లోని పరిశ్రమలను సజావుగా అనుసంధానించగల రైల్వేల సామర్థ్యాన్ని చాటిచెబుతోంది. తొలి రైలు రేక్ 2,760 టన్నుల ముడి ఇనుమును (పిగ్ ఐరన్‌ను) రవాణా చేసి, వెల్దుర్తి గూడ్స్ షెడ్ సరుకు రవాణా విభాగంలో కొత్త వస్తువుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా, పునర్వ్యవస్థీకరించబడిన దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో కంటైనర్లలో పిగ్ ఐరన్‌ను లోడ్ చేసిన మొట్టమొదటి మరియు ఏకైక గూడ్స్ షెడ్‌గా వెల్దుర్తి నిలిచింది. ఇది ఉక్కు రంగానికి కొత్త అవకాశాలను కల్పించడంతో పాటు, కంటైనర్ ఆధారిత రైల్వే సరుకు రవాణా వ్యవస్థ యొక్క సౌలభ్యం, సామర్థ్యం మరోసారి స్పష్టమైంది. ఈ సరుకు రవాణా ద్వారా దాదాపు రూ. 59 లక్షల అంచనా ఆదాయం సమకూరింది. ఇది వెల్దుర్తి రైల్వే స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఈసీఆర్‌టీ యొక్క పెరుగుతున్న సామర్థ్యాన్ని, అలాగే అధిక విలువైన సరుకు రవాణాను ఆకర్షించడంలో దాని నైపుణ్యాన్ని స్పష్టం చేస్తోంది. ఇదే ఉత్సాహాన్ని మున్ముందు కూడా కొనసాగించేందుకు గాను, ఈ టెర్మినల్ నుండి ప్రతి నెలా మూడు కంటైనర్ రేక్‌లను లోడింగ్ చేసేందుకు కాన్కోర్ అంగీకరించింది. ఇది ఈ ప్రాంతంలో నిరంతర సరుకు రవాణా వృద్ధికి మరియు పెరిగిన ఆర్థిక కార్యకలాపాలకు మార్గం సుగమం చేస్తుంది. ఈ సందర్భంగా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గారు , హైదరాబాద్ డివిజన్ కొత్త రవాణా సరుకు లోడింగ్‌ను విజయవంతంగా సాధించినందుకు అభినందనలు తెలిపారు. అలాగే, దక్షిణ మధ్య రైల్వే కీర్తి పతాకాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని అధికారులు, సిబ్బంది అందరికీ సూచించారు.


**IN THE COURT OF THE HON'BLE MACT-cum-XXIV CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD**
**MV.OP. No. 2418 OF 2025**

*Between:*
Sirigiri Suvarana Jyothi & others ...**Plaintiffs**
**AND**
Bolli Keerthi & others ............**Defendents.**

To,
1. **Bolli Keerthi** W/o Bhanu Chandar, aged Major, Occ: Owner of Lorry bearing No.AP-16-TG-2926, R/o H.No. 41-1/2-18A, Puppalavari Street, Krishnalanka, Vijayawada, Andhra Pradesh State - 520 013.
3. **Bandari Durga Rao** S/o Bandari Konda, aged Major, Occ: Driver of Lorry bearing No.AP-16-TG-2926, R/o: D.No. 61-9-1-10, Krishnalanka, Vijayawada, AP 520 013.
...**Respondents No.1 & 3**

Whereas the Petitioners herein has instituted MVOP against you for seeking compensation on the account of death of deceased Late Sirigiri Chinna Obaiah in a road accident. You are hereby summoned to appear before this Hon'ble Court, in person or through Advocate duly instructed, on 23-07-2026 at 10:30 a.m., failing which the matter will be heard and decided ex- parte.

*(BY ORDER OF THE COURT)*

Sd/-
**Modigart Polisetty Advocate**
**Barkatpura, Hyderabad, T.S.**
**Cell No.7013558489**

**IN THE COURT OF THE HON'BLE MACT-cum-XXIV CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD**
**MV.OP. No. 2419 OF 2025**

*Between:*
Sirigiri Suvarana Jyothi ...**Plaintiffs**
**AND**
Bolli Keerthi & others ............**Defendents.**

To,
1. **Bolli Keerthi** W/o Bhanu Chandar, aged Major, Occ: Owner of Lorry bearing No.AP-16-TG-2926, R/o H.No. 41-1/2-18A, Puppalavari Street, Krishnalanka, Vijayawada, Andhra Pradesh State - 520 013.
3. **Bandari Durga Rao** S/o Bandari Konda, aged Major, Occ: Driver of Lorry bearing No.AP-16-TG-2926, R/o: D.No. 61-9-1-10, Krishnalanka, Vijayawada, AP 520 013.
...**Respondents No.1 & 3**

Whereas the Petitioners herein has instituted MVOP against you for seeking compensation on the account of injuries sustained by the petitioner in a road accident. You are hereby summoned to appear before this Hon'ble Court, in person or through Advocate duly instructed, on 23-07-2026 at 10:30 a.m., failing which the matter will be heard and decided ex-parte.

*(BY ORDER OF THE COURT)*

Sd/-
**Modigari Polisetty Advocate**
**Barkatpura, Hyderabad, T.S.**
**Cell No.7013558489**
**Vayas 9912254084**

**IN THE COURT OF THE HON'BLE XXI JUINOR CIVIL JUDGE CITY CIVIL COURT: AT: HYDERABAD**
**OS No 1638 of 2026**

*Between:*
Mr Abdul Hameed Khan and others ...**Plaintiffs**
**AND**
1.The Tahsildar, Mandal Revenue Office, Ameerpet,
2. All Concerned ............**Defendents.**

Whereas the above-named Plaintiffs filed Suit for declaration of legal heirs of deceased **Late: Md Nazima** on the file of the Hon'ble **XXI Junior Civil Judge, City Civil Court, at Hyderabad** and the above-mentioned case is posted to **17-07-2026 at 10.30 AM** for appearance before the Hon'ble **XXI Junior Civil Judge, City Civil Court, Hyderabad.** Anyone who are the legal heirs of Late **Late: Md Nazima** are hereby directed by the abovementioned court to appear either in person or through pleader with instructions if any on the said date and time mentioned above. Falling which the case will be heard and determine ex-parte.

*(BY ORDER OF THE COURT)*

Sd/-
**Shaik. Zaheeruddin,**
**N.Vijaya Saradhi,**
**ADVOCATES**
**Flat No 202,**
**Sagarview Apartments,**
**BS Maqtha, Begumpet,**
**Hyderabad – 500018.**

**IN THE COURT OF THE HON'BLE PRINCIPLE DIST AND SESSIONS JUDGE RANGA REDDY DIST :AT:L B NAGAR**
**O.S.No. 109 of 2026**

*Between:*
Prasanna Vasu Kande and Others ...**Plaintiffs**
**AND**
1. The Tahsildar(MRO),Saroornagar Mandal, and another . ............**Defendents.**

To
ALL Concerned .....**Defendant No.2**

**NOTICE**

Please take notice that the above said suit filed by the plaintiffs and against the defendants declaring that the plaintiffs herein are the legal heirs of the deceased Late Kande Manohar Rao and Late Kande Vijaya Laxmi W/o Late Kande Manohar Rao who died on 16-01-2026 and 15-01-2026 respectively, in respect of the suit schedule property before the Hon'ble Principle Dist. and Sessions Judge, Ranga Reddy Dist., L B Nagar, the said suit is posted on 15-07-2026, at 10-30 AM for your appearance, if you fail to appear in person or through an advocate on the said date and time, the matter will be heard exparte as per law.

**SUIT SCHEDULE PROPERTY**

All that the H.No. 11-13-1401,( PTIN No. 1031120228 & PTIN No. 1031112827), Plot No. 28, in Sy.No. 7/C Part, land Adm. 275 Sq. Yards, situated at Road No.2, Margadarsi Colony, Kothapet, Saroorngar Mandal, Ranga Reddy Dist, Telangana State, Hyderabad and bounded by:-
North : Plot No. 29
South : 30' wide Road
East : Plot No.43
West : 30' wide Road

*(BY ORDER OF THE COURT)*

Sd/-
**A.VENKATANARAYANA RAO,**
**ADVOCATES**
**2-2-1100/1/A-F-3,Jaya Residency,,**
**Nallakunta, Hyderabad-44,**
**Ph.No. 9848024716**




"జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదని.. మన ఓపికకు పరీక్ష . చిన్న వయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చాను. రాజకీయాల్లోకి వచ్చాక నా భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డాను. ఏ పని చేసినా నాదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నాను. అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే నా బలం. వేగంగా లక్ష్యాలు చేరాలనే ఆరాటంలో నేటి యువత ఉంది. ఏ పనినైనా ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే ఫలితాలు వస్తాయి."

బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

## వే'మన'పద్యం

మిరపగింజ చూడ మీద నల్లగనుండు
గొరికిచూడ లోనజురుకు మనుమ
సజ్జనులగునారి సారమిట్లుండురా
విశ్వదాభిరామ! వినురవేమ



# ప్రశ్నించేతత్వం ఉండాలి

సమాజంలో తప్పులు జరుగుతున్నప్పుడు ప్రశ్నించే* తత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి. న్యాయ, ధర్మాలనేవి పోరుబాట పట్టాలి. అప్పుడే సామాన్యుడికి న్యాయ జరుగుతుంది. ధర్మం అనే రెండెక్షరాల పదం సమాజ పురోగతులు మార్చుతుంది. సమాజ ప్రేరణకు అంకురార్పణం పురుడుపోసుకుంటుంది . పేద, బీదల విలువలు, కష్టనష్టాల బాధ్యతలనేవి తెలుస్తాయి.

భరత్ భూషణ్ తివారి 28 సంవత్సరాల యువకుడు. ప్రజల సమస్యల మీద పోరాడుతూ, ప్రశ్నిస్తూ, రాజ్యానికి ఎదురు తిరిగి నిలిచాడు. అంతే రాజ్యం అతనిని జూన్ 17వ తేదీన పోలీస్ ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపేసింది. సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. ఈ ఘటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఎలాంటి నేర చరిత్ర లేని, ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించే ఒక యువకుడ్ని పోలీసులు కాల్చి చంపడం పై ప్రజలు, ప్రతిపక్షాలు హక్కుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో పోలీసులు జరిపిన ఈ 'ఎన్‌కౌంటర్' పై విమర్శలు వెల్లువెత్తడంతో బీహార్ ప్రభుత్వం దిగొచ్చి, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి ద్వారా విచారణకు ఆదేశాలిచ్చింది. సంబంధిత నలుగురు పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేసింది. ఈ ఘటనపై తీవ్ర రాజకీయ దుమారం చెలరేగటంతో జాతీయ మానవ హక్కుల కమిషన్ దీనిపై సమగ్ర విచారణకు ఆదేశిస్తూ, బీహార్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. దీనిపై సుప్రీంకోర్టులో సైతం పిటిషన్ దాఖలైంది.

బీహార్‌లోని భోజ్‌పూర్ జిల్లా బిలౌటి గ్రామానికి చెందిన భరత్ భూషణ్ తివారి తాను తన ప్రాంతంలోని అణగారిన వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం పోరాడాడు. గ్రామంలోని రోడ్ల దుస్థితి, తన ప్రాంతంలో గంగా నది వరదలు, అవినీతి, లంచగొండితనంపై సోషల్ మీడియా వేదికగా గళమెత్తుతూ ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రజా ఆదరణ పొందాడు. తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా, పోలీసు ముట్టడి మధ్య కూడా వెనకడుగు వేయకుండా ,ప్రజల సమస్యలను లైవ్ ద్వారా సోషల్ మీడియా వేదికగా ప్రపంచానికి వినిపించాడు, వ్యవస్థల్ని ప్రశ్నించాడు. లోపాలను ప్రజలకు ఎత్తి చూపాడు. పరిష్కారం కోసం పోరాడాడు. దోపిడీ శక్తులకు తలనొప్పిగా మారాడు. ఈ రాజ్య వ్యవస్థ. ఎప్పటిలాగే పోలీసులు తమ ఆత్మ రక్షణ కోసమే ఎదురు కాల్పులు జరిపామని చెప్పారు. కానీ ఘటనకు కొద్ది నిమిషాల

> 'చట్టం ముందు అందరూ సమానమే' అని రాజ్యాంగం చెబుతుంది. అలాగే రాజ్యాంగంలోని అత్యంత విలువైన ,ముఖ్యమైన హక్కు జీవించే హక్కు (A-21). ఈ హక్కును చట్టం నిర్దేశించిన పద్ధతిలో తప్ప ఒక వ్యక్తి ప్రాణం తీసే హక్కు ఎవరికీ లేదు. ఏదైనా తప్పు చేస్తే శిక్షించే హక్కు చట్టప్రకారం న్యాయస్థానాలకు మాత్రమే ఉంటుంది. పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే ఇక చట్టాలు... రాజ్యాంగం, న్యాయస్థానాలు ఎందుకు? ఇటీవల తండ్రి, కొడుకులను చిత్రహింసలకు గురిచేసి లాకప్‌డెత్ చేసిన తొమ్మిది మంది పోలీసులకు తమిళనాడులోని మధురై జిల్లా కోర్టు మరణశిక్ష విధించటం అభినందనీయం. ఇలా మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన అధిక శాతం మంది నిందితులైన పోలీసులకు శిక్షలు పడిన దాఖలాలు చాలా అరుదు. ఏ పదవుల్లో ఉన్నా.. ఏ స్థాయిలో ఉన్నా.. ఎంత ఎదిగి ఉన్నా.. న్యాయాన్ని బతికించే ప్రయత్నం చేయండి. సమాజానికి న్యాయం చేసిన వారవుతారు.

ముందు భరత్ తన ఫేస్‌బుక్ లైవ్ ద్వారా రికార్డు చేసిన వీడియోలు పోలీసులు చెప్పినవి నిజం కాదని తెలుస్తోంది. భరత్ ఒక బహిరంగ మైదానంలో నిలబడి తన చేతిలోని పిస్టల్ ను పోలీసుల వైపు విసిరేసి, లొంగిపోతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. నిరాయుధుడిగా మారిన తర్వాత కూడా పోలీసులు అతన్ని టార్గెట్ చేసి కాల్చారని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని ఊహించిన భరత్.. తన మరణానంతరం శరీర అవయవాలను దానం చేయాలంటూ ఎన్‌కౌంటర్ కంటే ముందే చేసిన వీడియో అందరినీ కంటతడి పెట్టిస్తుంది. అతడి అంత్యక్రియలకు వేలాదిమంది ప్రజలు తరలివచ్చారు. అంటే అతడు ఎంత ప్రజాదరణ పొందాడో అర్థం అవుతుంది.'ప్రజల గొంతుకను నొక్కెందుకే ఈ హత్య చేశారు'అంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నారు.

ఉభయ తెలుగు రాష్ట్రాలలో రాజకీయ సంచనాలకు పేరుగాంచిన విజయవాడ సిటీలో తాజాగా గాదే సాయికృష్ణ మిస్సింగ్ కేసు జాతీయస్థాయిలో హాట్ టాపిక్ గా నిలిచింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న 24 గంటల్లోగా స్థానిక మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టాలని చట్టం చెబుతుంది. కానీ పోలీసులు ఆ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని సాయికృష్ణను మాయం చేశారని, కుటుంబ సభ్యులు, సామాన్యుల నుంచి మేధావుల వరకు ఆరోపణలు గుప్పిస్తున్నారు. వాస్తవానికి నిందితుడిపై ఎన్ని తీవ్రమైన కేసులు ఉన్నా... జ్యుడీషియల్ కాస్టడీ(జైలు)కి తరలించాలి లేదా విచారణ నిమిత్తం తిరిగి పోలీసులకు అప్పగించాలి అని స్థానిక మెజిస్ట్రేట్ నిర్ణయిస్తారు. ఇవేమీ జరగకుండా సాయి కృష్ణ మిస్సింగ్ ఓ మిద్యగా మారింది. తన కొడుకుని చిత్రహింసలకు గురి చేస్తున్నారంటూ నలభై రోజులు అతన తల్లి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్న అవమానమే మిగిలింది. కనీసం 'నా కొడుకుని ఒక్కసారి చూపించండి చాలు, వెళ్లిపోతా' అని ఆ పిచ్చి తల్లి ప్రాధేయపడిన రక్షకభటులు కనకరించకపోవడం మానవత్వానికి మాయని మచ్చగా మిగిలిపోతుంది. పైగా స్టేషన్ హౌస్ ఆఫీసర్..'నీ కొడుకు చచ్చాడు అనుకోని ఫొటోకు దండేసుకో' అని అతి క్రూరంగా మాట్లాడటం ప్రతి తల్లి హృదయాన్ని కలచి వేస్తుంది. తప్పు చేస్తే శిక్షించడానికి న్యాయస్థానాలు ఉన్నాయి... అసలు మనిషినే కనిపించకుండా చేయడం ఏమిటి? అంటూ ఈ సమాజం రక్షకభటులు అని పిలవబడే వారిని ప్రశ్నిస్తూ ఉంది.. నిలదీస్తూ ఉంది.

'చట్టం ముందు అందరూ సమానమే' అని రాజ్యాంగం చెబుతుంది. అలాగే రాజ్యాంగంలోని అత్యంత విలువైన ,ముఖ్యమైన హక్కు జీవించే హక్కు (A-21). ఈ హక్కును చట్టం నిర్దేశించిన పద్ధతిలో తప్ప ఒక వ్యక్తి ప్రాణం తీసే హక్కు ఎవరికీ లేదు. ఏదైనా తప్పు చేస్తే శిక్షించే హక్కు చట్టప్రకారం న్యాయస్థానాలకు మాత్రమే ఉంటుంది. పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే ఇక చట్టాలు... రాజ్యాంగం, న్యాయస్థానాలు ఎందుకు? ఇటీవల తండ్రి, కొడుకులను చిత్రహింసలకు గురిచేసి లాకప్‌డెత్ చేసిన తొమ్మిదిమంది పోలీసులకు తమిళనాడులోని మధురై జిల్లా కోర్టు మరణశిక్ష విధించటం అభినందనీయం. ఇలా మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన అధిక శాతం మంది నిందితులైన పోలీసులకు శిక్షలు పడిన దాఖలాలు చాలా అరుదు. జాతీయ నేర నివేదిక గత పది సంవత్సరాల కాలంలో 2,253 లాకప్ డెత్ లు జరిగాయని తెలిపింది. సగటున ఏడాదికి 92 లాక్ అప్ డేత్ మరణాలు సంభవిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో 2020 నుంచి 2022 మధ్యకాలంలో సుమారు 146 మరణాలు జరిగినట్లు నివేదిక తెలిపింది ఇక్కడ విశేషమేమంటే చట్టాన్ని సంరక్షించాల్సిన వ్యవస్థలే 'కంచె చేను మేసినట్లు' చట్టాన్ని ఉల్లంఘిస్తూ, మానవ హక్కులను హరిస్తున్నాయి. చారిత్రకంగా రాజ్య వ్యవస్థ అనే దానికి వచ్చిన ఒక నాగరీకత విలువే జీవించే హక్కు. ఈ హక్కును ప్రతి పౌరుడికి గ్యారెంటీ ఇవ్వకపోతే రాజ్యాంగపు విలువలు, స్ఫూర్తి ఏమి కావాలి? ఈ మానవ హక్కుల హననం రాజ్యాంగ ఉల్లంఘన కాదా? రాజ్యాంగాన్ని ఉల్లంఘించే అధికారం ఈ దేశంలో ఎవరికి లేదు. చివరకు రాష్ట్రపతి, ప్రధాన మంత్రులకు కూడా.వారు కూడా రాజ్యాంగ పరిధిలో పనిచేయాల్సి ఉంటుంది. మరి ఘనత వహించిన ఈ దేశంలో అత్యున్నత ఉద్యోగంగా చెప్పుకునే ఐపిఎస్ అధికారులకు ఈ సంగతి తెలియదా? వీరు ప్రజలకు జవాబుదారులు కాదా? ఇలా ఈ దేశ పౌరులను ఎన్‌కౌంటర్ పేరిట చంపుకుంటూ పోతే దేశంలో అరాచకం ప్రబలదా? అందుకే నేడు రాజ్యం, సంక్షేమం, విలువలు ,మానవ హక్కుల మీద చర్చ జరగాలి. విలువలతో కూడిన ఒక మానవీయ సమాజం ఏర్పడాలి. ఈ బాధ్యత నేటి యువతరం మీద ఉంది. యువతరం మతం మత్తులో కొట్టుకొని పోకుండా, ప్రజల మౌలిక సమస్యల మీద దృష్టి పెట్టి పనిచేయాలి. ఈ దేశంలో ఒక ఉన్నత మైన సమసమాజ నిర్మాణం జరగాలి. అప్పుడే ఈ దేశ ప్రజలకు నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లభిస్తాయి.



పాలకూరి రాజు
సెక్రెటరీ,
టి జర్నలిస్టుల ఫోరం

# న్యాయం కోసం నిరీక్షణ.. ఇంకెంతకాలం

*ఒక చిన్న రైతు తన భూమి కోసం పోరాడుతున్నాడు. తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని కాపాడుకోవడానికి కోర్టుకు వెళ్లాడు. కేసు పదేళ్లు సాగింది. తర్వాత మరో అప్పీల్. మళ్లీ విచారణ. చివరకు తీర్పు వచ్చే సమయానికి అతని జుట్టు నెరిసిపోయింది. పొలం మాత్రం పాడుబడిపోయింది. గెలిచింది కేసు కావచ్చు; కానీ ఓడిపోయింది జీవితం.*

*ఒక మహిళ గృహహింసకు గురై న్యాయం కోసం కోర్టును ఆశ్రయించింది. ప్రతి వాయిదా ఆమెకు మరో మానసిక శిక్షగా మారింది. సంవత్సరాలు గడిచినా విచారణ పూర్తికాలేదు. బాధితురాలు కోర్టుకు వస్తూనే ఉంది. నిందితుడు బయట తిరుగుతూనే ఉన్నాడు. అప్పుడు ప్రజల మనసులో ఒక ప్రశ్న పుడుతుంది. న్యాయం బాధితుడి పక్షాన ఉందా? లేక కాలయాపన పక్షాన ఉందా?*

"ఆలస్యమైన న్యాయం అన్యాయంతో సమానం" అనే మాట న్యాయశాస్త్రంలో ప్రసిద్ధి చెందిన సూక్తి. కానీ అది కేవలం ఒక సూక్తి మాత్రమే కాదు; లక్షలాది మంది భారతీయుల జీవిత సత్యం. న్యాయస్థానం గడప తొక్కిన రోజు నుంచి తీర్పు వెలువడే రోజు వరకు ఎన్నో జీవితాలు మారిపోతాయి. కొందరు తమ ఆస్తులను కోల్పోతారు. కొందరు తమ ఆరోగ్యాన్ని కోల్పోతారు. మరికొందరు తమ జీవితాన్నే కోల్పోతారు. చివరకు న్యాయం వచ్చినా, అది వారి చేతుల్లోకి చేరే సమయానికి దాని విలువ చాలావరకు కరిగిపోయి ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా భారతదేశంలో కోట్లాది కేసులు పెండింగ్‌ల ఉండటం కేవలం పరిపాలనా లోపం కాదు; అది సామాజిక న్యాయంపై పడిన గంభీరమైన మచ్చ. కోర్టుల్లో పేరుకుపోతున్న కేసుల గుట్టలు కేవలం ఫైళ్లు కావు. వాటి వెనుక వేలాది కుటుంబాల కన్నీళ్లు, విరిగిపోయిన కలలు, నిలిచిపోయిన జీవితాలు ఉన్నాయి. ఒక చిన్న రైతు తన భూమి కోసం పోరాడుతున్నాడు. తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని కాపాడుకోవడానికి కోర్టుకు వెళ్లాడు. కేసు పదేళ్లు సాగింది. తర్వాత మరో అప్పీల్. మళ్లీ విచారణ. చివరకు తీర్పు వచ్చే సమయానికి అతని జుట్టు నెరిసిపోయింది. పొలం మాత్రం పాడుబడిపోయింది. గెలిచింది కేసు కావచ్చు; కానీ ఓడిపోయింది జీవితం. ఒక మహిళ గృహహింసకు గురై న్యాయం కోసం కోర్టును ఆశ్రయించింది. ప్రతి వాయిదా ఆమెకు మరో మానసిక శిక్షగా మారింది. సంవత్సరాలు గడిచినా విచారణ పూర్తికాలేదు. బాధితురాలు కోర్టుకు వస్తూనే ఉంది. నిందితుడు బయట తిరుగుతూనే ఉన్నాడు. అప్పుడు ప్రజల మనసులో ఒక ప్రశ్న పుడుతుంది.. న్యాయం బాధితుడి పక్షాన ఉందా? లేక కాలయాపన పక్షాన ఉందా? ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుంబం పరిహారం కోసం న్యాయపోరాటం చేస్తుంది. తండ్రిని కోల్పోయిన పిల్లలు చదువు మధ్యలో మానేస్తారు. తల్లి కుటుంబాన్ని నెట్టుకొస్తూ కోర్టుల చుట్టూ తిరుగుతుంది. తీర్పు వచ్చే సమయానికి పిల్లలు పెద్దవాళ్లవుతారు. కానీ కోల్పోయిన బాల్యం తిరిగి రాదు. అప్పుడు పరిహారం కేవలం ఒక చెక్కు మాత్రమే; న్యాయం కాదు. న్యాయవ్యవస్థలో ఆలస్యం వల్ల జరిగే నష్టం వ్యక్తిగత స్థాయిలోనే కాదు, సామాజిక స్థాయిలో కూడా తీవ్రంగా ఉంటుంది. నేరస్థులు శిక్ష నుంచి తప్పించుకుంటున్నారని సమాజం గమనించినప్పుడు చట్టం పట్ల గౌరవం తగ్గుతుంది. శిక్ష అనివార్యం కాదనే భావన నేరప్రవృత్తిని పెంచుతుంది. మరోవైపు బాధితులు వ్యవస్థపై నమ్మకం కోల్పోతారు. ఈ రెండూ కలిసి ప్రజాస్వామ్యపు పునాదులను బలహీనపరుస్తాయి. ప్రజాస్వామ్యంలో కోర్టులు ప్రజల చివరి ఆశ్రయం. ప్రభుత్వ కార్యాలయాల్లో న్యాయం దొరకకపోతే ప్రజలు కోర్టును ఆశ్రయిస్తారు. రాజకీయ నాయకులు విఫలమైతే కోర్టు వైపు చూస్తారు. కానీ అదే కోర్టుల్లో సంవత్సరాల తరబడి కేసులు నత్తనడకన సాగితే ప్రజలకు మిగిలేది నిరాశ మాత్రమే. న్యాయమూర్తుల ఖాళీలు, కోర్టు భవనాల కొరత, సిబ్బంది లోపం, తరచూ వాయిదాలు, సంక్లిష్టమైన విధానాలు—ఇవన్నీ కలిసి న్యాయవ్యవస్థపై భారాన్ని పెంచుతున్నాయి. డిజిటల్ యుగంలో

> దిగువ కోర్టులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఈ-కోర్టుల వ్యవస్థను మరింత విస్తరించాలి. చిన్న వివాదాలకు మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్‌ల వంటి ప్రత్యామ్నాయ పరిష్కార వ్యవస్థలను బలోపేతం చేయాలి. విచారణల్లో అనవసర వాయిదాలను కఠినంగా నియంత్రించాలి.

క్షణాల్లో సమాచార మార్పిడి జరుగుతున్నపుడు, దశాబ్దాల పాటు కేసులు కొనసాగడం వ్యవస్థలోని లోతైన సమస్యలను సూచిస్తోంది. అయితే పరిష్కారాలు లేవని కాదు. న్యాయమూర్తుల ఖాళీలను అత్యవసరంగా భర్తీ చేయాలి. దిగువ కోర్టులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఈ-కోర్టుల వ్యవస్థను మరింత విస్తరించాలి. చిన్న వివాదాలకు మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్‌ల వంటి ప్రత్యామ్నాయ పరిష్కార వ్యవస్థలను బలోపేతం చేయాలి. విచారణల్లో అనవసర వాయిదాలను కఠినంగా నియంత్రించాలి.

సత్వర న్యాయం అనేది ఒక పరిపాలనా సౌకర్యం కాదు; అది రాజ్యాంగ హామీ. పౌరుడి గౌరవప్రదమైన జీవన హక్కులో భాగం. న్యాయం కోసం ఎదురుచూస్తూ జీవితాలు కరిగిపోతుంటే, అభివృద్ధి గురించి చేసే గొప్ప ప్రసంగాలు అర్థహీనంగా మారిపోతాయి. ఒక దేశ గొప్పతనం దాని ఆకాశహర్మ్యాల్లో కాదు; సామాన్యుడికి న్యాయం ఎంత త్వరగా అందుతుందో దానిలో ఉంటుంది. బాధితుడి కన్నీరు ఎండిపోయేలోపు, సాక్ష్యాలు చెదిరిపోయేలోపు, ఆశ చనిపోయేలోపు న్యాయం చేరాలి. లేకపోతే కోర్టు తీర్పు వచ్చినా, సమాజం ఇప్పటికే ఓడిపోయి ఉంటుంది. న్యాయం కేవలం తీర్పు కాదు. అది సమయానికి అందిన ఉపశమనం. సమాజానికి ఇచ్చే భరోసా. ప్రజాస్వామ్యానికి ఊపిరి. ఆ ఊపిరి ఆడకపోతే దేశం ముందుకు నడవదు. అందుకే న్యాయవ్యవస్థలో సంస్కరణలు ఇక ఎంపిక కాదు.. అవి అత్యవసరం.



హరిప్రసాద్
దూపాటి

# మనిషి మారకపోతే మార్క్స్ ఏంచేస్తాడు..?

ఈ దేశంలో ఒక విచిత్రమైన అలవాటు ఉంది.సమాజంలో సమస్యలు కనిపించినప్పుడల్లా మనం పరిష్కారం కోసం ఒక మహానుభావుడిని వెతుకుతాం.ఒకరు బుద్ధుడిని తీసుకొస్తారు. మరొకరు అంబేద్కరును చూపిస్తారు. ఇంకొకరు మార్క్స్ ను ముందుకు తెస్తారు.వారందరూ గొప్పవారే.వారి ఆలోచనలు మానవ చరిత్రను ప్రభావితం చేశాయి.కానీ ఒక ప్రశ్న మాత్రం ఎప్పుడూ అడగబడదు. "బుద్ధుడు ఉన్నాడు. అంబేద్కర్ ఉన్నాడు. మార్క్స్ ఉన్నాడు. మరి మనం ఇంకా ఎందుకు మారలేదు"?. ఈ ప్రశ్నకు సమాధానం వెతకకుండా మరొక మహానుభావుడి కోసం ఎదురు చూడడం అనేది చీకట్లో పోగొట్టుకున్న తాళం చెవిని వెలుతురు ఉన్నచోట వెతకడంలాంటిది. మన దేశంలో సిద్ధాంతాల కొరత కాదు.ప్రపంచంలో మరేదేశానికి లేనంత సిద్ధాంత సంపద మనదగ్గర ఉంది. మతాలు ఉన్నాయి. తత్వాలు ఉన్నాయి. విప్లవ గ్రంథాలు ఉన్నాయి.రాజ్యాంగం ఉంది.ఉద్యమాల చరిత్ర ఉంది.అయినప్పటికీ అన్యాయం ఉంది. అసమానత ఉంది.ద్వేషం ఉంది. దోపిడీ ఉంది. కులం ఉంది.మత వివక్షకు కూడా ఉంది. అంటే సమస్య ఎక్కడో వేరేచోట ఉంది.

మనిషి ఒక ఆశ్చర్యకరమైన జీవి. అతడు స్వేచ్ఛ గురించి మాట్లాడుతాడు. కానీ తనకు అవకాశం దొరికితే ఇతరులను నియంత్రించాలని చూస్తాడు. సమానత్వం గురించి ఉపన్యాసాలు ఇస్తాడు. కానీ తనకు ఉన్న ప్రత్యేక హక్కులను వదులుకోవడానికి సిద్ధపడడు. న్యాయం గురించి గట్టిగా మాట్లాడతాడు. కానీ తనకు లాభం కలిగించే అన్యాయాన్ని మాత్రం మౌనంగా సమర్ధిస్తాడు. ఇదే మానవ వైరుధ్యం. (Human paradox ).

బుద్ధుడు మనిషిలోని దుఃఖాన్ని చూశాడు అంబేద్కర్ కుల ఆధిపత్యాన్ని చూశాడు. మార్క్స్ ఆర్థిక దోపిడిని చూశాడు. కానీ ఈ ముగ్గురి ఆలోచనలు కూడా తమ స్వార్థానికి అనుగుణంగా మార్చుకునే మనిషి "మనస్తత్వాన్ని"(విప్లవం ఓడిపోయే చోటు) మనం ఇంకా పూర్తిగా అర్థం చేసుకోలేదు. అధ్యయనం చేసే ప్రయత్నమూ చేయడం లేదు.

అందుకే చరిత్రలో ఒక విచిత్రమైన దృశ్యం కనిపిస్తుంది.విప్లవం కోసం పోరాడిన వ్యక్తి అధికారంలోకి వచ్చిన తరువాత అధికార భాషనే మాట్లాడుతాడు. సమానత్వం కోసం పోరాడిన నాయకుడు తన అనుచరుల మధ్య అసమానతలను సహజంగా స్వీకరిస్తాడు. తన శత్రువును సులభంగా గుర్తిస్తాడు కానీ తనలోని అహంకారాన్ని గుర్తించలేడు. తనకు జరిగిన అన్యాయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాడు కానీ తాను చేసిన అన్యాయాన్ని మరుసటిరోజే మర్చిపోతాడు. తనను అణిచివేసే వ్యవస్థను విమర్శిస్తాడు. కానీ తాను ఇంకొకరిపై చూపుతున్న ఆధిపత్యాన్ని చూడలేడు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమమే కొన్నిసార్లు తనలోనీ భిన్నాభిప్రాయాలను అణచి వేస్తుంది. అంటే సమస్య సిద్ధాంతంలో లేదు సమస్య సిద్ధాంతాన్ని ఉపయోగిస్తున్న మనసులో ఉంది. అందుకే సమాజ మార్పు గురించి మాట్లాడేటప్పుడు మనం కేవలం రాజకీయాలను, కులాన్ని, ఆర్థిక వ్యవస్థను మాత్రమే చర్చిస్తున్నాం. కానీ అన్నింటిని నడిపిస్తున్న మనస్తత్వాన్ని గురించి తక్కువగా మాట్లాడుతున్నాం. ప్రపంచ చరిత్రలో జరిగిన అనేక ఘర్షణలు కేవలం ఆర్థిక, మత కారణాల వల్ల మాత్రమే జరగలేదు. మనిషి తన గుర్తింపును కాపాడుకోవాలనే భయం,తన గుంపును గొప్పదిగా భావించాలనే కోరిక, ఇతరుల కంటే పై చేయిగా ఉండాలనే మనస్తత్వం కూడా వాటికి కారణమయ్యాయి. ఈ సత్యాన్ని గుర్తించకుండా కేవలం సిద్ధాంతాలను అమలు పరచడం ద్వారా

> చరిత్రలో ఒక విచిత్రమైన దృశ్యం కనిపిస్తుంది.విప్లవం కోసం పోరాడిన వ్యక్తి అధికారంలోకి వచ్చిన తరువాత అధికార భాషనే మాట్లాడుతాడు. సమానత్వం కోసం పోరాడిన నాయకుడు తన అనుచరుల మధ్య అసమానతలను సహజంగా స్వీకరిస్తాడు. తన శత్రువును సులభంగా గుర్తిస్తాడు కానీ తనలోని అహంకారాన్ని గుర్తించలేడు. తనకు జరిగిన అన్యాయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాడు కానీ తాను చేసిన అన్యాయాన్ని మరుసటిరోజే మర్చిపోతాడు. తనను అణిచివేసే వ్యవస్థను విమర్శిస్తాడు. కానీ తాను ఇంకొకరిపై చూపుతున్న ఆధిపత్యాన్ని చూడలేడు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమమే కొన్నిసార్లు తనలోనీ భిన్నాభిప్రాయాలను అణచి వేస్తుంది. అంటే సమస్య సిద్ధాంతంలో లేదు సమస్య సిద్ధాంతాన్ని ఉపయోగిస్తున్న మనసులో ఉంది. అందుకే సమాజ మార్పు గురించి మాట్లాడేటప్పుడు మనం కేవలం రాజకీయాలను, కులాన్ని, ఆర్థిక వ్యవస్థను మాత్రమే చర్చిస్తున్నాం.

సమాజాన్ని మార్చగలమని భావించడం ఒక భ్రమ. ఈ దేశంలో చాలామంది మహానుభావులను చదువరు. వారిని పూజిస్తారు. ఆలోచనలను విశ్లేషించరు.వాటిని నినాదాలుగా మార్చుకుంటారు. ప్రశ్నించరు.విశ్వసిస్తారు. ఫలితంగా సిద్ధాంతం ఒక మతంగా మారుతుంది. నాయకుడు ఒక దేవుడిగా మారుతాడు. అనుచరుడు ఒక భక్తుడిగా మారుతాడు. ఏ సిద్ధాంతమైన విమర్శనాత్మక అధ్యయనం నుంచి ఆరాధన దశలోకి వెళ్ళినప్పుడు అది తన విముక్తి శక్తిని కోల్పోతుంది. తద్వారా ఆలోచన ఆగినచోట మార్పు కూడా ఆగిపోతుంది.

అందుకే ఈ దేశానికి కావలసింది మరో బుద్ధుడు కాదు. మరో అంబేద్కర్ కాదు. మరో మార్క్స్ కాదు. వారందరి నుండి నేర్చుకుంటూనే వారందరినీ ప్రశ్నించగలిగే ఒక కొత్త మేధో సంస్కృతి. తన కులాన్ని, తన మతాన్ని, తన రాజకీయ నాయకుడిని,అవసరమైతే తనను తాను కూడా ప్రశ్నించగలిగే వ్యక్తి. ఎందుకంటే రాజకీయ, ఆర్థిక,సామాజిక విప్లవాలు అనేవి ప్రభుత్వాలను, సంపద పంపిణీని,సంబంధాలను మార్చవచ్చునేమోగాని మనిషి తనను తాను "పరిశీలించడం" (కమ్యూనిస్టులు చెప్పే ఆత్మ విమర్శ కన్నా లోతైనది) ప్రారంభించిన రోజే అసలు విప్లవం మొదలవుతుంది.



ఆయిరబోయిన
బిక్షపతి
79932 48717


# దేశం వెలుగుతున్నా.. ఇల్లు చీకటేనా..!?

ఒక సామాన్య కుటుంబంలో తండ్రి సంపాదన అంతంత మాత్రంగానే ఉంది అనుకుందాం. ఇంట్లో పిల్లల చదువులకు డబ్బుల్లేవు, నిత్యావసరాల సరుకులు కొనడానికి అప్పులు చేయాల్సి వస్తోంది. కానీ, ఆ తండ్రి మాత్రం వీధి అరుగు మీద కూర్చుని.. "మా వంశం గొప్పది, మా తాతల ఆస్తులు కోట్లల్లో ఉన్నాయి" అని ఊరంతా గొప్పలు చెప్పుకుంటూ తిరిగితే ఆ కుటుంబం ఆకలి తీరుతుందా..? ఈరోజు మన దేశ ఆర్థిక పరిస్థితి, సామాన్యుడి జేబును గమనిస్తే సరిగ్గా ఇలాంటి చిత్రమే కళ్లముందు కదలాడుతోంది. పత్రికలు చూసినా, టీవీలు ఆన్ చేసినా.. దేశం అద్భుతంగా అభివృద్ధి చెందిపోతోందని, ప్రపంచ దేశాల సరసన మన దేశం ఎంతో ఎత్తున నిలిచిందని పెద్ద పెద్ద అంకెలు, లెక్కలు చెప్తుంటారు. కానీ, అదే సామాన్యుడు ఉదయాన్నే సంచి పట్టుకుని కూరగాయల మార్కెట్‌కో, కిరాణా కొట్టుకో వెళ్తే.. వంద రూపాయల నోటు ఐదు నిమిషాల్లో కరిగిపోతోంది. కూరగాయలు, పప్పులు, వంట నూనెలు, గ్యాస్ సిలిండర్, బైకులో పోయించే పెట్రోల్.. ఇలా ఒకటేమిటి, నిత్యావసరాల ధరలన్నీ ఆకాశాన్ని తాకుతున్నాయి. దేశం వెలుగుతోందని పాలకులు చెప్తున్న మాట నిజమే అయితే.. మరి సామాన్యుడి ఇంట్లో ఇంకా చాలీచాలని బతుకులు, ఆర్థిక చీకట్లు ఎందుకు ముసురుతున్నట్లు..? ఈ ప్రశ్న ప్రతి సామాన్యుడి గుండెల్లో తొలిచేస్తోంది. ప్రస్తుతం మన సమాజం రెండు ముక్కలుగా విడిపోయింది. పెద్ద పెద్ద వ్యాపారాలు, కోటీశ్వరుల ఆస్తులు, నగరాల్లోని బహుళ అంతస్తుల భవనాల వెలుగులు పైపైకి దూసుకుపోతున్నాయి. కానీ, రెక్కాడితే గాని డొక్కాడని రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు, చేతివృత్తుల వారు, నెల జీతాల మధ్యతరగతి జీవులు మాత్రం రోజురోజుకూ కిందికి పడిపోతున్నారు. దేశంలో వంద మంది సంపాదనాపరులను తీసుకుంటే.. అందులో కేవలం ఒక ఐదు ఆరు గురికి మాత్రమే పెద్ద కంపెనీలలో స్థిరమైన ఉద్యోగాలు, నెల నెలా పెరిగే జీతాలు, బోనస్సులు ఉన్నాయి. మిగిలిన 94 మంది రోడ్డు పక్కన బండ్లు పెట్టుకునేవారు, భవన నిర్మాణ కార్మికులు, చిన్న దుకాణదారులు, చేనేత కార్మికులు, ముఠా కూలీలు, వ్యవసాయ కూలీలుగానే బతుకు వెళ్లదీస్తున్నారు. గతంలో జరిగిన కొన్ని హఠాత్ నిర్ణయాలు, ఆ తర్వాత వచ్చిన కరోనా లాక్డౌన్‌ల దెబ్బకు ఈ మెజారిటీ ప్రజల నడుము విరిగిపోయింది. ప్రభుత్వమేమో కేవలం ఆ కొద్దిమంది ఉన్న పెద్ద కంపెనీల లాభాలను చూసి, "దేశం అంతా వెలిగిపోతోంది" అని మురిసిపోతోంది. ఒక పెద్ద చెట్టు వేళ్లకు నీళ్లు పోయడం మానేసి, కేవలం పైనున్న కొమ్మలకు, ఆకులకు రంగులు పూస్తే ఆ చెట్టు ఎంతో కాలం బతకదు కదా..!. మన దేశానికి కావలసిన ముడి చమురు (పెట్రోల్, డీజిల్) లో దాదాపు ఎక్కువ భాగం మనం విదేశాల నుంచే కొంటున్నాం. ప్రపంచంలో ఎక్కడో యుద్ధాలు జరిగితే, అక్కడ చమురు ధరలు పెరుగుతాయి. దాంతో మనం ఎక్కువ డబ్బులు పెట్టి చమురు కొనాల్సి వస్తుంది, ఫలితంగా మన దేశ కరెన్సీ బలం తగ్గిపోతుంది. ఇక్కడ పెట్రోల్, డీజిల్ రేట్లు పెరగగానే రవాణా ఖర్చులు పెరిగి, చివరికి సామాన్యుడు తినే ఉప్పు, పప్పు, టమోటాల ధరలు కూడా ప్రియమవుతాయి. వనరుల కోసం, ఇంధనం కోసం మనం ఇంకా విదేశాలపైనే ఆధారపడటం మన పెద్ద బలహీనత. మరోవైపు, దేశంలో చట్టబద్ధంగా జరగాల్సిన వ్యాపారాల కంటే, వెనుకదారిలో నడిచే 'నల్లధన' సామ్రాజ్యం ఒక పెద్ద భూతంలా విస్తరిస్తోంది. రాజకీయ నాయకులు, కొందరు బడా వ్యాపారవేత్తల చేతుల్లోనే ఈ సంపద కేంద్రీకృతమై మురిగిపోతోంది. ఈ దొంగ చాటు వ్యవస్థ వల్ల ప్రభుత్వానికి రావలసిన పన్నుల ఆదాయం రాదు. ఫలితంగా పేదలకు అందాల్సిన నిజమైన సాయానికి, ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల అభివృద్ధికి నిధుల కొరత ఏర్పడుతోంది. ఇలాంటి క్లిష్ట తరుణంలో ప్రభుత్వాలు చేయాల్సింది కేవలం తాత్కాలికంగా ఎన్నికల స్టంట్లుగా 'ఉచితాలు' ప్రకటించడమో, లేదా కాగితాల మీద లెక్కలతో మాయ చేయడమో కాదు. సామాన్యుడి చేతికి పని దొరకాలి. పల్లెల్లో, చిన్నచిన్న పట్టణాల్లో ఉపాధి అవకాశాలు పెరగాలి. చిన్న తరహా పరిశ్రమలకు, చేతివృత్తులకు రాయితీలు ఇచ్చి ఆదుకోవాలి. ఎందుకంటే.. సామాన్యుడి చేతిలో నాలుగు డబ్బులు ఆడితేనే, వాడు మార్కెట్‌కి వెళ్లి వస్తువులు కొంటాడు. వాడు కొంటేనే దేశంలో చిన్న చిన్న వ్యాపారాలు నడుస్తాయి. వ్యాపారాలు నడిస్తేనే దేశ ఆర్థిక వ్యవస్థకు నిజమైన బలం వస్తుంది. కార్పొరేట్ దిగ్గజాల లాభాల అంకెల్లో కనిపించే వెలుగు కంటే.. సామాన్యుడి కళ్లలో, అతని నిండు ఇంట్లో కనిపించే తృప్తే దేశ ప్రగతికి అసలైన కొలమానం..! అప్పుడే "దేశం వెలుగుతోంది" అనే మాట ప్రతి సామాన్యుడి ఇంటా నిజమవుతుంది.



రాజేందర్ దామెర
సీనియర్ జర్నలిస్ట్

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020



# జాతీయం-అంతర్జాతీయం





## వేధింపులకు గురి చేస్తోన్న సర్..

- లోక్‌సభలో ఓ బిల్లు ఓడినందుకే ఈ కక్ష సాధింపులు
- ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్

**లక్నో, జూన్ 29:**
సర్ ప్రక్రియ ప్రజలను వేధింపులకు గురిచేస్తోందని సమాజ్ వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అన్నారు. ఇటీవల ఓ బిల్లు సందర్భంగా మోడీ ప్రభుత్వాన్ని లోక్ సభలో ఓడించాం దానికి బదులుగా సర్ ప్రక్రియను మొదలు పెట్టారని ఆయన విమర్శించారు. "రాజకీయ పార్టీలు నిరసనలు చేపట్టకుండా నిరోధించడానికి, మిమ్మల్ని(ప్రజలను) నిరంతరం వేధించడానికే ఎస్ఐఆర్ (సర్)ను ఉపయోగిస్తున్నారని, సవరణ ప్రక్రియ వల్ల తలెత్తిన సమస్యల కారణంగా ప్రజలు తమ పౌరసత్వం పై ప్రశ్నలను ఎదుర్కొంటున్నారని, కేవలం ఎస్ఐఆర్ (సర్)లో వారి పేర్లు లేనందువల్ల, అత్యంత ప్రముఖులు కూడా తమ పౌరసత్వంపై ప్రశ్నలను ఎదుర్కొంటున్నారని నేను విన్నాను, ఈ అధికారిక చిక్కుముడిలో మనం ఎంత లోతుగా చిక్కుకుంటున్నామో ఒక్కసారి ఊహించండి. 2027లో ఉత్తర ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి, ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ, సమాజ్‌వాదీ పార్టీల మధ్య ప్రధాన పోరు జరగనుంది" అని ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాగా, ఈ ఏడాది జనవరిలో, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 'ప్రత్యేక సమగ్ర సవరణ' (SIR) ప్రక్రియ పూర్తి చేశారు.
ఆ తర్వాత ముసాయిదా ఓటర్ల జాబితా నుండి 2.89 కోట్ల పేర్లను తొలగించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా వెల్లడించారు.

## నిందితుల తరపున వాదిస్తే రూ.5 లక్షల జరిమానా

- అయోధ్య కేసుపై యూపీ బార్ అసోసియేషన్ వార్నింగ్
- సాధారణ సమావేశంలో నిర్ణయం

**లక్నో, జూన్ 29:**
అయోధ్య రామాలయం విరాళాల దుర్వినియోగం ఆరోపణల కేసులో నిందితుల తరపున న్యాయవాదులు ఎవ్వరూ వాదించకూడదని ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. అసోసియేషన్ సభ్యుల్లో ఎవరైనా నిందితుల తరపున కోర్టులో హాజరైతే వారికి రూ. 5 లక్షల జరిమానా విధిస్తామంటూ హెచ్చరించింది. పవిత్రమైన అయోధ్య విషయంలో తప్పుగా వ్యవహరించడమే బార్ అసోసియేషన్ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. ఈ మేరకు సోమవారం జరిగిన బార్ అసోసియేషన్ సాధారణ సమావేశంలో న్యాయవాదులు ఈ నిర్ణయం తీసుకున్నారు.
ఈ వివాదంతో సంబంధం ఉన్న చంపత్ రాయ్, అనిల్ మిశ్రా, గోపాల్ రావు ఈ ముగ్గురు కూడా



మూడు రోజుల్లో అయోధ్యను విడిచి వెళ్లాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇందులో చంపత్ రాయ్ శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆయనతో పాటు ట్రస్టీ అనిల్ మిశ్రా కూడా తమ పదవులకు రాజీనామా చేశారు. ఫైజాబాద్ బార్ అసోసియేషన్ కార్యదర్శి శైలేంద్ర జైస్వాల్ మాట్లాడుతూ రామాలయ హుండీ విరాళాల దొంగతనం తమ మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని చెప్పారు. అందుకే నిందితుల తరపున ఎవ్వరూ వాదించకూడదని ఫైజాబాద్ న్యాయవాదులందరూ ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితుల తరపున ఎవరైనా న్యాయవాది వాదిస్తే వారికి రూ. 5 లక్షల జరిమానా విధిస్తామంటూ హెచ్చరించారు. ఈ వ్యవహారంలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రా, గోపాల్ రావుపై కేసు నమోదు చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయిస్తున్నట్లు బార్ అసోసియేషన్ వెల్లడించింది. ఈ కేసును సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేసింది. ఈ కేసులో రూ. 7 నుంచి రూ. 7.5 కోట్ల వరకు విరాళాలు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ ఈ అంశాన్ని లేవనెత్తడంతో ముఖ్యమంత్రి విచారణకు ఆదేశించారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ రూ. 200 కోట్ల నగదు, 200 కిలోల వెండి కనిపించడం లేదంటూ ఆరోపించారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ మాత్రం ఆరోపణలను తీవ్రంగా ఖండించింది.

## ముక్కులో వేయాల్సిన కండ్లలో..

- శాశ్వతంగా చూపు కోల్పోయిన చిన్నారి
- మధ్యప్రదేశ్‌లో ఘటన

**భోపాల్, జూన్ 29:**
ముక్కులో వేయాల్సిన మందు కళ్లల్లో వేయడంతో 19 నెలల చిన్నారి శాశ్వతంగా చూపు కోల్పోయిన ఘటన మధ్యప్రదేశ్ రాష్ట్రంలో చోటుచేసుకుంది. సాగర్ జిల్లా బండా సివిల్ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన చిన్నారికి వైద్యుడు పొరపాటున ముక్కులో వేయాల్సిన సెలైన్ నాసల్ డ్రాప్స్‌ను కళ్లల్లో వేయడంతో చూపు పోయిందంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. చిన్నారి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మే 29న ఇంద్రాజ్ విశ్వకర్మ తన 19 నెలల కుమారుడు వినయ్ విశ్వకర్మను బండా సివిల్ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. జలుబు చేసి కళ్లు ఎర్రబడటం వంటి లక్షణాలు ఉండటంతో ప్రభుత్వ వైద్యుడికి చూయించాడు.
ఆ చిన్నారిని పరీక్షించిన వైద్యుడు చికిత్సలో భాగంగా సెలైన్ నాసల్ డ్రాప్స్‌ను కళ్లలో వేశాడు. దాంతో పాటు పారాసిటమాల్ సిరప్, ఇంజెక్షన్‌తో పాటు మరి కొన్ని మందులు కూడా రాసిచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.





## కథ మళ్లీ మొదటికి..

- హర్మూజ్ వద్ద వాణిజ్య నౌకలపై దాడి
- తనకు సంబంధం లేదన్న ఇరాన్

**టెహ్రాన్, జూన్ 29:**
స్విట్జర్లాండ్‌లో శాంతి ఒప్పంద చర్చలు జరిగిన కొద్ది రోజులకే మళ్లీ అమెరికా ఇరాన్ మధ్య క్షిపణుల దాడి జరిగింది. ఈ సారి భీకరంగా జరిగిన దాడుల్లో ఇరు దేశాలు నష్టపోయాయి. ఇరాన్‌లోని కీలక స్థావరాలను టార్గెట్ చేసుకుని అమెరికా మిస్సైల్స్ ప్రయోగించగా.. కువైట్, బహ్రేయిన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణుల దాడి చేసింది. అయితే, ఇరు దేశాలు ప్రస్తుతం తాత్కాలికంగా దాడులు నిలిపివేసి మళ్లీ చర్చల బాట పట్టాయి. ఖతార్ రాజధాని దోహాలో మంగళవారం సమావేశమై హోర్మూజ్ జలసంధి వివాదంపై చర్చించేందుకు అమెరికా ఇరాన్ దేశాలు అంగీకరించినట్లు సమాచారం. యుద్ధ విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ వీకెండ్‌లో అమెరికా, ఇరాన్ మరోసారి పరస్పరం దాడులు చేసుకున్నాయి. దాంతో మిడిల్ ఈస్ట్‌లో ఆందోళనలు మళ్లీ మొదలయ్యాయి. హోర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులు జరగడమే మళ్లీ ఉద్రిక్తతలకు కారణం. ఈ దాడులకు ఇరాన్ కారణమంటూ అమెరికా ఆరోపిస్తూ.. ఇరాన్‌కు చెందిన సైనిక స్థావరాలపై వైమానిక దాడులు చేసింది. అయితే, వాణిజ్య నౌకలపై తొలి దాడికి తమకూ ఎలాంటి సంబంధం లేదంటూ ఇరాన్ ఖండించింది. ఇరాన్ విదేశాంగ్ శాఖ మంత్రి అబ్బాస్ అరాఘ్చి అమెరికా దాడులు పరస్పర అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘించడమే అని పేర్కొన్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం ఇరాన్ యుద్ధ విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని.. అందుకే క్షిపణి, డ్రోన్, రాడార్ కేంద్రాలపై దాడులు చేసినట్లు సమర్థించుకున్నారు. ప్రస్తుతం పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరు దేశాలు తాత్కాలికంగా సైనిక దాడులు నిలిపివేయాలని నిర్ణయించుకున్నాయి. అమెరికాకు చెందిన ఓ సీనియర్ అధికారి మాట్లాడుతూ సైనిక చర్యలు పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించుకున్నాం అని తెలిపారు. మరో అధికారి మాట్లాడుతూ ఇకపై హోర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించొచ్చని చెప్పారు. ఖతార్ రాజధాని దోహాలో మంగళవారం జరగనున్న చర్చల్లో హోర్మూజ్ జలసంధి సమస్యపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. తొలుత ఈ చర్చలు స్విట్జర్లాండ్‌లో నిర్వహించి ఇరాన్ అణు కార్యక్రమంలో చర్చించాలని అనుకున్నారు. కానీ హోర్మూజ్‌లో ఏర్పడిన ఉద్రిక్తతతో దోహాలో చర్చించేందుకు నిర్ణయించారు.

## తెరపైకి భారత్-చైనా సరిహద్దు సమస్యలు

- తీవ్ర ఆందోళనలో గిరిజనులు
- అధికారిక ప్రకటన జారీ చేయని అరుణాచల్ ప్రదేశ్

**ఈటానగర్, జూన్ 29:**
భారత్ చైనా సరిహద్దు సమస్యలు మళ్లీ తెరపైకి వచ్చాయి. అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఎగువ సుబన్‌సిరి జిల్లాలో భారత్ చైనా సరిహద్దు వెంట చైనా సైన్యం చొరబాట్లు పెరుగుతున్నాయంటూ అక్కడి గిరిజనులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరేళ్లుగా తమ పశువుల మేత భూములు, వేట ప్రాంతాలు, వ్యవసాయ భూముల్లో చైనా ఆక్రమించిందంటూ నాహ్ గిరిజన సమాజం అంటోంది. చైనా చొరబాట్లు, ఆక్రమణలపై నాహ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కెరు చాదర్ ఎగువ సుబన్‌సిరి జిల్లా డిప్యూటీ కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. కొన్నేళ్ల కిందట వరకు తాము తమ పూర్వీకుల భూముల్లో స్వేచ్ఛగా తిరుగుతూ వేటాడేవాళ్లమని, కానీ ఇప్పుడు చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ వాటిని ఆక్రమించిందంటూ ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. టాక్సింగ్ రెవెన్యూలో మొత్తం ఐదు చోట్ల చైనా చొరబాటు చేసిందంటూ ఆరోపణలు



చేస్తున్నారు. అదేవిధంగా భారత భూభాగంలోనే రోడ్లు, సైనిక శిబిరాలు ఏర్పాటు చేస్తోందంటూ తెలిపారు.
"కొన్ని సంవత్సరాల కిందట వరకు మా పూర్వీకుల భూముల్లో స్వేచ్ఛగా తిరిగేవాళ్లం. అటవీ ఉత్పత్తులు సేకరించేవాళ్లం. మా పశువుల మేత భూములు కూడా ఇప్పుడు చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఆధీనంలోకి వెళ్లిపోయాయి. భారత సైన్యం భూములను ఎన్నో ఏళ్లుగా కాపాడుతూ వస్తున్నారు. కానీ ప్రస్తుతం టాక్సింగ్ ప్రాంతంలో చైనా సైన్యం చేపడుతున్న చర్యలు ఆందోళనకరంగా ఉంది. ప్రతి రోజూ అంగుళం అంగుళం మా భూమిని కోల్పోతున్నాం" అని కెరు చాదర్ వినతి పత్రం పేర్కొన్నారు. టాక్సింగ్ రెవెన్యూ సర్కిల్ పరిధిలోని ఓయింగ్, పనియార్, మార్పాన్, పోత్రాంగ్ సరస్సు, టిండింగ్‌టాంగ్ ప్రాంతాల్లో చైనా క్రమంగా తన ఆధిపత్యాన్ని విస్తరిస్తోందని నాహ్ వెల్ఫేర్ సొసైటీ ఆరోపించింది. ఈ ప్రాంతం ఉండే నాచో నియోజకవర్గం ఎమ్మెల్యే దీనిపై స్పందించారు. ప్రభుత్వం అధికారికంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు జిల్లా యంత్రాంగం కానీ, అరుణాచల ప్రదేశ్ ప్రభుత్వం గానీ ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

## తీస్తా నిర్వహణకు చైనా మద్దతు

- ఆ దేశ విదేశాంగ మంత్రి స్పష్టీకరణ
- చైనా, బంగ్లాదేశ్ పరస్పర ఒప్పందం

**బీజింగ్, జూన్ 29:**
భారత్ ఆందోళనలను పక్కనబెడుతూ.. బంగ్లాదేశ్‌లోని 'తీస్తా నది సమగ్ర నిర్వహణ, పునరుద్ధరణ ప్రాజెక్ట్' కు తన మద్దతును చైనా పునరుద్ఘాటించింది. అంతేకాదు, బంగ్లాదేశ్‌తో తమ ద్వైపాక్షిక సహకారంలో ఎలాంటి మూడో దేశం ప్రమేయం ఉండకూడదని కూడా స్పష్టం చేసింది. తీస్తా ప్రాజెక్ట్‌కు మద్దతు విషయంలో భారత్ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలపై బీజింగ్‌లో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గువో జియాకున్ స్పందించారు. "చైనాబంగ్లాదేశ్ సహకారం ఏ దేశాన్ని లక్ష్యంగా చేసుకుని చేస్తున్నది కాదు... అలాగే దీనిపై మూడో పార్టీ ప్రభావం ఏమాత్రం ఉండకూడదని నేను నొక్కి చెప్పాలనుకుంటున్నాను" అని అన్నారు.
తీస్తా నదీ పరివాహక ప్రాంతం ఈశాన్య రాష్ట్రాలకు అత్యంత సమీపంలో ఉండటమే, బంగ్లాదేశ్ చైనా సంయుక్త ప్రాజెక్ట్‌పై భారత్ ఆందోళనకు ప్రధాన కారణం. అయితే, దీనిని బంగ్లాదేశ్‌కు అత్యంత ప్రాధాన్యత కలిగిన ఒక 'జీవనోపాధి ప్రాజెక్ట్'గా చైనా పేర్కొనడం గమనార్హం. "తీస్తా నది సమగ్ర శుద్ధి, పునరుద్ధరణ అనేది బంగ్లాదేశ్ ఎంతో ప్రాధాన్యత ఇస్తున్న ఒక జీవనోపాధి ప్రాజెక్ట్.. దీనికి మద్దతు ఇవ్వడానికి చైనా తన వంతు సహాయం చేయడానికి సిద్ధంగా ఉంది" అని జియాకున్ తెలిపారు. అలాగే, "అభివృద్ధి వ్యూహాలలో బంగ్లాదేశ్‌తో మరింత సమన్వయం సాధించడానికి, అలాగే ఆర్థిక, వాణిజ్య, జలవనరుల పరిరక్షణ, జీవనోపాధి వంటి రంగాలలో పరస్పర మార్పిడి, సహకారాన్ని పెంపొందించుకోవడానికి చైనా సిద్ధంగా ఉంది" అని ఆయన పేర్కొన్నారు.
మరోవైపు, బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలూర్ రెహమాన్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్‌పై ఇరు దేశాల నిపుణులు మొదటిసారిగా సాంకేతిక సాధ్యసాధ్యాల అధ్యయనం నిర్వహించనున్నారని తెలిపారు. "దీనికి ఇరుపక్షాలు అంగీకరించాయి... గతంలో ఈ ప్రక్రియ ఈ స్థాయికి చేరలేదు. ఫీజిబిలిటీ స్టడీ నివేదిక ఆధారంగా ఈ ప్రాజెక్ట్‌కు సాధ్యమైన అన్ని రకాల మద్దతును అందిస్తామని చైనా తెలిపింది" అని మంత్రి పేర్కొన్నారు. తీస్తాతో సహా బంగ్లాదేశ్‌లోని నదుల



నిర్వహణలో సహకారాన్ని పెంచుకోవడానికి ఢాకా, బీజింగ్ ఒక ఒప్పందానికి వచ్చాయి. ఈ నేపథ్యంలో, తీస్తా ప్రాజెక్ట్ గురించి వెలువడే ప్రతి ప్రకటననూ భారత్ నిశితంగా గమనిస్తోంది. ఈ ఏడాది జనవరిలో బంగ్లాదేశ్ వాటర్ డెవలప్‌మెంట్ బోర్డ్ చైనా ప్రభుత్వ యాజమాన్యంలోని 'పవర్‌చైనా' సంస్థలు అవగాహన ఒప్పందాన్ని పొడిగిస్తూ సంతకాలు చేశాయి. ఇది తీస్తా ప్రాజెక్ట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లింది.
భారత్ వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన, సున్నితమైన 'సిలిగురి కారిడార్' (చికెన్స్ నెక్)కు తీస్తా నది చాలా దగ్గరగా ఉంది. ఈ ప్రాంతంలో చైనా భాగస్వామ్యం ఉండటంపైనే భారత్ ప్రధానంగా ఆందోళన చెందుతోంది. ఈ వ్యూహాత్మక ప్రాంతంలో బాహ్య శక్తుల ప్రభావం పెరగడం, ముఖ్యంగా చైనా ఉనికి అనేది భారత భద్రతకు ముప్పుగా మారడమే కాకుండా.. ఈశాన్య రాష్ట్రాలను దేశంలోని ఇతర భాగాలతో అనుసంధానించే ఈ కీలక కారిడార్‌కు వ్యూహాత్మక బలహీనతలను సృష్టించవచ్చు.



## విద్యార్థి సంఘాల ఆందోళనకు సీపీఐ (ఎం) మద్దతు

- నిరసనకారులకు సంపూర్ణ సంఘీభావం

**న్యూఢిల్లీ, జూన్ 29:**
నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం, దేశంలో విద్యా వ్యవస్థ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలంటూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన ఆందోళన తీవ్ర రూపం దాల్చింది. ఈ నేపథ్యంలో, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, సీనియర్ నాయకురాలు బృందాకరత్ ఈరోజు జంతర్ మంతర్‌ను సందర్శించి, నిరసనకారులకు తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ పర్యటనలో వారి వెంట ఎస్ఎఫ్ఐ జాయింట్ సెక్రటరీ ఐషే ఘోష్ సహా పలువురు విద్యార్థి నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా బేబీ, బృందా కరత్‌లు.. కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు అభిజీత్ దిప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, విద్యార్థులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో అక్కడ నిరాహార దీక్షకు కూర్చున్న ప్రముఖ పర్యావరణ, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చూక్‌ను వారు పరామర్శించారు.

## పాక్-ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు


- 29 మంది తీవ్రవాదులు హతం
- సాధారణ పౌరులు కూడా మృతి

**ఇస్లామాబాద్, జూన్ 29:**
కరాచీ రేంజర్స్ కార్యాలయంపై ఉగ్ర దాడి తర్వాత పాక్ అఫ్ఘనిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. కరాచీ దాడి జరిగిన తర్వాత రోజే అఫ్ఘనిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్థాన్ గ్రౌండ్ ఆపరేషన్ నిర్వహించి, 29 మంది తీవ్రవాదులను హతమార్చినట్లు పాకిస్థాన్ వెల్లడించింది. అయితే, ఈ దాడుల్లో సాధారణ పౌరులు కూడా మృతిచెందారని అఫ్ఘనిస్థాన్ తాలిబన్ ప్రభుత్వం ఆరోపించింది. తాలిబన్ అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ మాట్లాడుతూ తూర్పు అఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ దాడులు చేసిందని వెల్లడించారు. ఈ దాడుల్లో సాధారణ పౌరులే ఎక్కువ మంది మృతిచెందారని, అనేకమంది గాయపడ్డారని తెలిపారు. పాక్ చేసిన



ఈ దాడులను పిరికిపంద చర్యగా అఫ్ఘనిస్థాన్ పేర్కొంది.
కరాచీలోని సింధ్ రేంజర్స్ ప్రధాన కార్యలయంపై పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో ఉగ్రవాదులు దాడి చేశారు. అనంతరం లోపలికి వెళ్లి విచక్షణారహితంగా కాల్పులు జరిపి, గ్రెనేడ్లు విసిరి రక్తపాతం సృష్టించారు. పాకిస్థాన్ భద్రతా బలగాలు కూడా ప్రతిదాడి చేశాయి. ఇరు వర్గాల మధ్య సుమారు 90 నిమిషాల పాటు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ దాడుల్లో పాకిస్థాన్ సిబ్బంది ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, ఉగ్రవాదులు కూడా ముగ్గురు మరణించారు. ఈ దాడికి తెహ్రీక్ ఎ తాలిబాన్ అనే పాకిస్థాన్ సంస్థ నుంచి విడిపోయిన జమాత్ ఉల్ అహ్రార్ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించింది పాకిస్థాన్ సమాచార మంత్రి అత్తాల్లా తరార్ ప్రకారం.. అఫ్ఘనిస్థాన్‌లోని పక్తియా, పక్తికా, కునార్ ప్రావిన్సుల్లో ఉన్న మూడు లక్ష్యాలపై గ్రౌండ్ ఆపరేషన్ చేసినట్లు వెల్లడించారు. అనంతరం టార్గెట్ చేసుకుని వైమానిక దాడులు కూడా చేసినట్లు పాక్ ప్రకటించింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 29 మంది మిలిటెంట్లు హతమయినట్లు పాక్ మంత్రి తెలిపారు. అనంతరం లోపలికి వెళ్లి విచక్షణారహితంగా కాల్పులు జరిపి, గ్రెనేడ్లు విసిరి రక్తపాతం సృష్టించారు. పాకిస్థాన్ భద్రతా బలగాలు కూడా ప్రతిదాడి చేశాయి.
బలోచిస్థాన్ సాధన లక్ష్యంగా పోరాటం ప్రారంభమైనప్పటి నుంచి పాకిస్థాన్ అఫ్ఘనిస్థాన్ మధ్య తీవ్ర స్థాయిలో దాడులు మొదలయ్యాయి. గతంలో కూడా అఫ్ఘన్‌పై పాక్ ఎయిర్ స్ట్రైక్ చేసి ఎంతోమంది సామాన్యుల మరణానికి కారణమైంది. పాక్ దాడులకు అఫ్ఘన్ కూడా ప్రతిదాడులు చేస్తోంది. కరాచీ సంఘటనతో ఇరు దేశాల మధ్య పరిస్థితులు తీవ్ర స్థాయికి వెళ్లాయి.

## సౌదీలో ఘోర ప్రమాదం



- హెలికాప్టర్ కూలటంతో 14 మంది దుర్మరణం
- సహాయక చర్యలు ప్రారంభం

**సౌదీ అరేబియా ఉత్తర తీరంలోని రస్ తనూరాలో ఆదివారం స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6.00 గంటలకు జరిగింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ ఘటనపై అరాంకో సంస్థ ఇంకా స్పందించలేదు.**

**రియాద్, జూన్ 29:** సౌదీలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రముఖ ఆయిల్ సంస్థ అరాంకోకు చెందిన హెలికాప్టర్ కూలిన ఘటనలో 14 మంది మరణించారు. మృతులంతా సౌదీకి చెందిన వారే. ఈ ఘటన సౌదీ అరేబియా ఉత్తర తీరంలోని రస్ తనూరాలో ఆదివారం స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6.00 గంటలకు జరిగింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ ఘటనపై అరాంకో సంస్థ ఇంకా స్పందించలేదు. అయితే, హెలికాప్టర్ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రమాద ఘటనకు, మృతులకు సంబంధించిన పూర్తి వివరాలు కూడా ఇంకా తెలియరాలేదు. ఈ ప్రమాదంపై సౌదీ చమురు మంత్రిత్వ శాఖ విచారం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించింది. సౌదీకి చెందిన చమురు సంస్థ అరాంకో 1934 నుంచి విమానయాన సేవలు కూడా అందిస్తోంది. 2023 నుంచి దీనికి సంబంధించిన సంస్థ పేరును అలౌలా ఏవియేషన్‌గా మార్చారు. ప్రస్తుతం ఈ సంస్థకు విమానాలు, హెలికాప్టర్లు వంటివి కలిపి 60 వరకు ఉన్నట్టు తెలుస్తోంది. సౌదీ అరేబియాలో తీర ప్రాంత రవాణా సేవలు, సరుకుల రవాణా, వైద్య పరమైన తరలింపు సేవలను సంస్థ నిర్వహిస్తోంది. మరోవైపు ఫ్రాన్స్‌లో కూడా ఆదివారం ఉదయం 11.00 గంటలకు విమాన ప్రమాదం జరిగింది
. స్కైడైవర్ల బృందంతో వెళ్తున్న చిన్న విమానం కూలడంతో 11 మంది మరణించారు. మృతుల్లో ఐదుగురు స్కైడైవింగ్ శిక్షకులు, ఐదుగురు విద్యార్థులు, పైలట్ ఉన్నారు.

## స్పెయిన్‌లో తెలంగాణ వాసి మృతి

- గీట్ల సాయి అఖిల్ రెడ్డిగా గుర్తింపు

**వేలెన్సియా, జూన్ 29:**
స్పెయిన్ దేశంలోని వేలెన్సియా నగరంలో పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కూనారం గ్రామానికి చెందిన గీట్ల సాయి అఖిల్‌రెడ్డి (30) భవనంపై నుంచి ఆదివారం పడి మృతి చెందినట్లు అతడి బంధువులు తెలిపారు. కూనారం గ్రామానికి చెందిన గీట్ల సుభాషినిరెడ్డి, గుణాకర్‌రెడ్డి దంపతులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.
వారి ఒక్కగానొక్క కుమారుడు సాయి అఖిల్‌రెడ్డి వేలెన్సియా నగరంలో గత ఆరు నెలలుగా హోటల్ మేనేజ్మెంట్ చదువుతున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. కూనారంలో విషాదఛాయలు అలముకున్నాయి.



**గీట్ల సాయి అఖిల్‌రెడ్డి(30) భవనంపై నుంచి ఆదివారం పడి మృతి చెందినట్లు అతడి బంధువులు తెలిపారు. కూనారం గ్రామానికి చెందిన గీట్ల సుభాషినిరెడ్డి, గుణాకర్‌రెడ్డి దంపతులు హైదరాబాద్‌లో నివాసం**

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఓటర్ల వివరాలు బి.ఎల్.ఓ. యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలి: జిల్లా కలెక్టర్

**మంచిర్యాల/జూన్ 29(వుదయం ప్రతినిధి)**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాలు అందించి ఓటర్ల నుండి సేకరించిన సమాచారం బి.ఎల్.ఓ. యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 21, 15 వార్డులలో కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియను మండల తహసిల్దార్ సతీష్ కుమార్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అందిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని, ఓటర్ల నుండి సేకరించిన వివరాలను బి.ఎల్.ఓ. యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు నిర్వహించే సమగ్ర సవరణ ఇంటింటి కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ఈ క్రమంలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ల వద్దకు వెళ్లిన సమయంలో ఎన్యుమరేషన్ ఫారం అందించినప్పుడు బి ఎల్ ఓ యాప్ లో మార్క్ చేయాలని తెలిపారు. సదరు ఓటరు ఎన్యుమరేషన్ ఫారం నింపిన తరువాత తిరిగి సేకరించి యాప్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. మరణించిన వారు, గ్రామం వదిలి వెళ్ళిన వారు, 2 అంతకు మించి ఎపిక్ కార్డులు కలిగి ఉండడం అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒకరికి ఒక ఓటరు గుర్తింపు కార్డు మాత్రమే ఉండేలా స్పష్టమైన జాబితా రూపొందించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపిన తరువాత తిరిగి సేకరించి బి ఎల్ ఓ యాప్ లో ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం...

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**జగిత్యాలలో నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన**

**సంక్షేమ శాఖ మంత్రి జగిత్యాల కోరుట్ల ఎమ్మెల్యేలు**

**జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పి**

**జగిత్యాల జూన్ 29 (వుదయం ప్రతినిధి)**



అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా దివ్యాంగులు వయోవృద్ధులు ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని రాష్ట్ర దివ్యాంగులు వయోవృద్ధులు ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ తో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు అనంతరం విద్యార్థులతో కలిసి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించి నషా ముక్త్ భారత్ పోస్టర్ ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు అని వారు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు నమ్మకాలను నిలబెట్టేలా ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు ఒక్కసారి మాత్రమే తీసుకుంటే ఏమవుతుంది అనే నిర్లక్ష్య ధోరణే జీవితాన్ని నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తుందని డ్రగ్స్‌కు అలవాటు పడిన తర్వాత దాని నుంచి బయటపడటం ఎంతో కష్టమని మంత్రి హెచ్చరించారు అందువల్ల ప్రతి యువకుడు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు కళాశాలలు విద్యా సంస్థలు లేదా పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే జిల్లా పోలీసు యంత్రాంగానికి సమాచారం అందించాలని మంత్రి సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు అనుకోకుండా మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్య చికిత్స కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు అలాంటి వారు సంకోచించకుండా ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకుని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యంతో పాటు భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుందని పేర్కొంటూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి యువకుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖకు తెలియజేసి సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ప్రభుత్వం నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ వంటి అవగాహన కార్యక్రమాలు యువతలో చైతన్యం పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయని విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు అనంతరం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు యువత దేశానికి విలువైన ఆస్తి అని వారు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య ఉపాధి వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబ వ్యవస్థను సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు తల్లిదండ్రులు తమ పిల్లల స్నేహితులు వారి ప్రవర్తన అలవాట్లపై నిరంతరం దృష్టి ఉంచి వారికి సరైన మార్గ నిర్దేశం చేయాలని కోరారు ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు "నో" చెప్పి ఇతరులను కూడా చైతన్యవంతులను చేయాలని సమాజంలో మత్తు రహిత వాతావరణం ఏర్పడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం వివిధ శాఖల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు యువత ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల దుష్పరిణామాలను తెలుసుకుని వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు జిల్లాలోని విద్యాసంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు మత్తు పదార్థాల వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖ లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు మత్తు వ్యసనానికి గురైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ.అడిక్షన్ కేంద్రాల ద్వారా వైద్య చికిత్స కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు మత్తు రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

అనంతరం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. డ్రగ్స్ సరఫరా విక్రయం వినియోగంపై నిరంతర నిఘా ఉంచి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## చిన్నారుల సమగ్ర వికాసానికే అంగన్‌వాడీలు

**గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడి**

**గంగాదేవిపల్లెలో నూతన అంగన్‌వాడీ భవనం ప్రారంభం**

**ధర్మపురి, జూన్ 29 (వుదయం ప్రతినిధి):**



చిన్నారుల సమగ్ర వికాసానికి, గర్భిణులు, బాలింతలకు మెరుగైన ఆరోగ్య, పోషకాహార సేవలు అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. గొల్లపల్లి మండలం గంగాదేవిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని సోమవారం ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని, అందులో భాగంగానే నాణ్యమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి చిన్నారికి బాల్యం నుంచే మెరుగైన విద్య, నాణ్యమైన పోషకాహారంతో పాటు సరైన ఆరోగ్య సేవలు అందాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గంగాదేవిపల్లెలో నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఈ అంగన్‌వాడీ భవనం ద్వారా స్థానిక మహిళలకు, చిన్నారులకు మరింత మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా ఉచిత యూనిఫాంలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ సూపర్వైజర్లు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## క్రైగర్ రి పర్వతాన్ని అధిరోహించిన విద్యార్థినిని సన్మానించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, జూన్ 29 (వుదయం ప్రతినిధి):**

కామారెడ్డి పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థి విస్లావత్ బన్నీ లడఖ్ ప్రాంతంలోని 6,100 మీటర్ల ఎత్తైన క్రైగర్ రి (Kaigar Ri) పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించి విశేష ప్రతిభ కనబరిచాడు.బన్నీ జూన్ 14న పర్వతారోహణను ప్రారంభించి, జూన్ 19 ఉదయం 8 గంటలకు శిఖరాన్ని చేరుకున్నాడు. శిఖరంపై భారత జాతీయ త్రివర్ణ పతాకంతో పాటు తెలంగాణ గిరిజన సంక్షేమ విద్యాసంస్థల సొసైటీ కళాశాల ఫ్లెక్సీని ప్రదర్శించి తన దేశభక్తిని, కళాశాలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నాడు.కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఎల్లాపూర్ తండాకు చెందిన ఇస్లావత్ బన్నీ గతంలో కిలిమంజారో, కాంగ్ యత్సే పర్వతాలను కూడా అధిరోహించి తన సత్తా చాటుకున్నాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన బన్నీ ఈ ఘనత సాధించడం పట్ల అతని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం విద్యార్థిని అభినందించి, శాలువతో సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ, బన్నీ సాధించిన విజయం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. అతను భవిష్యత్తులో మరిన్ని శిఖరాలను అధిరోహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అతని విజయాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. శ్రీనివాస స్వామి పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

**అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం**



**రాజన్న సిరిసిల్ల, జూన్ 29 (వుదయం ప్రతినిధి ):**

ప్రజావాణిలో ప్రజలు అందజేసే ప్రతి అర్జీని నిర్దేశిత గడువులో పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచవద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు.జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 172 దరఖాస్తులు అందాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అప్పగించిన కలెక్టర్, ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు.డివిజన్ స్థాయిలోనూ ప్రజావాణిజిల్లా కేంద్రంతో పాటు సిరిసిల్ల, వేములవాడ డివిజన్‌లలో కూడా ప్రజావాణి నిర్వహించారు. సిరిసిల్ల డివిజన్‌లో 12 దరఖాస్తులు అందగా, వాటిని అధికారులు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేములవాడ డివిజన్ ప్రజావాణిలో 9 దరఖాస్తులు అందగా, ఆర్డీఓ కే.ఎస్.బీ. కుమారి ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు అందజేసి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జెడ్పీ సీఈఓ వెంకట మాధవరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ నితికా పంత్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 12 ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు.

ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.

## కులస్తులను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని వినతి

**సిర్పూర్ శాసనసభ్యులు**

**డా.పాల్వాయి హరీష్ బాబు**

**కాగజ్ నగర్ (వుదయం ప్రతినిధి)**



హైదరాబాద్ నాంపల్లి లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాత్రి భాజపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ఎంపీలతో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నితిన్ నబిన్ ని శాలువాతో సన్మానించి తిరుపతి లడ్డు అందజేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. అనంతరం భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు పలు వినతి పత్రాలను వారికి అందజేయడం జరిగింది. ప్రత్యేకించి ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ మరియు వరంగల్ జిల్లాల్లో నివాసం ఉంటున్న ఆరె కులస్తులను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. సానుకూలంగా స్పందించిన జాతీయ అధ్యక్షులు ఢిల్లీలో త్వరలో ఈ విషయమై సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## 100 శాతం పల్స్ పోలియో పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ జూన్29 (వుదయం ప్రతినిధి):**



ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేసి, నూరు శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని, చుక్కలు తప్పిపోయిన వారిని రెండు రోజుల్లో గుర్తించి చుక్కల మందు వేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు.చిగురు మామిడి మండల కేంద్రంలో ఐదేళ్ల లోపు వయసు గల పిల్లలు ఉన్న ఓ ఇంటిని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సందర్శించారు.ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియోలో పోలియో చుక్కలు వేయించారా లేదా అని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ, ఏఎన్ఎంలతో పల్స్ పోలియో గురించి ఆరా తీశారు. గ్రామంలో ఐదేళ్ల లోపు ఉన్న పిల్లల సంఖ్య, పోలియో చుక్కలు వేసుకున్న వారి శాతం తదితర వివరాలు అడిగారు. సోమ, మంగళవారాల్లో ప్రతి ఇంటిని సందర్శించి పోలియో చుక్కలు వేయని పిల్లలను గుర్తించాలని, వారికి తప్పక చుక్కల మందు వేయాలని ఆదేశించారు. నూరు శాతం ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చుక్కల మందు తీసుకొని వారు ఒక్కరు కూడా ఉండరాదని అన్నారు. వేరే ప్రాంతాలకు ఎవరైనా వెళ్ళినట్లయితే అక్కడ పోలియో చుక్కలు వేసుకున్నారో లేదో కనుక్కోవాలని తెలిపారు. నూరు శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## ప్రజావాణికి 122 ఫిర్యాదులు

**నిజామాబాద్, జూన్ 29 :**



ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 122 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, డీఆర్డీఓ సాయన్నలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. వేసవి సెలవుల అనంతరం విద్యా సంస్థలు తిరిగి ప్రారంభం అయిన నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు, మండల విద్యాధికారులు క్షేత్రస్థాయిలో విధిగా సందర్శిస్తూ సౌకర్యాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ :**



ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం సంబంధిత అధికారుల ప్రాథమిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పథకం, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 68 ఫిర్యాదులు అందాయి. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులతో పాటు డాక్టరేట్ పొందిన కలెక్టరేట్ పరిపాలన అధికారిని జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, డీఆర్ఓ స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి సేవలు చిర స్మరణీయం

**తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల సమాఖ్య**

**రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్**

**ఘనంగా ఉపాధ్యాయుడు చిన్నం ఈశ్వరుడి పదవీ విరమణ సన్మానం**

**ధర్మపురి జూన్29 (వుదయం ప్రతినిధి):**



ఉపాధ్యాయుడు తన ఉద్యోగ జీవితంలో విద్యార్థులను ఉత్త మ పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా సమాజ అభివృద్ధికి బలమైన పునాది వేస్తాడని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యా యుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ పేర్కొ న్నారు.ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుడు చిన్నం ఈశ్వరుడు ఉద్యోగ విరమణ మహోత్సవ కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ము ఖ్య అతిథిగా కటకం రమేష్ హాజరయ్యారు.ఈ సందర్భం గా మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి,విలువల తో కూడిన విద్యను అందించ దానికి విరమణ పొందుతున్న చిన్నం ఈశ్వరుడు చేసిన విశి ష్ట సేవలను కొనియాడారు. పదవీ విరమణ అనేది కేవలం ఉద్యోగానికి మాత్రమేనని, సమాజ సేవకు కాదని ఆయ న స్పష్టం చేశారు. తన సుదీర్ఘ అనుభవాన్ని భవిష్యత్ తరా లకు మార్గదర్శకంగా అందిం చాలని ఈశ్వరుడికి సూచిం చారు. ఇదే సమయంలో ఉపాధ్యాయ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం త్వరలోనే నెరవేరుస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.అనంతరం ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యా యుడు చిన్నం ఈశ్వరుడిని శాలువాతో ఘనంగా సన్మానించి,జ్ఞాపికను అందజేశా రు.ఈ కార్యక్రమంలో పాఠ శాల ప్రధానోపాధ్యాయులు వొడ్నాల శ్రీనివాసరావు, మండల విద్యాధికారి సంధ్యంభట్ల సీతాలక్ష్మి , గ్రామ సర్పంచ్ నలుమాసు పుష్పలత-వైకుంఠం, ఉపాధ్యాయ సమాఖ్య రాష్ట్ర బాధ్యులు గజబీంకార్ గోవర్ధన్, దాసరి భీమయ్య, జిల్లా అధ్యక్షుడు తుంగూరి సురేష్, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాసగౌడ్,మండల అధ్యక్షుడు బండారి సతీష్, ప్రధాన కార్యదర్శి మెరుగు రమేష్, మండల కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్ కుమార్, మండల అధ్యక్షుడు బెజ్జంకి నితిన్, ప్రగతిశీల గుర్తింపు పొందిన ఉపాధ్యా య సంఘం మండల అధ్యక్షుడు పల్లెర్ల వేణుగోపాల్,ప్రజా స్వామ్య ఉపాధ్యాయకూటమి మండల అధ్యక్షుడు రాచకొండ రాజేశం, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయు లు,విద్యార్థులుకుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా మహిళా సంఘాలను మరింత ప్రోత్సహించాలి: జిల్లా కలెక్టర్

**నిర్మల్ జిల్లా 29 జూన్ 2026 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలోని మహిళా సంఘాలకు మరింత ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో జిల్లాలోని మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాల గురించి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో అర్హులైన మహిళలందరినీ స్వయం సంఘాలలో చేర్పించి, స్త్రీ నిధి రుణాలను అందించాలన్నారు. రుణాలను అందించి వారు స్వయం ఉపాధి రంగంలో రాణించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న యూనిట్లను నెలకొల్పే విధంగా చర్యలు చేపట్టాలని వివరించారు. జిల్లా స్వయం సంఘాలు గత కొద్ది సంవత్సరాలుగా రుణాల మంజూరు, తిరిగి చెల్లింపులో అద్భుత ప్రగతి సాధిస్తున్నాయని కొనియాడారు. రుణాల తిరిగి చెల్లింపు విషయంలో డిజిటల్ పద్ధతులు అవలంబించాలని సూచించారు. డిజిటల్ పద్ధతి ద్వారా రుణ చెల్లింపు సులభతరం అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ విజయలక్ష్మి , ఎల్డీఎం రామ్ గోపాల్, శ్రీనిధి ప్రాంతీయ మేనేజర్ అనంత కిషోర్, విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఆరూ వదుల్చుకుంటేనే ఆత్మసాక్షాత్కారం

- **పెద్దగోని జిన్నారం శివకుమార్ గౌడ్....**

**వుదయం న్యూస్ శివ్వంపేట జూన్ 29**



మెదక్ జిల్లా శివంపేట మండల పరిధిలోని పెద్దగోని జిన్నారం రమాదేవి విశ్వకుమార్ గౌడ్ దంపతులు శ్రీశ్రీ విశ్వ యోగి విశ్వంజీ మహారాజ్ దివ్య ఆశీస్సులతో భారతదేశం లోనే లేనివిధంగా శ్రీ గురు పీఠంలో త్రిమూర్తుల అవతారమైన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి ఆలయం. షిరిడి సాయిబాబా ఆలయం. పంచవటి నిర్మించి ప్రతిష్టించిన బాబా గురించి ఆయన మాట్లాడుతూ.శ్రీ సాయి భక్తుల నుంచి ఒక్కోసారి వారి చెడ్డ గుణాలను కూడా దక్షిణగా సమర్పించ మనే వారు. అంటే, అవి వదుల్చుకోదగిన లక్షణాలని చాటడానికే బాబా అలా చేసేవారు.కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాల నేవి అరిషడ్వర్గాలు. వీటికి అతీతంగా మనిషి జీవనం సాగించాలి. కానీ, అన్నీ కాకపోయినా వీటిలో ఒకటి రెండు లేదా అంతకంటే ఎక్కువ లక్షణాలకు మనిషి బానిసై ఉంటాడు. ఇవి కనిపించని శత్రువులు. వీటి బారినపడితే మనిషి జీవితం సర్వ నాశనమవుతుంది.ఒకసారి ఆత్మారామ్ తర్ఖడ్ అనే భక్తుని భార్య బాబా దర్శనానికి వచ్చింది. "తల్లీ! నీలోని ఆరు గుణాలను నాకు దక్షిణగా ఇవ్వు!" అని బాబా ఆమెను అడిగారు. ఆమెకేం అర్థం కాలేదు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ఆరు గుణాలను వదుల్చుకుంటే త్వరగా మోక్షం కలుగుతుంది. కాబట్టి వాటి నుంచి బయటపడి మోక్షం పొందమని బాబా ఆమెకు వివరించి చెప్పారు. అప్పటి నుంచి ఆమె అరిషడ్వర్గాలకు అతీతంగా జీవనం సాగించింది. మనం నడిచే దారి బాగుంటేనే త్వరగా, ఏ చిక్కులూ లేకుండా గమ్యానికి చేరుకోగలం. అదే దారి గతుకులతో, గుంతలతో ఉంటే ప్రయాణం సాఫీగా సాగుతుందా? మన మనసు కూడా అంతే!. కనిపించని శత్రువులు ముళ్లపొదల్లా ఆవరించి ఉంటాయి. మంచి ఆలోచనలు, మంచి నడవడి, సద్బుద్ధి కలగాలంటే ఈ శత్రువులను తుదకంటూ నరికి పారేయాలి. అప్పుడే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. మనిషి పునీతుడవుతాడు. అని వివరించారు.

# సమాచారం దాచారా..?

- **మున్సిపల్ అధికారులపై రాష్ట్ర సమాచార కమిషన్‌లో రెండో అప్పీల్**

**సంగారెడ్డి, వుదయం:**

సమాచార హక్కు చట్టం (RTI) కింద కోరిన వివరాలు ఇవ్వకపోవడంతో సంగారెడ్డి మున్సిపాలిటీ ప్రజా సమాచార అధికారి (మేనేజర్) మరియు మొదటి అప్పిలేట్ అధికారి అయిన మున్సిపల్ కమిషనర్‌పై తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌లో రెండో అప్పీల్ దాఖలు చేసినట్లు సామాజిక కార్యకర్త ఎం. శ్రీధర్ తెలిపారు.ఆయన వివరాల ప్రకారం, మార్చి 30, 2026న బైపాస్ రోడ్డులోని సర్వే నంబర్ 210, లేఅవుట్ నంబర్ 368లోని 80 అడుగుల రోడ్డుపై జరిగిన అక్రమ నిర్మాణంపై విచారణ నివేదిక, తీసుకున్న చర్యల వివరాలు, హెచ్‌ఎండీఏ లేఖ ఆధారంగా సర్వే నంబర్ 403లోని పార్కు స్థలంలో జరుగుతున్న నిర్మాణంపై చేపట్టిన చర్యలు, అలాగే మున్సిపాలిటీ కార్యాలయంలో వినియోగిస్తున్న అద్దె వాహనాల వివరాలు కోరుతూ ఆర్టీఐ దరఖాస్తు సమర్పించారు.అయితే చట్టపరమైన గడువు ముగిసినా ప్రజా సమాచార అధికారి ఎలాంటి సమాచారం అందించలేదని శ్రీధర్ ఆరోపించారు. దీంతో ఏప్రిల్ 30, 2026న మొదటి అప్పీల్‌ను మున్సిపల్ కమిషనర్‌కు సమర్పించినప్పటికీ, దానిపై కూడా విచారణ నిర్వహించకుండా సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో అధికారులు సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘించారని ఆరోపిస్తూ జూన్ 29, 2026న తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌లో రెండో అప్పీల్ పిటిషన్ దాఖలు చేసినట్లు ఎం. శ్రీధర్ వెల్లడించారు.

# వేగవంతమైన పోలీస్ సేవలకు ప్రజావాణి సమర్థ వేదిక

- **జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు**

**గద్వాల, జూన్ 29 (వుదయం బ్యూరో):**



జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి మరొక సమర్థ వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన మొత్తం 15 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు స్వయంగా స్వీకరించి బాధితులతో నేరుగా మాట్లాడారు. ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో తక్షణం సంప్రదించి చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధితులకు ఆలస్యం లేకుండా న్యాయం జరిగేలా పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "ప్రజల నమ్మకం పోలీస్ శాఖకు అత్యంత ముఖ్యమైనది. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 02 గంటల వరకు, మంగళవారం నుంచి శనివారం వరకు అన్ని పని దినాలలో మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయవచ్చు. ఎక్కడైనా న్యాయం జరగలేదని భావిస్తే జిల్లా స్థాయిలో మమ్మల్ని సంప్రదించాలి" అని పేర్కొన్నారు. భూ వివాదాలు, ఆస్తి సమస్యలు, కుటుంబ కలహాలు వంటి అంశాల్లో చట్టపరమైన పరిష్కారమే తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారమయ్యాయో నిరంతరం సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల వివరాలు: కొడుకులు, కూతుర్లు తండ్రిని పట్టించుకోవడ లేదు అని - 01, పొలంలో పత్తి పంట పీకిన విషయంకు సంబంధించి - 01, గొడవలు - 03, ,భూ వివాదాలు సంబంధించి- 6, పొలంలో దౌర్జన్యంగా పైప్ లైన్ వేసిన విషయంకు సంబంధించి - 01, ఇతర సమస్యలు - 03, మొత్తం: 15 ఫిర్యాదులు ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలిపారు.

# ప్రజావాణిలో బ్యాంకర్ల ప్రత్యేక వేదిక

- **అర్హులైన లబ్ధిదారుల నమోదు**

**సిద్దిపేట, జూన్ 29 (వుదయం బ్యూరో):**



గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఒక మంచి పరిణామం చోటుచేసుకుంది. జిల్లా ప్రధాన బ్యాంకు (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి ప్రాంగణంలో ప్రత్యేకంగా బ్యాంకర్ల అవగాహన వేదికను ఏర్పాటు చేశారు. రైతులు, పేదలు మరియు ఆర్థిక అవసరాలు ఉన్న సామాన్య ప్రజలకు వివిధ రకాల వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మరియు ఇతర బ్యాంకింగ్ సేవలపై ఈ వేదిక ద్వారా విస్తృత అవగాహన కల్పించారు. కేవలం అవగాహన కల్పించడమే కాకుండా, పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలను అక్కడికక్కడే నమోదు చేసుకోవడం విశేషం. ఈ ప్రత్యేక కార్యక్రమంలో జిల్లాలోని ప్రముఖ బ్యాంకులు (హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ మరియు బ్యాంక్ ఆఫ్ ఇండియా) భాగస్వాములై తమ సేవలందించాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన బ్యాంకు నిర్వాహకులు (ఎల్.డి.ఎమ్) బి. హరిబాబు మాట్లాడుతూ... రైతు సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా బ్యాంకింగ్ రంగం పనిచేస్తోందని తెలిపారు.రైతులకు, పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరవేయడంలో బ్యాంకులు ఎల్లప్పుడూ ముందుంటాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మా వంతు సంపూర్ణ సహకారం అందిస్తాం అన్నారు. కలెక్టర్ చొరవతో ఏర్పాటు చేసిన ఈ వేదికకు ప్రజావాణికి వచ్చిన అర్జీదారుల నుండి విశేష స్పందన లభించింది.

# సిద్దిపేట ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా జి. సుదర్శన్ బాధ్యతల స్వీకారం

**సిద్దిపేట, జూన్ 29 (వుదయం బ్యూరో)**



సిద్దిపేట జిల్లా నూతన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా శ్రీ జి. సుదర్శన్ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆయన ఎల్.బి. నగర్ (రంగారెడ్డి డిస్ట్రిక్ట్) ఫ్యామిలీ కోర్టు నుండి సిద్దిపేటకు బదిలీపై వచ్చారు. ఈ రోజు ఉదయం కోర్టు ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) సమర్పించారు. అనంతరం ఆయన అధికారికంగా బాధ్యతలను చేపట్టారు.

**నూతన జడ్జికి ఘన స్వాగతం**

బాధ్యతలు స్వీకరించిన నూతన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీ జి. సుదర్శన్ ని జిల్లాకు చెందిన పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు మరియు అధికారులు కలిసి సాదరంగా ఆహ్వానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనను కలిసిన వారిలో:

* శ్రీ వై. జయ ప్రసాద్ (1అడిషనల్ డిస్ట్రిక్ట్ & సెషన్స్ జడ్జి, సిద్దిపేట)
* శ్రీ ఎన్. సంతోష్ కుమార్ (ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి అండ్ FAC: సెక్రటరీ, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, సిద్దిపేట)
* శ్రీ ఎ. కుమార స్వామి (అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, సిద్దిపేట)
* శ్రీమతి బి. సాధన (ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, సిద్దిపేట)
* కుమారి వి. తరణి (అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, సిద్దిపేట)
* శ్రీమతి కె. సౌజన్య (IIఅడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, సిద్దిపేట) ఉన్నారు.

వీరితో పాటు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ రమేష్ బాబు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, గవర్నమెంట్ ప్లీడర్లు, జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది మరియు న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది నూతన జడ్జి గారికి ఘనంగా స్వాగతం పలికారు.

# రైతులకు సేవ చేయడం లో ముందున్న అధికారి రాజారత్నం

**వికారాబాద్ జూన్ 29 (వుదయం బ్యూరో)**





తాను ఎక్కడ ఉన్నా... ఏ ప్రాంతంలో ఉన్న.... ఎన్ని అడ్డంకులు ఎదురైనా... వెనకంజ వేయకుండా... రైతు అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషిచేసిన అధికారి ఇతను.. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి పదవి విరమణ వరకు... రైతులకు వెనువెంటే ఉండి మంచి సూచనలు సలహాలతో పాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయం ఎలా చేయాలో రైతులకు నేర్పించిన అధికారి రాజారత్నం.. ఆయనే వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి. గత 33 ఏళ్ల క్రితం వ్యవసాయ అధికారిగా బాధ్యతలు తీసుకున్న రాజరత్నం రైతుల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేశారు. రైతులకు సాంకేతిక పద్ధతులు వివరిస్తూ వ్యవసాయం ఎలా చేయాలో వ్యవసాయంలో ఉన్న మెలకువలను సూచిస్తూ రైతులు అధిక దిగుబడి సాధించడంలో తన వంతు కృషి చేశారు రాజరత్నం.1993లో మండల వ్యవసాయ విస్తీర్ణాధికారిగా నియమితులైన రాజరత్నం నేడు జిల్లా వ్యవసాయ అధికారిగా పదవి విరమణ చేయనున్నారు.1996లో కర్నూలు జిల్లా యమ్మనంకూరు మండల వ్యవసాయాధికారిగా , 1996 నుంచి 1999 వరకు వ్యవసాయ అధికారిగా అక్కడే పని చేశారు.1999 నుంచి 2004 వరకు పూడూరు మండల వ్యవసాయ అధికారిగా పని చేశారు. పూడూరు మండలంలో పనిచేసిన రాజరత్నం ప్రతి మనిషిని పేరుపేరునా పిలుస్తూ ప్రతి రైతుకు మెరుగైన సేవలు అందించారు. అక్కడ నుంచి ఏవో టెక్నికల్ అధికారిగా జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించారు. ఏడీఏగా పదోన్నతి పొంది షాద్నగర్ లో పని చేశారు.2009 నుంచి 2012 వరకు విధులు నిర్వహించారు. అక్కడి నుంచి కమిషన్ కార్యాలయానికి వెళ్లిన ఆయన తిరిగి షాద్నగర్ ఏడిఏ గా 2018లో పనిచేశారు. కొన్ని రోజులు డిడిఏ గా నారాయణపేట జిల్లాలో పనిచేసిన ఆయన 2025 లో జిల్లా వ్యవసాయ అధికారిగా పదోన్నతి పొంది వికారాబాద్ కు వచ్చారు. ఎక్కడ ఏ ప్రాంతంలో పనిచేసిన ఆ ప్రాంత రైతులకు వ్యవసాయం సాగుబడిలో మెలకువలు నేర్పుతూ తాము పండించిన పంటలు ఉత్తమ దిగుబడులు వచ్చే విధంగా సూచన సలాలిస్తూ ముందుకు సాగారు. 1994లో ఉత్తమ విస్తరణ అధికారిగా, 2003లో ఉత్తమ మండల వ్యవసాయాధికారిగా, 2024 లో ఉత్తమ ఏడిఏ గా, 2026లో ఉత్తమ జిల్లా వ్యవసాయాధికారిగా ప్రభుత్వం చే ప్రశంసలు పొందారు. ఉన్నతాధికారుల సూచన సలహాల మేరకు ప్రజా ప్రతినిధుల సహకారంతో రైతులకు సేవ చేయడంలో రాజరత్నం ముందంజలో ఉన్నాడు.2015లో సీడ్స్ క్వాలిటీ పై హైదరాబాద్లో ట్రైనింగ్ తీసుకున్నారు. రీజినల్ అగ్రికల్చర్ బయోమెట్రిక్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. న్యూఢిల్లీలో ఏర్పాటుచేసిన విత్తన చట్టంపై కూడా ట్రైనింగ్ తీసుకున్నారు.2021లో బహుజన సాహితి అకాడమీ తిరుపతి వారు రాజరత్నకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డును అందజేశారు.

**రైతులకు సేవ చేయడం లో సంతోషం ఉంది... రాజారత్నం జిల్లా వ్యవసాయ అధికారి**

రైతుకు సేవ చేయడంలో ఉన్న సంతోషం మరి ఎక్కడ లేదు. తాను ఏ మండలంలో ఏ జిల్లాలో పనిచేసిన అక్కడి రైతుల పరిస్థితుల కనుగుణంగా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహాలను రైతులకు వివరిస్తూ ఉన్నతాధికారుల సూచన సలహాలను రైతులకు వివరిస్తూ సాంకేతికపరంగా వ్యవసాయం ఎలా చేయాలో సూచించాను. ప్రజా ప్రతినిధుల సహకారం ఉన్నత అధికారుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగాను.





# రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

- **ఏఐయుకేఎస్ మండల అధ్యక్షుడు బి నారాయణ**

**నారాయణపేట జూన్ 29 (వుదయం ప్రతినిధి)**

అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) నారాయణపేట మండల కమిటీ ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నారాయణపేట తహసిల్దార్ కార్యాలయం డిప్యూటీ తాసిల్దార్ రామకృష్ణకి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) మండల అధ్యక్షులు బి నారాయణ, ప్రధాన కార్యదర్శి ఏ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాల పంటల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న విత్తనాల కొరత, నకిలీ విత్తనాలు, ఎరువుల కొరత, పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు, పెరుగుతున్న పెట్టుబడి భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, యూరియాను యాప్ ద్వారా బుక్ చేసుకునే విధానాన్ని రద్దు చేసి రైతాంగానికి అవసరమైనంత యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఎరువుల ధరలను నియంత్రించి రైతులకు అందుబాటు ధరల్లో సరఫరా చేయాలని కోరారు. రైతులు పండించిన అన్ని రకాల వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, కొనుగోళ్లపై పరిమితులు విధించవద్దని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించించారు. ఈ సమావేశంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు హాజీ మలన్, లక్ష్మప్ప, సవడం సుధాకర్ , కాశీనాథ్, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతలో రాజీ లేకుండా గడువులోగా పనులు పూర్తి చేయాలి

- **ప్రభుత్వం ఆమోదించిన నమూనా ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు ఆదేశం**
- **జట్రపోల్‌లో తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ జూన్ 29 (వుదయం బ్యూరో):**



జిల్లా లోని కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జట్రపోల్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్ఠాత్మక తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న ఈ విద్యాసంస్థ పనుల పురోగతిని కలెక్టర్ స్వయంగా పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల అమలులో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జాప్యానికి తావు లేకుండా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిర్ణయించిన లక్ష్యాల ప్రకారం పనులను ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి పూర్తిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల భవనంలోని తరగతి గదులు, పరిపాలనా విభాగం, బాలురు, బాలికల వసతి గృహాలు, డైనింగ్ హాల్, వంటశాల, ప్రయోగశాలలు, గ్రంథాలయం, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, అంతర్గత రహదారులు, ప్రహరీ గోడ తదితర నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం ఆమోదించిన మ్యాప్‌కు అనుగుణంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయా లేదా అనే అంశాన్ని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి అవసరమైన సాంకేతిక సూచనలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నాణ్యతను పెంపొందించేందుకు తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా అత్యాధునిక విద్యా, వసతి, క్రీడా సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందించాలనే లక్ష్యంతో ఈ విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు, నిర్మాణ పనులు ప్రభుత్వం ఆమోదించిన నమూనా ప్రకారం, ఇంజినీరింగ్ ప్రమాణాలను పూర్తిగా పాటిస్తూ చేపట్టాలని స్పష్టం చేశారు.నాణ్యత విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని, నిర్మాణంలో ఉపయోగించే ప్రతి నిర్మాణ సామగ్రి నాణ్యమైనదిగా ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తిగా ఈ పాఠశాల భవనం నిలవాలంటే ప్రతి పనిని అత్యంత బాధ్యతతో పూర్తి చేయాలని సూచించారు.నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ పనుల పురోగతిని వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత, సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, సంబంధిత శాఖల అధికారులు, ఇడబ్ల్యుఐడీసీ ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను పూరించి ఇస్తేనే ఎలక్ట్రోరోల్ ఓటరుగా పేరు నమోదు

- **తహసిల్దారులు తమ విధులను నిబద్ధతతో నిర్వహించాలి**

**గద్వాల జూన్ 29 (వుదయం కరస్పాండెంట్)**



ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను పూరించి ఇస్తేనే ఎలక్ట్రోరోల్లో ఓటరుగా వారి పేరు ఉంటుందని ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్ఐఆర్ పై హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో కలిసి వీసీలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ఎన్నుమరేషన్ ఫామ్స్ ను బీఎల్‌వోలే స్వయంగా అందజేయాలని స్పష్టం చేశారు. ఇతర వ్యక్తులకు బాధ్యతలు అప్పగించడం, వారి ద్వారా సర్వే చేయించడం తీవ్ర నిర్లక్ష్యంగా పరిగణిస్తామని, అటువంటి ఘటనలపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సూపర్‌వైజర్లు క్రమం తప్పకుండా తమ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తూ బీఎల్‌వోల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్లకు సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన 1950 ఓటర్ హెల్ప్‌లైన్, కలెక్టరేట్, ఈఆర్వో కార్యాలయాల్లోని హెల్ప్‌డెస్క్‌ల వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదురైతే ప్రజలు ఈ సేవలను వినియోగించు కోవాలని సూచించారు. బీఎల్‌వోలు విధుల నిర్వహణలో ఎన్నికల సంఘం అందజేసిన టీషర్ట్, క్యాప్, ఐడీ కార్డు, బ్యాగ్ తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు. దీంతో ప్రజలు అధికారులను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలతో మర్యాదగా, సహనంతో వ్యవహరించాలని బీఎల్‌వోలకు సూచించారు.

ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటరు అవగాహన కార్యక్రమాలు, అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలు, ప్రత్యేక కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా విస్తృతంగా ప్రచారం చేయాలని ఈ సందర్భంగా సీఈఓ సూచించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ఎంతో ప్రాధాన్యత ఉన్నందున ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రతి బుధవారం బిఎల్ఎలతో బిఎల్ఓలు సమావేశాలు నిర్వహించుకుని సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జిల్లా వెనుకబడిందని, ప్రధానంగా మున్సిపాలిటీ పరిధిలో వేగవంతం కావాలని ఆదేశించారు. తహసీల్దార్లు తమ మండలాల్లో చిత్తశుద్ధితో పనిచేయాలని, చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించక పోవడంతో ప్రజలు కలెక్టరేట్ కు రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ స్కీమ్ ను అర్హులైన కుటుంబాలు సద్వినియోగం చేసుకునేలా సహకరించాలన్నారు. పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా తరచూ రేషన్ దుకాణాలను పర్యవేక్షించాలన్నారు. టాస్క్ ఫోర్స్ సభ్యులతో కలిసి ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాలపై నిఘా ఉంచాలన్నారు. గ్రామాల రీసర్వే కు అవసరమైన లైసెన్స్ సర్వేయర్లను గుర్తించి ముందుకెళ్లాలన్నారు. ఆయా మండలాల డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్లాన్ తయారుచేసి అందజేయాల్సిందిగా పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే తహసీల్దారులపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, ఆయా మండలాల తహసిల్దారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్‌వోలే స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలి

- **బీఎల్‌వోలు అందజేసిన ఫారాలను పూర్తి చేసి తిరిగి ఇవ్వాలి**
- **ఎన్యూమరేషన్ ఫారాలు పూరించి సమర్పిస్తేనే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు నమోదు.....**
- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**సంగారెడ్డి, జూన్ 29:-వుదయం.**



ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను ప్రతి ఓటరు పూర్తిగా నింపి తిరిగి సమర్పిస్తేనే వారి పేరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతి, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.బీఎల్‌వోలే స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, ఈ బాధ్యతలను ఇతరులకు అప్పగించడం లేదా వారి ద్వారా సర్వే నిర్వహించడం అనుమతించబోదని స్పష్టం చేశారు. సూపర్‌వైజర్లు తమ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో నిరంతరం పర్యటిస్తూ బీఎల్‌వోల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు.ఓటర్లకు సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన 1950 ఓటర్ హెల్ప్‌లైన్, కలెక్టరేట్, ఈఆర్వో కార్యాలయాల్లోని హెల్ప్‌డెస్క్‌ల వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.

ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదురైతే ప్రజలు హెల్ప్‌లైన్, హెల్ప్‌డెస్క్‌ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 55 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందన్నారు. జిల్లాలో వంద శాతం ఫారాలు పంపిణీ చేసి, పూర్తిగా నింపిన ఫారాలను సేకరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఓటరు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడంతో పాటు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నామని చెప్పారు.

ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో ప్రజలకు అవసరమైన సహాయం అందించేలా బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీఓలు రాజేందర్, రమేష్, వెంకటేశం, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## డయాబెటిస్ ఉన్నవారు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు ఇవే..

మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవాలంటే కేవలం ఏం తింటున్నామనేదే కాదు, ఎప్పుడు తింటున్నామన్నది కూడా అంతే ముఖ్యమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. భోజనం చేసే సమయం రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. శరీరం సహజ జీవ గడియారం (సర్కేడియన్ రిథమ్) ప్రకారం పనిచేస్తుంది. దానికి అనుగుణంగా భోజన సమయాలను పాటిస్తే భోజనం తర్వాత చక్కెర ఒక్కసారిగా పెరగకుండా ఉండటమే కాకుండా, దీర్ఘకాలికంగా హెచ్‌బీఏ1సీ స్థాయిలు కూడా మెరుగుపడే అవకాశం ఉంటుంది. మధుమేహం నియంత్రణలో లేకపోతే గుండె జబ్బులు, మూత్రపిండాల సమస్యలు, నరాలు దెబ్బతినడం, కంటి చూపు దెబ్బతినడం వంటి తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే సమతుల ఆహారంతోపాటు సరైన భోజన సమయాలను పాటించడం కూడా చికిత్సలో కీలక భాగంగా పరిగణిస్తారు. పీచుపదార్థాలు అధికంగా ఉండే తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు రక్తంలో చక్కెర నెమ్మదిగా శోషణకు గురయ్యేలా చేస్తాయి. అలాగే గింజలు, నట్స్, అవకాడో వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండాలంటే ప్రతిరోజూ ఒకే సమయానికి భోజనం చేయడం అలవాటు చేసుకోవాలి. భోజనాల మధ్య ఎక్కువ విరామం ఉంటే తీవ్రమైన ఆకలి వేయడంతో ఒకేసారి ఎక్కువగా తినే అవకాశం ఉంటుంది. దీనివల్ల రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరుగుతుంది. అదే తరచూ తినడం వల్ల కూడా గ్లూకోజ్ స్థాయిలు నిరంతరం ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంటుంది. మధుమేహం ఉన్నవారు రోజుకు మూడు ప్రధాన భోజనాలను నాలుగు నుంచి ఐదు గంటల వ్యవధిలో తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. రెండు భోజనాల మధ్య ఎక్కువ గ్యాప్ ఉంటే ఆరోగ్యకరమైన చిరుతిండిని తీసుకోవచ్చు. ముఖ్యంగా రక్తంలో చక్కెరను తగ్గించే మందులు లేదా ఇన్సులిన్ తీసుకునేవారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. ఉదయం నిద్రలేచిన గంటలోపు అల్పాహారం తీసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల జీవక్రియలు చురుకుగా ప్రారంభమవుతాయి. అలాగే ఇన్సులిన్ నిరోధకత తగ్గేందుకు సహాయపడుతుంది. అల్పాహారాన్ని ఆలస్యం చేసే కొద్దీ ఉపవాస రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. మధ్యాహ్న భోజనాన్ని సరైన సమయంలో తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి అందుతుంది. మధ్యాహ్నం అలసట తగ్గడంతోపాటు సాయంత్రం అతిగా తినే అలవాటు కూడా తగ్గుతుంది. రాత్రి భోజనాన్ని తేలికగా, నిద్రపోయే సమయానికి కనీసం రెండు నుంచి మూడు గంటల ముందే ముగించడం వల్ల రాత్రిపూట రక్తంలో చక్కెర నియంత్రణ మెరుగుపడుతుంది. భోజనం చేసిన వెంటనే కూర్చోవడం లేదా పడుకోవడం కంటే 10 నుంచి 15 నిమిషాల పాటు తేలికగా నడవడం మంచిది. ఇలా చేయడం వల్ల భోజనం తర్వాత చక్కెర ఒక్కసారిగా పెరగకుండా నియంత్రించవచ్చు. అలాగే భోజనంలో ముందుగా కూరగాయలు, ప్రోటీన్ ఆహారం తీసుకుని చివర్లో కార్బోహైడ్రేట్లు తినడం వల్ల గ్లూకోజ్ శోషణ నెమ్మదిగా జరిగి రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. ఇన్సులిన్ లేదా రక్తంలో చక్కెరను తగ్గించే మందులు వాడుతున్నవారు తప్పనిసరిగా మందుల సమయాలకు అనుగుణంగా భోజనం చేయాలి. లేకపోతే రక్తంలో చక్కెర ప్రమాదకరంగా తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, జీవనశైలి, రక్తంలో చక్కెర స్పందన భిన్నంగా ఉంటాయి కనుక వైద్యులు లేదా డైటీషియన్ సూచనల మేరకు వ్యక్తిగత ఆహార ప్రణాళికను రూపొందించుకోవడం ఉత్తమ మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.



## చర్మంపై ఈ లక్షణాలు, సంకేతాలు కనిపిస్తే జాగ్రత్త..

గుండె జబ్బులు అంటే చాలామందికి ఛాతినొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గుండె దడ వంటి లక్షణాలే గుర్తుకు వస్తాయి. అయితే కొన్ని సందర్భాల్లో గుండె ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు చర్మంపై కనిపించే మార్పుల రూపంలోనూ సంకేతాలు ఇస్తాయి. ఇవి గుండె జబ్బులను నిర్ధారించే లక్షణాలు కాకపోయినా, శరీరంలో రక్తప్రసరణ, కొలెస్ట్రాల్, ఆక్సిజన్ సరఫరా లేదా ఇతర జీవక్రియల్లో లోపాలు ఉన్నట్లు సూచించే హెచ్చరికలుగా పరిగణించవచ్చు. అందువల్ల ఇలాంటి మార్పులను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. చర్మంపై, ముఖ్యంగా కనురెప్పలు, మోచేతులు, మోకాళ్లు లేదా ఇతర భాగాల్లో పసుపు రంగులో చిన్న కొవ్వు గడ్డలు కనిపిస్తే వాటిని జాంతోమాస్ అంటారు. ఇవి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉన్నట్లు సూచిస్తాయి. అధిక కొలెస్ట్రాల్ కారణంగా రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతాయి. చర్మం కింద మైనంలా కనిపించే చిన్న గడ్డలు కూడా కొవ్వు జీవక్రియలో లోపాలకు సంకేతంగా ఉంటాయి. పెదవులు, వేళ్లు లేదా కాలి వేళ్లు నీలం రంగులోకి మారడం కూడా గుండె సమస్యలకు సంబంధించిన హెచ్చరికగా భావించాలి. దీనిని సయానోసిస్ అంటారు. రక్తంలో తగినంత ఆక్సిజన్ లేకపోవడం లేదా గుండె సమర్థంగా రక్తాన్ని పంప్ చేయలేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా ఈ లక్షణంతోపాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. పాదాలు, చీలమండలు లేదా కింది కాళ్లలో వాపు రావడం కూడా గుండె పనితీరు బలహీనపడినట్లు సూచించే అవకాశం ఉంటుంది. దీనిని పెరిఫెరల్ ఎడిమా అంటారు. శరీర కణజాలాల్లో అదనపు ద్రవం పేరుకుపోవడం వల్ల ఈ వాపు ఏర్పడుతుంది. చర్మం బిగుసుకుపోయినట్లు, మెరిసేలా కనిపిస్తుంది. ముఖ్యంగా గుండె వైఫల్యం ఉన్నవారిలో ఈ లక్షణం ఎక్కువగా కనిపించే అవకాశం ఉంటుంది. వాపు తగ్గకుండా కొనసాగితే నిర్లక్ష్యం చేయకూడదు. మెడ, చంకలు లేదా తొడల మడతల్లో నలుపు రంగులో మందంగా, వెల్వెట్‌లా కనిపించే చర్మాన్ని అకాంథోసిస్ నైగ్రికన్స్ అంటారు. ఇది సాధారణంగా ఇన్సులిన్ నిరోధకతకు సంకేతం. ఇలాంటి పరిస్థితి మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. మధుమేహం గుండె జబ్బులకు ప్రధాన ప్రమాద కారకాలలో ఒకటి. కాబట్టి ఈ లక్షణాలు కనిపిస్తే రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకోవడం అవసరం. కాళ్లపై వెంట్రుకలు తగ్గిపోవడం కూడా కొన్ని సందర్భాల్లో రక్తప్రసరణ సరిగా లేకపోవడానికి సంకేతం అవుతుంది. పెరిఫెరల్ ఆర్టరీ డిసీజ్ (PAD) అనే వ్యాధిలో కాళ్లకు రక్తప్రసరణ తగ్గిపోవడం వల్ల చర్మం పలుచబడటం, గాయాలు ఆలస్యంగా మానడం, వెంట్రుకలు రాలిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధికి గుండె జబ్బులతో కూడా సంబంధం ఉండే అవకాశం ఉంటుంది.




## ఏసీలో ఎక్కువసేపు ఉంటే..

ఇటీవల కాలంలో ఇళ్లు, కార్యాలయాలు, వాహనాల్లో ఎయిర్ కండిషనర్ (ఏసీ) వినియోగం బాగా పెరిగింది. అయితే, ఎక్కువ సమయం ఏసీ గదుల్లో గడిపితే ఎముకలు బలహీనపడతాయా? కీళ్ల నొప్పులు లేదా ఆర్థరైటిస్ వచ్చే ప్రమాదం ఉందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఏసీ నుంచి వచ్చే చల్లని గాలి ఎముకలను నేరుగా బలహీనపరచదు. అయితే, రోజంతా ఏసీ గదుల్లోనే ఉండడం వల్ల కొన్ని పరోక్ష ప్రభావాలు ఎముకల ఆరోగ్యంపై పడే అవకాశం ఉంది. ఎముకల దృఢత్వం ప్రధానంగా కాల్షియం, విటమిన్–డి, సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా చేసే వ్యాయామంపై ఆధారపడి ఉంటుంది. ఎక్కువ సమయం ఇంట్లో లేదా కార్యాలయంలో ఏసీలో గడిపేవారికి సూర్యరశ్మి తక్కువగా తగులుతుంది. దీంతో శరీరంలో విటమిన్–డి లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. విటమిన్–డి ఎముకలకు అవసరమైన కాల్షియంను శరీరం గ్రహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీర్ఘకాలం విటమిన్–డి లోపం ఉంటే ఎముకలు బలహీనపడటంతో పాటు ఆస్టియోపొరోసిస్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఏసీ వాడకం వల్ల నేరుగా కీళ్లవాతం (ఆర్థరైటిస్) రాదు. అయితే ఇప్పటికే కీళ్ల నొప్పులు, ఆస్టియో ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి చల్లటి వాతావరణం కారణంగా నొప్పి, బిగుతు ఎక్కువగా అనిపించవచ్చు. రోజూ కనీసం 10 నుంచి 15 నిమిషాల పాటు సూర్యరశ్మిలో గడపండి. కాల్షియం, విటమిన్–డి అధికంగా ఉండే ఆహారాలను తీసుకోండి. పాలు, పెరుగు, జున్ను వంటి పాల ఉత్పత్తులను ఆహారంలో చేర్చుకోండి. రోజూ నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయండి. ఏసీ ఉష్ణోగ్రతను 24 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉంచడం మంచిది. ఏసీ వాడటం వల్ల ఎముకలు నేరుగా బలహీనపడవు. అయితే సూర్యరశ్మి లోపం, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలు ఎముకల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే సరైన ఆహారం, వ్యాయామం, తగినంత సూర్యరశ్మి తీసుకోవడం చాలా ముఖ్యం.



## కాపర్‌ను తరచూ తీసుకుంటే మెదడు ఆరోగ్యం పదిలం..

మెదడు ఆరోగ్యాన్ని కాపాడడంలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా శరీరానికి అవసరమైన సూక్ష్మ ఖనిజాల్లో ఒకటైన కాపర్ (రాగి) మెదడు పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుందని ఇప్పటికే తెలిసిన విషయమే. తాజాగా వెలువడిన ఓ ప్రయోగాత్మక అధ్యయనం ప్రకారం, నియంత్రిత మోతాదులో కాపర్‌ను ఉపయోగించడం వల్ల మెదడులో పేరుకుపోయే హానికరమైన ప్రోటీన్లను తగ్గించే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే ఈ పరిశోధన ఇంకా ప్రారంభ దశలోనే ఉందని, దీనిని ప్రస్తుతం చికిత్సగా పరిగణించరాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అల్జీమర్స్ వంటి నాడీ సంబంధిత వ్యాధుల్లో మెదడులో విషపూరిత ప్రోటీన్లు పేరుకుపోవడం ప్రధాన కారణంగా భావిస్తారు. ఈ ప్రోటీన్లు మెదడు కణాల మధ్య సమాచార మార్పిడిని దెబ్బతీసి జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. తాజా ప్రయోగశాల అధ్యయనంలో నియంత్రిత మోతాదులో కాపర్ ఇవ్వడం వల్ల మెదడు కణాల మధ్య సమాచార ప్రసారం మెరుగుపడటంతో పాటు హానికరమైన ప్రోటీన్ల ప్రభావం తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు. కాపర్ శరీరానికి చాలా తక్కువ మోతాదులో అవసరమయ్యే సూక్ష్మ ఖనిజం. ఇది మెదడులో న్యూరోట్రాన్స్‌మిటర్ల పనితీరును మెరుగుపరచడం, వివిధ ఎంజైమ్‌ల కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం, ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడం వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తుంది. అలాగే మెదడు కణాలను రక్షించే న్యూరోప్రొటెక్టివ్ పాత్ర కూడా పోషిస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే శరీరంలో కాపర్ మోతాదు సమతుల్యంగా ఉండటం చాలా ముఖ్యం. కాపర్ ఎక్కువైనా, తక్కువైనా మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. కాపర్ అసమతుల్యత వల్ల ఆక్సిడేటివ్ ఒత్తిడి పెరిగి మెదడు కణాలు దెబ్బతినడం, న్యూరో ఇన్‌ఫ్లమేషన్ పెరగడం, కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసే మైటోకాండ్రియా పనితీరు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవన్నీ జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యాన్ని ప్రభావితం చేసే ప్రమాదం ఉంటుంది. మెదడులోని ప్రోటీన్లు సాధారణంగా నాడీ వ్యవస్థ పనితీరుకు అవసరమైనవే. కానీ బీటా–అమిలాయిడ్, టావు వంటి కొన్ని ప్రోటీన్లు అసాధారణంగా పేరుకుపోతే అవి విషపూరితంగా మారి మెదడు కణాల మధ్య సమాచార మార్పిడిని అడ్డుకుంటాయి. అల్జీమర్స్ వ్యాధిలో ఈ ప్రోటీన్లు పేరుకుపోవడాన్ని ప్రధాన లక్షణంగా గుర్తించారు. తాజా పరిశోధనలు కాపర్ థెరపీ ద్వారా ఈ ప్రక్రియను కొంతవరకు నియంత్రించే అవకాశాన్ని పరిశీలిస్తున్నాయి. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధారాలు ప్రయోగశాలల్లో జంతువులపై నిర్వహించిన అధ్యయనాలకే పరిమితమయ్యాయి. మానవుల్లో ఇదే ఫలితాలు వస్తాయో లేదో నిర్ధారించడానికి మరిన్ని క్లినికల్ అధ్యయనాలు అవసరమని పరిశోధకులు చెబుతున్నారు.



## శరీరంలోని వేడిని తగ్గించడంలో కీరదోస, పుచ్చకాయ..

కీరదోస కాయలో సుమారు 95 శాతం వరకు నీరు ఉంటుంది. అందువల్ల ఇది శరీరానికి క్రమంగా నీటిని అందించడంలో సహాయపడుతుంది. అలాగే పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల శరీరంలోని వేడిని తగ్గించడంతో పాటు జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తుంది. తక్కువ కేలరీలు ఉండటం వల్ల వేసవిలో రోజువారీ ఆహారంలో కీరదోసకాయను చేర్చడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పుచ్చకాయలో 92 శాతం వరకు నీరు ఉంటుంది. ఇందులో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు, లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటాయి. ఇవి శరీరానికి త్వరగా నీటిని అందించడమే కాకుండా వేడి కారణంగా తగ్గిన శక్తిని తిరిగి అందించడంలో, ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అయితే పుచ్చకాయను భోజనం చేసిన వెంటనే తినకూడదని, పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కీరదోసకాయ, పుచ్చకాయ రెండూ శరీరాన్ని చల్లబరచడంలో ఉపయోగపడినా వాటి ప్రయోజనాలు కొంత భిన్నంగా ఉంటాయి. కీరదోసకాయలో నీటి శాతం ఎక్కు వగా ఉండి శరీరానికి నెమ్మదిగా హైడ్రేషన్ అంది స్తుంది. పుచ్చకాయ మాత్రం సహజ చక్కెరల కారణంగా త్వరగా శక్తిని, నీటిని అందిస్తుంది. అలాగే పుచ్చకాయలో ఎలక్ట్రోలైట్లు కొంత ఎక్కువగా ఉండగా, కీరదోసకాయ తక్కువ కేలరీలతో ఎక్కువసేపు చల్లదనాన్ని అందిస్తుంది. హీట్ స్ట్రెస్‌ను తగ్గించడంలో ఏది మంచిదన్నది వ్యక్తిగత అవసరాలపై ఆధారపడి ఉంటుంది. శరీరానికి దీర్ఘకాలం చల్లదనం, తక్కువ కేలరీలతో హైడ్రేషన్ కావాలనుకునేవారికి కీరదోసకాయ మంచి ఎంపిక. త్వరగా నీరు, శక్తి అందించాలంటే పుచ్చకాయ ఉపయోగపడుతుంది. రెండింటినీ సమతుల్యంగా తీసుకోవడం వల్ల మరింత ప్రయోజనం ఉంటుంది. వేసవిలో కీరదోసకాయను సలాడ్ రూపంలో లేదా నీటిలో ముక్కలు వేసి ఇన్‌ఫ్యూజ్డ్ వాటర్‌గా తీసుకోవచ్చు. పుచ్చకాయను మధ్యాహ్నం సమయంలో చిరుతిండిగా తినడం మంచిది. ప్యాకెట్ జ్యూస్‌లకు బదులుగా తాజా పండ్లనే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అయితే ప్రతి ఒక్కరూ వీటిని ఒకే విధంగా తీసుకోవడం సరైంది కాదు. మధుమేహం ఉన్నవారు పుచ్చకాయను పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలి. అలాగే మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు పొటాషియం మోతాదును దృష్టిలో పెట్టుకుని పుచ్చకాయ వినియోగాన్ని నియంత్రించాలి. ఇక వేసవిలో హీట్ స్ట్రెస్ నుంచి రక్షణ పొందాలంటే కీరదోసకాయ, పుచ్చకాయ రెండింటినీ సమతుల్యంగా ఆహారంలో చేర్చడం మంచిది. వీటితోపాటు తగినంత నీరు తాగడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగకుండా ఉండటం, శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను కాపాడుకోవడం ద్వారా వేసవి ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.



## చిగుళ్ల వాపు, రక్తస్రావం సమస్యలకు అసలు కారణం ఏంటి..

చిగుళ్ల వాపు, బ్రష్ చేస్తున్నప్పుడు రక్తం రావడం వంటి సమస్యలను చాలా మంది సాధారణ దంత సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే ఇవి కేవలం నోటి ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు మాత్రమే కాకుండా, శరీరంలో విటమిన్ సి లోపానికి కూడా సంకేతాలు అవుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శరీరంలో విటమిన్ సి తగినంతగా లేకపోతే చిగుళ్లు బలహీనపడటంతోపాటు వాపు, నొప్పి, రక్తస్రావం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని అంటున్నారు. విటమిన్ సి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తికి అత్యంత కీలకమైన పోషకం. కొల్లాజెన్ చిగుళ్లతోపాటు చర్మం, ఎముకలు, కణజాలాలను బలంగా ఉంచే ప్రధాన ప్రోటీన్. విటమిన్ సి లోపం ఏర్పడితే చిగుళ్ల నిర్మాణం బలహీనపడుతుంది. ఫలితంగా అవి సులభంగా వాపు రావడం, బ్రష్ చేసే సమయంలో లేదా గట్టిగా నమిలినప్పుడు రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే చిగుళ్ల సమస్యలకు విటమిన్ సి లోపం ఒక్కటే కారణం కాకపోయినా, దీన్ని ప్రధాన కారణాల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఈ సమస్యలను తగ్గించుకోవడానికి విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను రోజువారీ ఆహారంలో చేర్చాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా నారింజ, జామ, మోసంబి వంటి పండ్లు విటమిన్ సికి మంచి మూలాలు. వీటిని తరచూ తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన విటమిన్ సి లభిస్తుంది. రోజును నిమ్మరసం కలిపిన గోరువెచ్చని నీరు లేదా తాజాగా తీసిన నారింజ రసంతో ప్రారంభించడం కూడా మంచి అలవాటు. సిట్రస్ పండ్లను తరచూ తీసుకోవడం వల్ల రోజువారీ విటమిన్ సి అవసరాన్ని తీర్చుకోవచ్చు. ఎరుపు, పసుపు రంగు క్యాప్సికమ్‌లలో కూడా విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. వీటిని సలాడ్లలో కలిపి లేదా తేలికపాటి చిరుతిండిగా తీసుకోవచ్చు. అలాగే ఉదయపు అల్పాహారంలో పెరుగు లేదా సిరియల్‌లో స్ట్రాబెర్రీ, బ్లాక్‌కరెంట్, బొప్పాయి, జామ, కివీ వంటి పండ్లు కలిపి తీసుకుంటే శరీరానికి మంచి మోతాదులో విటమిన్ సి అందుతుంది. పాలకూర, కేల్, బోక్ చోయ్ వంటి ఆకుకూరలు కూడా విటమిన్ సికి మంచి వనరులు. వీటిని సలాడ్లు, స్మూతీలు లేదా ఇతర వంటకాల రూపంలో ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా విటమిన్ సి లోపాన్ని తగ్గించుకోవడంతోపాటు చిగుళ్ల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరచుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.



## జొన్నలతో మేలెంతో..!

జొన్నల తో చేసిన వంటకాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యపరంగా అనేక ప్రయోజనాలున్నాయంటున్నారు నిపుణులు.

జొన్నల్లో గ్లూటెన్ ఉండదు. కాబట్టి ఇది మంచి ఆహారం. ఫైబర్ పుష్కలంగా ఉండే జొన్నలు జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయంటున్నారు నిపుణులు. ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల రక్తంలోని చక్కెర స్థాయులను నియంత్రించడంలోనూ తోడ్పడతాయని చెబుతున్నారు. ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే జొన్నల్ని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎక్కువసేపు పొట్ట నిండుగా ఉండేలా చూసుకోవచ్చు. బరువు అదుపు చేసుకోవడానికి ఇదీ ఓ మార్గమే! వివిధ పోషకాలు పుష్కలంగా ఉండే జొన్నలు ఎముకల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు నిపుణులు. రక్తనాళాల్లో మంచి కొలెస్ట్రాల్ స్థాయులను పెంచడంలో జొన్నలు సహకరిస్తాయట. శరీరంలో శక్తి స్థాయుల్ని పెంచడానికి కూడా తోడ్పడతాయని చెబుతున్నారు నిపుణులు. ఎన్ని ప్రయోజనాలున్నప్పటికీ.. కొన్ని రకాల చిరు ధాన్యాల విషయంలో తమ శరీర తత్వాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని, సంబంధిత నిపుణుల సలహా మేరకే వీటిని ఆహారంలో చేర్చుకోవడం మంచిదన్న విషయం గుర్తుంచుకోవాలి.



## చక్కటి జుట్టు కోసం..!

ఒత్తిడి, కాలుష్యం.. మొదలైన కారణాల వల్ల చాలామందికి చిన్న వయసులోనే వివిధ కేశ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని దూరం చేసుకునేందుకు మార్కెట్లో దొరికే వివిధ రకాల హెయిర్ కేర్ ఉత్పత్తులు, నూనెలను ఆశ్రయిస్తున్నారు. కానీ, ఇలాంటి కొన్ని ఉత్పత్తులను ఇంట్లోనే సహజసిద్ధంగా చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఈ నూనె అలాంటిదేనంటున్నారు!

కొబ్బరినూనె – అరకప్పు
కరివేపాకు – 15 నుంచి 20 రెబ్బలు
మెంతులు – టేబుల్ స్పూన్
ఉల్లిపాయ – (సన్నగా తరుక్కోవాలి)

పైన చెప్పిన పదార్థాలన్నీ ఓ మందపాటి పాత్రలో తీసుకుని మీడియం మంటపై అరగంట పాటు మరగనివ్వాలి. ఆ తర్వాత మిశ్రమాన్ని చల్లారనిచ్చి వడకట్టాలి. ఈ నూనెను బాటిల్‌లో నింపి.. కావాల్సినప్పుడు ఉపయోగించవచ్చని చెబుతున్నారు నిపుణులు.

కరివేపాకులో పుష్కలంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు జుట్టుకు కావాల్సిన తేమను అందించి సహజమైన మాయిశ్చరైజర్‌లా పనిచేస్తాయట. ఇందులోని ప్రొటీన్లు జుట్టుకు పటుత్వాన్ని అందిస్తాయంటున్నారు నిపుణులు.

కొబ్బరి నూనె కురులకు రక్షణ కలిగిస్తుంది. కుదుళ్లకు బలాన్ని అందించి జుట్టు చివర్లు చిట్లిపోకుండా కాపాడుతుందట. మెంతుల్లో ఉండే ప్రొటీన్, నికోటినిక్ యాసిడ్.. మొదలైనవి చుండ్రు సమస్యను తగ్గించడంలో సహాయం చేస్తాయంటున్నారు నిపుణులు.



## బోర్డు నిజాయతీగా సమీక్షించాల్సింది: అతాను

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డుపై మాజీ ఛైర్మన్ అతాను చక్రవర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. తన రాజీనామా లేఖలోని అంశాలపై అంతర్గత సమీక్ష చేయకుండా, న్యాయ సంస్థలను నియమించి నివేదిక తెప్పించుకోవడం నామమాత్రపు చర్యేనని అన్నారు. ఈ న్యాయ సంస్థల విచారణ పరిధి గురించి తనకు లిఖితపూర్వకంగా బోర్డు తెలియజేయలేదని చక్రవర్తి తెలిపారు. 'బోర్డు విషయాలను బయటి వ్యక్తులతో బహిరంగంగా చర్చించడం నాకు ఇష్టం లేదు. దర్యాప్తు పరిధి ఏమిటో స్పష్టత ఇస్తే మాట్లాడతానని బోర్డు ఛైర్మన్‌ను కోరాను. కానీ వారు సమాధానాన్ని దాటవేశారు. నేను సహకరించకపోలేదు. కేవలం వారి స్పష్టత కోసం వేచిచూశాను' అని వివరించారు.




# ఐటీసీ నుంచి రూ.3,896 కోట్ల డివిడెండు

బ్రిటిష్ అమెరికన్ టొబాకో (బీఏటీ)తో అనుసంధానమైన రెండు సంస్థలు.. దేశీయ దిగ్గజ కంపెనీ ఐటీసీ నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3,895.74 కోట్ల డివిడెండును పొందాయి. ఈ విషయాన్ని ఐటీసీ తన తాజా వార్షిక నివేదికలో వెల్లడించింది. ఐటీసీలో వ్యూహాత్మక పెట్టుబడిని టొబాకో మానుఫ్యాక్చరర్స్ (ఇండియా) లిమిటెడ్, మిడిల్టన్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ లిమిటెడ్, రోత్‌మన్స్ ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ అనే మూడు సంస్థల ద్వారా బీఏటీ కొనసాగిస్తోంది. కంపెనీ తాజా వార్షిక నివేదిక ప్రకారం, ఐటీసీ సంస్థ టొబాకో మానుఫ్యాక్చరర్స్ (ఇండియా) లిమిటెడ్ (టీఎంఐ), మిడిల్టన్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు మొత్తం రూ.3,895.75 కోట్ల డివిడెండును చెల్లించింది. అంతకుముందు ఆర్థిక సంవతర్సం (2024-25)లో ఇది రూ.4,239 కోట్లుగా ఉండగా, తాజా చెల్లింపులో వార్షిక ప్రాతిపదికన 8.1 శాతం తగ్గుదల నమోదైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఐటీసీ సంస్థ టీఎంఐకి రూ.3,197.89 కోట్లు, మిడిల్టన్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీకి రూ.697.86 కోట్లు చెల్లించింది. 2026 మార్చి నాటికి ఐటీసీలో టీఎంఐకి 17.79 శాతం వాటా ఉండగా, మిడిల్టన్ ఇన్వెస్ట్ మెంట్ కంపెనీకి 3.88 శాతం వాటా ఉంది. 1.24 శాతం వాటా కలిగిన రోత్‌మన్స్ ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రైజ్‌కు చెల్లించిన డివిడెండు మొత్తాన్ని వార్షిక నివేదికలో వెల్లడించలేదు.




# సంక్షోభాల్లో దేశానికి తోడుగా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు



దేశంలో ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా, ఇంధన సరఫరా ఎక్కడా ఆగకుండా నిరంతరాయంగా నడిపించింది మాత్రం ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లే. భారీ వరదలు, కొవిడ్ మహమ్మారి నుంచి తాజాగా పశ్చిమాసియా యుద్ధం వరకు ప్రతి సంక్షోభాన్ని ఈ కంపెనీలు సమర్థవంతంగా ఎదుర్కొన్నాయి. తక్కువ రాబడి, ఇంధన ధరల్లో ప్రభుత్వ జోక్యం, భారీ నిర్వహణ వ్యయాల వల్ల గతంలో రెండుసార్లు ప్రైవేటీకరణ అంచుల వరకు ఈ సంస్థలు వెళ్లాయి. అయినా కూడా దేశానికి అత్యవసర సమయాల్లో 'లైఫ్ లైన్'గా నిలుస్తున్నాయి. సమయంలో.. 2015లో చెన్నై వరదల సమయంలో రిటెయిల్ ఔట్‌లెట్‌లు మూతపడినా.. ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఇంధనాన్ని తరలించి అత్యవసర సేవలు నిలిచిపోకుండా చేశాయి. కొవిడ్-19 లాక్‌డౌన్ సమయంలో ఎటవంటి అంతరాయం లేకుండా పెట్రోల్ బంకులు తెరిచి ఉంచారు. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్‌లను ఇళ్లకు అందజేశారు. మెడికల్ విమానాల కోసం విమాన ఇంధన సరఫరాను నిరంతరం పర్యవేక్షించారు. రిఫైనరీల్లో ఉత్పత్తి ఆగకుండా ఉండేందుకు ఇంజినీర్లు వారాల తరబడి లోపలే ఐసోలేషన్‌లో ఉండి పనిచేశారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల హర్మూజ్ జలసంధి మూసివేసిన వెంటనే చమురు కంపెనీలు సత్వరం స్పందించాయి. అంతర్జాతీయ చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగినప్పటికీ, వినియోగదారులపై భారం పడకుండా రెండున్నర నెలల పాటు మూడు కంపెనీలే భరించాయి. ఆ తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.7.50 చొప్పున పరిమితంగా పెంచాయి. గ్యాస్ సిలిండర్ ధరను రూ.89, సీఎన్‌జీని కేజీకి రూ.6 మాత్రమే పెంచాయి. ప్రపంచంలో ఇతర పెద్ద దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ప్రైవేట్ సంస్థ నయారా, షెల్ మాత్రం పెరిగిన ధరలను తక్షణమే వినియోగదారులపై బదలాయించాయి. క్రిసిల్ రేటింగ్స్ ప్రకారం.. ఈ ఏడాది మార్చి నుంచి మే మధ్యలో మూడు ప్రభుత్వ రంగ సంస్థలు మొత్తంగా రూ.40,000- 50,000 కోట్ల నికర నష్టాలను చవిచూశాయి. కంపెనీల మొత్తం వార్షిక లాభాలతో ఇది సమానం. 2002 వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ విక్రయానికి ప్రయత్నించారు. పార్లమెంట్ చట్టం ద్వారా జాతీయం చేయడం వల్ల ఇందుకు ఉభయసభల ఆమోదం తప్పనిసరని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. 2020లో మోదీ ప్రభుత్వం బీపీసీఎల్‌లో మెజారిటీ వాటాను విక్రయించడానికి ప్రయత్నించింది. అంతర్జాతీయ మార్కెట్ అనిశ్చితి కారణంగా బిడ్డర్లు వెనక్కి తగ్గడంతో ఈ ప్రక్రియను నిలిపివేశారు. మన దేశం తన ఇంధన అవసరాల కోసం దాదాపు 88% దిగుమతులపైనే ఆధారపడుతోంది. దేశంలోని మొత్తం ఇంధన రిటెయిల్ నెట్‌వర్క్‌లో 90 శాతం వాటా ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థలదే కావడంతో, ప్రభుత్వం అత్యవసర సమయాల్లో కీలక నిర్ణయాలు అమలు చేయడానికి వీలుపడుతోంది.

## వాట్సప్ వెబ్ ద్వారా మాల్‌వేర్ దాడులు

వాట్సప్ వెబ్, డెస్క్‌టాప్ వినియోగదారులే లక్ష్యంగా దేశంలో భారీ మాల్‌వేర్ దాడులు జరుగుతున్నాయని జాతీయ సైబర్ సెక్యూరిటీ పర్యవేక్షణ సంస్థ సెర్ట్‌ఇన్ హెచ్చరించింది. వినియోగదారుల పరికరాల్లోకి ఈ మాల్‌వేర్ ప్రవేశిస్తే, సైబర్ నేరగాళ్లు అనుమతి లేకుండానే కంప్యూటర్, ల్యాప్‌టాప్‌ను తమ అధీనంలోకి



తీసుకునే ప్రమాదం ఉందని పేర్కొంది. ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థలు కాస్పెర్స్కీ, సెక్యూర్‌లిస్ట్‌ల పరిశోధనల ఆధారంగా సెర్ట్‌ఇన్ ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం.. హ్యాకర్లు మొదట కొన్ని ఖాతాలను హ్యాక్ చేస్తున్నారు. ఆ తర్వాత సదరు ఖాతాల్లోని కాంటాక్ట్స్‌లో ఉన్న స్నేహితులు, బంధువులు, సహోద్యోగులకు ప్రమాదకరమైన ఫైళ్లను మెసేజ్ రూపంలో పంపుతున్నారు. మనకు తెలిసిన వాళ్ల దగ్గర నుంచే మెసేజ్ లేదా ఫైల్ రావడంతో, వినియోగదారులు ఎటువంటి అనుమానం లేకుండా ఓపెన్ చేసి హ్యాకర్ల వలలో పడుతున్నారు. ఈ మాల్‌వేర్ ద్వారా హ్యాకర్లు విజువల్ బేసిక్ స్క్రిప్ట్ కోడింగ్ ఫైళ్లను అటాచ్‌మెంట్‌లుగా పంపుతున్నారు. ఈ ఫైళ్లను ఓపెన్ చేసి, సిస్టమ్‌లో రన్ చేస్తే సైబర్ నేరగాళ్లు దూరం నుంచే వినియోగదారుల పరికరాలను నియంత్రించగలరు. ఖాతాల పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలను దొంగలించి ఆర్థిక మోసాలకు పాల్పడతారు. తెలియని ఫైళ్లను తెరవవద్దని సెర్ట్ ఇన్ సూచిస్తోంది. ఎవరైనా ఫైల్ పంపితే, ఫోన్ చేసి ధ్రువీకరించుకోవడం మంచిదని చెబుతోంది.

## నిరాశపర్చిన టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్..

ఇన్సూరెన్స్ కంపెనీ టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్ షేర్లు సోమవారం స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.152తో పోలిస్తే దాదాపు 11 శాతం తక్కువ ధరకు షేర్లు నమోదవడం మదుపర్లను నిరాశకు గురిచేసింది. బీఎస్ఈలో షేరు విలువ రూ.136.20 వద్ద మొదలై.. ఓ దశలో 13 శాతం కుంగి రూ.132.15కు పడిపోయింది. అటు ఎన్ఎస్ఈలోనూ 11.25 శాతం డిస్కౌంట్‌తో రూ.134.90 వద్ద ట్రేడింగ్‌ను మొదలుపెట్టింది. జూన్ 19 నుంచి 23 వరకు జరిగిన ఈ ఐపీఓకు బిడ్డింగ్ ఇన్వెస్టర్ల నుంచి అంతగా స్పందన రాలేదు. చివరి రోజు పూర్తయ్యేసరికి కేవలం 1.20 రెట్ల సబ్‌స్క్రిప్షన్ మాత్రమే నమోదు చేసింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.4,069.70 కోట్లుగా ఉంది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.883 కోట్లను ఇన్వెస్టర్ల నుంచి సమీకరించింది. ధరల శ్రేణిని రూ.144-152గా నిర్ణయించింది.

# కృత్రిమ మేధతో మరింత సమర్థంగా జీఎస్‌టీ

దేశ వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానం త్వరలోనే పదో వసంతంలోకి అడుగుపెట్టబోతోంది. 2017 జులై 1న అమల్లోకి వచ్చిన ఈ పరోక్ష పన్నుల విధానం.. భారత కీలక పన్ను సంస్కరణల్లో ఒకటిగా నిలిచిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటివరకు జీఎస్‌టీ అమలు, దాని సంబంధిత సవాళ్లను పరిష్కరించడంపై దృష్టి పెట్టిన ప్రభుత్వం.. ఇక నుంచి కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించడం ద్వారా ఈ పన్ను విధానాన్ని మరింత సమర్థంగా మార్చాలని అనుకుంటోంది. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) కోసం నిబంధనల పాటింపును సులభతరం చేయడానికి సాంకేతికతను ఎక్కువగా ఉపయోగిస్తోంది. అదే సమయంలో పన్ను ఆదాయ నష్ట అంచనాను మెరుగుపర్చడానికి, ఎగవేతలను అరికట్టడానికి, మానవ ప్రమేయాన్ని తగ్గించడానికి జీఎస్‌టీ, ఆదాయపు పన్ను, కస్టమ్స్ డేటాబేస్‌లను ప్రభుత్వం అనుసంధానిస్తోంది. రిఫండ్‌ల జారీ ప్రక్రియను వేగవంతం చేయడం కూడా ఏఐ సాంకేతికతను ఉపయోగించడం వెనక మరో లక్ష్యం. గత తొమ్మిదేళ్లలో పన్ను చెల్లింపుదార్ల సంఖ్య, నెలవారీ రెవెన్యూ వసూళ్లలో పెరుగుదలను గమనిస్తే.. భారత ఆర్థిక వ్యవస్థ అధికారికంగా మరింత పటిష్ఠం అవుతోందనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది. జీఎస్‌టీ అమలు ప్రారంభంలో నాలుగు రకాల పన్ను రేట్లు (5%, 12%, 18%, 28%), అదనంగా సెస్సులు ఉండేవి. 2025 సెప్టెంబరు 22న జరిగిన పన్ను రేట్ల హేతుబద్ధీకరణ తర్వాత ఈ శ్లాబుల సంఖ్యను తగ్గించారు. నిత్యావసర వస్తువులకు 5%, సాధారణ వస్తువులు, సేవలకు 18 శాతంతో పాటు, విలాసవంతమైన, హానికారక వస్తువులకు ప్రత్యేకంగా 40 శాతం శ్లాబ్‌ను ఉంచారు.

పెట్రోలియం ఉత్పత్తులైన ముడి చమురు, పెట్రోలు, డీజిల్, విమాన ఇంధనం, సహజవాయువును జీఎస్‌టీ పరిధిలోకి తీసుకొని రావడం ఇప్పటికీ పెద్ద సవాలుగానే ఉంది. రాష్ట్రాలు తమ పన్ను ప్రయోజనాలను వదులుకోవడానికి సుముఖంగా లేకపోవడమే ఇందుకు కారణం.







## పాలమూరు స్ట్రైకర్స్‌తో మ్యాచ్..



టీజీ20 లీగ్ 2026లో భాగంగా పాలమూరు స్ట్రైకర్స్, నల్గొండ నైట్స్ తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాలమూరు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు విఘ్నేశ్ రెడ్డి (4), చైతన్య రెడ్డి (17), కరణ్ యాదవ్ (0), రోహిత్ రాయుడు విఫలమయ్యారు. దీంతో పాలమూరు 57 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ప్రజ్ఞయ్ రెడ్డి (55; 35 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), రతన్ తేజ (50; 33 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకాలు బాది జట్టును ఆదుకున్నారు. మహ్మద్ అఫ్రిది (14) పరుగులు చేశాడు. నల్గొండ బౌలర్లలో అర్ఫాజ్ అహ్మద్ 3, నిశాంత్ 2, అనికేత్ రెడ్డి, దీవేశ్ సింగ్ చెరో వికెట్ పడగొట్టారు.

# ఫిఫాకు ఇరాన్ భావోద్వేగ వీడ్కోలు



ఫిఫా ప్రపంచకప్‌లో తొలిసారి నాకౌట్ దశకు చేరుకోవాలన్న ఇరాన్ కలలు కల్లలయ్యాయి. ఈ జట్టు గ్రూప్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. దీంతో చివరి మ్యాచ్ అనంతరం లాకర్ రూమ్‌లో ఇరాన్ జట్టు ఉద్వేగపూరిత లేఖను ఉంచింది. వేల సంవత్సరాలుగా విజయం కంటే గౌరవానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చిన ఇరాన్ నుంచి తాము వచ్చామని ఆటగాళ్లు అందులో రాసినట్లుగా ఉంది. ''మా ఉద్దేశంలో ఫుట్‌బాల్ అనేది కేవలం పోటీ మాత్రమే కాదు.. అది వ్యక్తిత్వానికి సంబంధించిన పరీక్ష. పాయింట్లను అనేక విధాలుగా గెలుచుకోవచ్చు, కానీ గౌరవాన్ని అలా సంపాదించలేం. ఏ జట్టయినా గ్రూప్ దశ నుంచి నాకౌట్‌కు చేరుకోవచ్చు.. కానీ కేవలం న్యాయం, గౌరవంతో మాత్రమే ఎవరైనా చరిత్ర ముందు సగర్వంగా నిలబడగలుగుతారు' అని ఇరాన్ ఆ లేఖలో రాసుకొచ్చింది. గ్రూప్ దశ చివరి మ్యాచ్‌లో ఈజిప్టుతో మ్యాచ్ 1-1తో డ్రా అవడంతో ఈ జట్టు తన ప్రయాణాన్ని ముగించింది (Iran leave FIFA 2026). గ్రూప్ స్టేజ్‌లో టాప్-2లో నిలిస్తే నాకౌట్‌కు చేరే అవకాశం ఉంటుంది. కానీ, ఇరాన్ మూడో స్థానంలో ఉండటంతో నేరుగా వెళ్లే ఛాన్స్ లేకపోయింది. ఇక, మూడో స్థానంలో ఉన్న జట్ల మధ్య బెస్ట్ ఆఫ్ 8లోనూ ఇరాన్‌కు చోటు దక్కలేదు. లీగ్ స్టేజ్‌లో చివరిదైన ఆస్ట్రియా- అల్జీరియా మ్యాచ్ 3-3 డ్రాగా ముగియడంతో.. ఈ రెండు బెస్ట్ ఆఫ్ 8లో స్థానం సంపాదించాయి. ఫలితంగా ఇరాన్ జట్టు ఇంటిముఖం పట్టాల్సి వచ్చింది.

టోర్నమెంట్‌లో భాగంగా ఇరాన్ జట్టుకు వసతి ఏర్పాట్లపై కెప్టెన్ మెహదీ తరేమీ ఫిఫా (FIFA World Cup 2026)పై విమర్శలు గుప్పించారు. అసలు తమకు ఎవరైనా సాయం చేయాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. టోర్నీ సమయంలో ఆంక్షల పేరుతో తమ జట్టుకు సరైన వసతి సౌకర్యాలు కల్పించలేదన్నారు. మ్యాచ్‌ల సమయంలో తమ జట్టును అణచివేతకు గురిచేశారని ఇరాన్ కోచ్ ఆరోపించారు.

# ఓటమిని నమ్మలేకపోతున్నాం: భారత కోచ్

యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వకపోవడంతో భారత మేనేజ్‌మెంట్‌పై ప్రశ్నల వర్షం కురుస్తోంది. ఇక ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌ను ఓడిపోవడంపైనా తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే టీమ్‌ఇండియా అసిస్టెంట్ కోచ్ రయాన్ టెన్ డస్కెటే వీటిపై వివరణ ఇచ్చాడు. ఇతర ప్లేయర్ల మాదిరిగానే అరంగేట్రం ప్రక్రియ వైభవ్‌కూ ఒకేలా ఉంటుందని తెలిపాడు. ''ఇప్పటికీ మేం సిరీస్ ఓటమిని నమ్మలేకపోతున్నాం. వరల్డ్ కప్‌ను గెలిచిన జట్టుకు ఇలాంటి క్లిష్ట పరిస్థితులు వస్తాయని ఎవరూ ఊహించి ఉండరు. బేసిక్స్‌ను బాగా పాటించిన జట్టు చేతిలో పరాజయం చవిచూశాం. ఇంకాస్త స్మార్ట్‌గా క్రికెట్ ఆడాల్సిన అవసరం ఉందని గ్రహించాం. ఇక రెండోది.. భిన్నమైన పరిస్థితులకు అలవాటు పడటం త్వరగా నేర్చుకోవాలి. ఈ విషయంలో మేం వెనుకబడిపోయామని చెప్పగలను. అదే మా ఓటమికి ప్రధాన కారణమైంది. ఇంతకుముందు వరకూ స్వేచ్ఛగా సిక్స్‌లు కొట్టడానికి, దూకుడుగా ఆడేందుకు బాగా అలవాటు పడిపోయాం. ఐర్లాండ్‌లో పరిస్థితులు భిన్నం. ఆ సమస్యను సరిగ్గా గుర్తించలేకపోయాం. ఇక ఇంగ్లాండ్‌లోనూ ఇదే పరిస్థితి ఉండొచ్చు. అయితే, పిచ్‌లు ఇప్పటి కంటే ఇంకాస్త వేగంగా ఉండే అవకాశం లేకపోలేదు. అక్కడ గెలవాలంటే మేం మా ఆటతీరు విషయంలోనే కాకుండా.. పరిస్థితులకు అనుగుణంగా మారాల్సిందే'' అని టెన్ వెల్లడించాడు. ''వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌కు సిద్ధమే. అందులో ఎలాంటి సందేహం లేదు. అదే సమయంలో సంజు శాంసన్ వంటి ప్రపంచ కప్ హీరో కూడా జట్టుతోపాటు ఉన్నాడు. ఐపీఎల్‌లో ఇద్దరూ మంచి ఆటతీరు ప్రదర్శించారు. ఆటగాళ్లకు భరోసా ఇవ్వడంతోపాటు జట్టులో వారికి తగినంత సమయం కల్పిస్తామనే సందేశాన్ని అందించడం చాలా ముఖ్యం. మేం కూడా వైభవ్ ఆటను ప్రత్యక్షంగా చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. ఇతరఅరంగేట్రం ఆటగాళ్లకు ఎలాంటి ప్రాసెస్ ఉంటుందో.. వైభవ్ విషయంలోనూ అదే వర్తిస్తుంది. అతడి ఆటతీరుపై మాకెలాంటి సందేహాలు లేవు'' అని టెన్ డస్కెటే వివరించాడు.



## మేమైతే గంభీర్‌ను కోచ్‌గా నియమించుకోం: ఐస్‌లాండ్ క్రికెట్ ట్రోలింగ్

మొన్నటి వరకూ టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా టీమ్‌ఇండియా అంటే ప్రతి ఒక్కరికీ హడల్. కానీ, ఐర్లాండ్‌తో వరుసగా రెండు టీ20ల్లోనూ ఓడిపోవడంతో ట్రోలర్లకు మళ్లీ ఛాన్స్ ఇచ్చినట్లైంది. మరీ ముఖ్యంగా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఇప్పటి వరకు ఐసీసీ సభ్యదేశం కూడా కాని ఐస్‌లాండ్ క్రికెట్ అసోషియేషన్ కూడా తన సోషల్ మీడియాలో గంభీర్‌ను ట్రోల్ చేయడం గమనార్హం. మరోవైపు, భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ సైతం గంభీర్ తీరును విమర్శించాడు. 'మేం గౌతమ్ గంభీర్‌ను మా కోచింగ్ స్టాఫ్‌గా తీసుకోవాలని అనుకోవడం లేదు. మాకు ఇష్టం లేదు కూడానూ. అతడిలో అద్భుతమైన ప్రతిభ ఉంది. ఐర్లాండ్‌లో ఇలాంటి ఫలితాలను అందించాలంటే అసాధారణమైన ప్రతిభ కావాలి. అది గంభీర్ వద్ద పుష్కలంగా ఉందనిపిస్తోంది'' అని ఐస్‌లాండ్ క్రికెట్ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఐర్లాండ్‌తో సిరీస్‌లో ప్రధాన బ్యాటర్లు, బౌలర్ల కంటే ఆల్‌రౌండర్లే ఎక్కువ మంది తుది జట్టులో స్థానం దక్కించుకున్నారు. ఇదే విషయాన్ని సంజయ్ మంజ్రేకర్ ప్రస్తావిస్తూ.. ''గతంలో ఆల్‌రౌండర్ల సంఖ్య తక్కువగా ఉండేది. కానీ, గంభీర్ వచ్చాక వారికి ఎక్కువగా అవకాశాలు వస్తున్నాయి. భారత జట్టుకు ప్రధాన మిడిలార్డర్ బ్యాటర్లు అవసరం'' అని పోస్టు పెట్టాడు.



# యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ రన్నరప్‌గా కిదాంబి శ్రీకాంత్



యూఎస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ కిదాంబి శ్రీకాంత్ చివరిమెట్టుపై తడబడ్డాడు. ఫైనల్లో చైనీస్ తైపీ క్రీడాకారుడు సు లియాంగ్ చేతిలో ఓడి.. రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం గంటకుపైగా హోరాహోరీగా మ్యాచ్ జరిగింది. ఈ 33 ఏళ్ల షట్లర్ తొలిగేమ్‌లో ఓడినప్పటికీ.. తర్వాత పుంజుకున్నాడు. కానీ, వయసులో తనకన్నా 9 ఏళ్ల చిన్నవాడైన లియాంగ్ వేగాన్ని అందుకోవడంలో వెనకబడ్డాడు. ఈ సీజన్‌లో మొదటి ఫైనల్ ఆడిన మాజీ నెంబర్ వన్.. తొలుత ఆటను వేగంగానే ప్రారంభించాడు. తర్వాత లయ తప్పడంతో అనవసర తప్పిదాలు దెబ్బతీశాయి. ఈ పోరులో శ్రీకాంత్ చివరకు 15-21, 21-16, 9-21 తేడాతో ఓడిపోయాడు. గతేడాది మలేసియా మాస్టర్స్ సూపర్ 500, సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300లో కూడా రెండోస్థానంతోనే సరిపెట్టుకున్నాడు. 2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో శ్రీకాంత్ రజతపతకాన్ని గెల్చుకున్నాడు.

# వుదయం సినిమా

MOVIE TIME!

## డిజిటల్ ఛార్జీలు తగ్గించాలంటూ ఫిలించాంబర్ వద్ద ఆర్కే గౌడ్, దీక్ష సినిమా టీమ్ మహాధర్నా




**వుదయం సినిమా** చిన్న చిత్రాలకు థియేటర్స్ లభించని పరిస్థితులు ఇండస్ట్రీలో చూస్తున్నాం. అలాగే చిన్న నిర్మాతలు తమ సినిమాలను థియేటర్స్ లో రిలీజ్ చేసుకోవాలంటే క్యూబ్, యూఎఫ్ వో, పీఎక్స్ డీ వంటి వీపీఎఫ్ (వర్చువల్ ప్రింట్ ఫీ) ఖర్చులు భారంగా మారాయి. చిన్న చిత్రాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న ఇలాంటి సమస్యలను అటు ప్రభుత్వం, ఇటు ఇండస్ట్రీ పెద్దలు పరిష్కరించాలని కోరుతూ ఆర్కే గౌడ్, దీక్ష మూవీ టీమ్ హైదరాబాద్ ఫిలించాంబర్ వద్ద మహాధర్నా చేపట్టింది. ఈ మహాధర్నాలో ఆర్కే దీక్ష మూవీ దర్శక నిర్మాత, తెలంగాణ ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణగౌడ్. నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్, నిర్మాతలు గురురాజ్, లయన్ సాయి వెంకట్, హీరో కిరణ్, షెరాజ్ మెహదీ తదితరులు పాల్గొన్నారు.

## 'జై భీమ్' దర్శకుడి కొత్త ప్రాజెక్ట్!





**వుదయం సినిమా :** భారతీయ సినీ పరిశ్రమలో వరుస బ్లాక్‌బస్టర్ చిత్రాలతో తనదైన ముద్ర వేసుకున్న హోంబలే ఫిల్మ్స్ మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించింది. విజయ్ కిరగందూర్ నిర్మాణంలో హీరో సూర్య, నటి కాయదు లోహర్, ప్రముఖ దర్శకుడు టి.జె. జ్ఞానవేల్ కాంబినేషన్‌లో ఈ భారీ చిత్రం రూపొందనుంది. పవర్ ఫుల్ కథను అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కించనున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రెండు దశాబ్దాలుగా తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న సూర్య భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిభావంతులైన నటుల్లో ఒకరు. రెండు జాతీయ పురస్కారాలు, ఏడు ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డులు అందుకున్న ఆయన, కమర్షియల్ విజయాలతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఎన్నో చిత్రాల్లో నటించారు. నిర్మాతగా కూడా విలువైన కథలను ప్రేక్షకులకు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. దర్శకుడు టి.జే. జ్ఞానవేల్ 'జై భీమ్' చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు. సామాజిక అంశాన్ని హృద్యంగా ఆవిష్కరించిన ఆ చిత్రం భారతీయ సినిమాల్లో అత్యధిక IMDb రేటింగ్ పొందిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. బలమైన భావోద్వేగాలు, ఆలోచింపజేసే కథనాలతో ఆయన సమకాలీన దర్శకుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. హోంబలే ఫిల్మ్స్ ఇప్పటికే కేజీఎఫ్, కాంతార, సలార్ వంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో భారతీయ సినీ పరిశ్రమలో కొత్త ప్రమాణాలను నెలకొల్పింది.

## ఎన్టీఆర్, త్రివిక్రమ్ కలయికలో మరో భారీ చిత్రం..




**వుదయం సినిమా :** విజయాలు సాధించే చిత్రాలు ఎన్నో వస్తుంటాయి. కానీ, చరిత్ర సృష్టించి, చిరస్థాయిగా నిలిచిపోయే చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. అలాంటి అరుదైన అద్భుతానికి శ్రీకారం చుట్టారు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్.ఎన్నో ఏళ్లుగా సినీ అభిమానులు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్న క్షణం ఎట్టకేలకు వచ్చింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటైన ఎన్టీఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రాబోతున్న మరో భారీ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'అరవింద సమేత వీర రాఘవ' చిత్రం ఘన విజయం సాధించడమే కాకుండా, విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు మరోసారి ఈ నటుడు-దర్శకుడు ద్వయం, భారతీయ చలనచిత్ర రంగంలో సరికొత్త రికార్డులను సృష్టించేందుకు, ఒక అసాధారణమైన సినిమా ప్రయాణాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతోంది.అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రం దైవిక నేపథ్యంతో రూపుదిద్దుకోనుంది. పురాణాల స్ఫూర్తితో సాగే కథనం, లోతైన భావోద్వేగాలు, ఉత్కంఠభరితమైన యుద్ధ సన్నివేశాలు, అద్భుతమైన సరికొత్త ప్రపంచ నిర్మాణంతో ఈ చిత్రం ప్రేక్షకులకు అపూర్వమైన అనుభూతిని అందించనుంది. ఎన్టీఆర్ నట విశ్వరూపానికి, త్రివిక్రమ్ కలం బలానికి తోడుగా ఈ దైవిక కథాంశం తోడవ్వడం సినిమాపై అంచనాలను ఆకాశాన్నంటేలా చేస్తోంది.ఈ ప్రతిష్టాత్మక చిత్రం కోసం అత్యున్నత స్థాయి సాంకేతిక బృందం పని చేస్తోంది. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారు. తనదైన నేపథ్య సంగీతంతో, పాటలతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లనున్నారు.

## ఫస్ట్ సింగిల్ 'ఇరుముడి కట్టు' రిలీజ్



**వుదయం సినిమా :** మాస్ మహారాజా రవితేజ మోస్ట్ అవైటెడ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం మ్యూజికల్ ప్రమోషన్స్‌కు తొలి పాట ఇరుముడి కట్టుతో అద్భుతంగా శ్రీకారం చుట్టింది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్‌కు లభించిన అద్భుత స్పందన, సంగీత దర్శకుడు జి.వి. ప్రకాశ్ కుమార్ అద్భుతమైన ఫామ్ తో ఈ పాటపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.'ఇరుముడి కట్టు' ఒక ఆధ్యాత్మిక భావోద్వేగాలతో కూడిన భక్తి పాట. జి.వి. ప్రకాశ్ కుమార్ స్వరపరిచిన ఈ పాటలో అయ్యప్ప స్వామి భక్తి, నియమ నిష్ఠలు, మండల దీక్ష పవిత్రతను అద్భుతంగా ఆవిష్కరించారు. ఈ స్వరకల్పన పాట ప్రారంభం నుంచి ముగింపు వరకు అద్భుతమైన భక్తి పారవశ్యాన్ని కలిగిస్తుంది.ఈ పాటకు దర్శకుడు శివ నిర్వాణ, కళ్యాణ్ చక్రవర్తితో కలిసి సాహిత్యం అందించారు. అయ్యప్ప మాల ధరించి మండల దీక్ష చేపట్టిన ఓ భక్తుడు ఇరుముడి కట్టుకుని శబరిమల యాత్ర చేసే పవిత్ర ప్రయాణాన్ని ఈ సాహిత్యం ఎంతో హృద్యంగా కనిపించింది. అయ్యప్ప మాల ధరించడం వెనుక ఉన్న ఆధ్యాత్మికత, నియమశిక్షణ, జీవిత సారాన్ని హీరో కోణంలో అద్భుతంగా చూపించారు. అనంతు పవర్ ఫుల్ వోకల్స్ ప్రతి పదానికి భక్తి భావాన్ని జోడించి పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు.ఈ పాటలో రవితేజ అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తుడి పాత్రలో ఒదిగి పోయారు. ఆయన లుక్, భక్తి భావం, హావభావాలు, స్క్రీన్ ప్రెజెన్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బాబా భాస్కర్ కోరియోగ్రఫీ పాటలోని ఆధ్యాత్మికతను మరింత గొప్పగా ఆవిష్కరించింది.ఈ పాటలో రవితేజ భార్య, కుమార్తె పాత్రల్లో నటిస్తున్న ప్రియా భవానీ శంకర్, బేబీ నక్షత్ర కనిపించే భావోద్వేగ సన్నివేశాలు కథకు మరింత ఎమోషన్ ని జోడించాయి. 'ఇరుముడి కట్టు' మనసును తాకే భక్తి గీతంగా నిలుస్తూ 'ఇరుముడి' సినిమా అందించబోయే ఎమోషనల్ జర్నీకి అద్భుతమైన ఆరంభాన్ని అందించింది.

## డైరెక్టర్‌గా ఎనర్జిటిక్ స్టార్

**వుదయం సినిమా :** ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రం #RAPO23 అధికారికంగా లాంచ్ చేశారు. ఎన్నో ఏళ్ల పాషన్, ప్లానింగ్ తో రూపుదిద్దుకున్న ఈ చిత్రంతో రామ్ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్ పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. రామ్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్ తెరకెక్కుతున్న చిత్రం ఇది. ఈ చిత్రం ఈరోజు సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. నిర్మాత కృష్ణ పోతినేని స్క్రిప్ట్ ను రామ్ పోతినేనికి అందజేశారు. ముహూర్తపు సన్నివేశానికి పి. మురళీ మోహన్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, పి.వి. రవి కిషోర్ క్లాప్ కొట్టారు. దర్శకుడిగా తన ప్రయాణానికి శ్రీకారం చుడుతూ తొలి షాట్‌కు రామ్ పోతినేని స్వయంగా దర్శకత్వం వహించారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా ఈ రోజు హైదరాబాద్ శివార్లలో ప్రారంభమైంది. కథానాయకుడు రామ్ పోతినేని చిత్రంలోని ప్రధాన తారాగణంతో కలిసి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఒరిజినల్ కథను స్వయంగా రామ్ పోతినేని రాశారు. నియోనోయిర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సైకాలజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా దీనిని రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని విభిన్న అంశాలను, ఆసక్తికరమైన పాత్రల ప్రయాణంతో ఈ చిత్రం ఉండబోతోంది.





## రచయిత విజయేంద్ర ప్రసాద్ ఆవిష్కరించిన "కళ్యాణం కమనీయం జీవితం"



**వుదయం సినిమా :** వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరోయిన్ గా రవి లోకిరెడ్డి డైరెక్షన్ లో పైలా ప్రసాద్ రావు కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం కళ్యాణం కమనీయం జీవితం. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని రాజవంశీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ: టైటిల్ చాలా బాగుంది. రాజవంశీ టైటిల్ గురించి చెప్పగానే చాలా ఇంప్రెస్ అయ్యాను. ప్రొడ్యూసర్స్ మంచి ప్రయత్నం చేశారు .డైరెక్టర్ విజన్ పోస్టర్ ద్వారా తెలుస్తుంది.

## ఆడియన్స్ ఖచ్చితంగా సర్‌ప్రైజ్ అవుతారు

### - హీరోయిన్ నభా నటేష్

**వుదయం సినిమా :** పవర్ విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం - ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ నభా నటేష్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**నాగబంధంలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**

ఇప్పటివరకు ఇలాంటి పాత్ర నేను చేయలేదు. ఇందులో నేను పార్వతి పాత్రలో కనిపిస్తాను. తను ఒక వేద విద్యార్థిని. తన పాత్ర ఎమోషనల్‌గా చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. తన కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా నిలబడే వ్యక్తిత్వం ఆమెది. కథలో నా పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. పార్వతి తీసుకునే ప్రతి నిర్ణయం కథపై ప్రభావం చూపుతుంది. నా పాత్ర చూసి ప్రేక్షకులు తప్పకుండా సర్ప్రైజ్ అవుతారు.

**ఇందులో చాలా గ్రాండ్‌గా చిత్రీకరించిన డాన్స్ నంబర్ ఉంది కదా... దాని గురించి చెప్పండి?**

ఆ పాట చేయడం నిజంగా అద్భుతమైన అనుభవం. దాదాపు 5,000 మంది డ్యాన్సర్లతో ఆ పాటను గణేష్ ఆచార్య మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. అందులో క్లాసికల్ డాన్స్ కూడా ఉంటుంది. నిజంగా ఆ పాట బిగ్ స్క్రీన్‌పై అద్భుతంగా కనిపిస్తుంది. అలాంటి పాటను నేను ఇప్పటివరకు చేయలేదు. అది నాకు చాలా కొత్త అనుభవం. టెక్నికల్‌గా కూడా అంత పెద్ద కాన్వాస్‌పై ఆ పాటను చిత్రీకరించడం ఒక ఛాలెంజ్. అది కేవలం డాన్స్ సాంగ్ మాత్రమే కాదు... అందులో భక్తి భావం కూడా కనిపించాలని దర్శకుడు, కొరియోగ్రాఫర్‌కు ముందుగానే సూచించారు.

## 'శివ' సినిమానే నాకు స్ఫూర్తి!



**వుదయం సినిమా :** సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం 'మకుటం'. స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ నుంచి వచ్చిన టీజర్, ఫస్ట్ సింగిల్ 'ది రైజ్ అఫ్ లింగా' అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఆదివారం (జూన్ 28) నాడు సెకండ్ సింగిల్ 'నచ్చాకే వచ్చేరా' అనే పాటను విడుదల చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో.. విశాల్ మాట్లాడుతూ .. ''మకుటం'తో తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోన్నందుకు ఆనందంగా ఉంది. ఈ సారి దర్శకుడిగా మారి ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాను. 'శివ' చూసిన తరువాత దర్శకుడిగా మారాలని ఫిక్స్ అయ్యాను. ఇన్నాళ్లకు ఆ కోరిక నెరవేరింది. ఈరోజు ఆర్‌బీ చౌదరి గారిని నేను మిస్ అవుతున్నాను. 99వ ప్రాజెక్ట్ బాధ్యతల్ని ఆయన నాకు ఇచ్చారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీకి దర్శకుడిగా మారాను. ఆయన నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానే అనుకుంటున్నాను. ఆయన బ్యానర్ నుంచి పరిచయం అయిన దర్శకుల్లో నేను 45వ వ్యక్తిని. సుబ్రహ్మణ్యం గారు నా మీద పెట్టుకున్న నమ్మకంతోనే 'మకుటం' ఈ స్థాయి వరకు వచ్చింది. ఈ మూవీ కోసమే ఏడాదిపాటుగా నా పర్సనల్ విషయాల్ని పక్కన పెట్టాను. నాకు ఈ ప్రయాణంలో సాయి ధన్సిక ఎంతో అండగా నిలిచారు. 'లింగా' పాట మంచి హిట్ అయింది. అందులో నన్ను సింగర్‌గా చేయడం జీవీ ప్రకాష్ తీసుకున్న రిస్క్ (నవ్వుతూ). 'నచ్చాకే వచ్చేరా' పాటను ప్రభ అద్భుతంగా పాడింది. ఆమె పాడిన ప్రతీ పాట బ్లాక్ బస్టర్ హిట్ అయింది. దర్శకుడిగా ఇది నా మొదటి చిత్రం. నన్ను నమ్మి ఈ ప్రయాణంలో తోడుగా నిలిచిన తోటి ఆర్టిస్టులందరికీ థాంక్స్. నేను ఇంత వరకు పని చేసిన దర్శకులందరి టెక్నిక్స్‌ను ఇందులో వాడాను. ఈ సినిమా కోసం నా బెస్ట్ ఇచ్చాను అని అనుకుంటున్నాను. మూవీ గురించి నేను ఎక్కువగా చెప్పను.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.